జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంచార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989894528

రంగారెడ్డి | సోమవారం 24 మార్చి 2025 | సంపుటి : 15 | సంచిక : 200 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516
విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి
Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# పోలవరానికి సీఎం చంద్రబాబు



**27వ తేదీ ఉదయం 10 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో సీఎం చంద్రబాబు పోలవరం చేరుకుంటారు.**
**పోలవరం ప్రాజెక్ట్‌ను పరిశీలించి.. ప్రాజెక్ట్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించనున్నారు.**
**కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం వ్యూహాత్మకంగా అడుగులు**
**ఇప్పటికే రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం కేంద్రం సైతం ఇతోధికంగా సాయం అందిస్తుంది.**

ప్రజాజ్యోతి అమరావతి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్ట్‌ను మరోసారి సందర్శించనున్నారు. మార్చి 27వ తేదీ ఉదయం 10 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో సీఎం చంద్రబాబు పోలవరం చేరుకుంటారు. ఆ రోజు ఉదయం 11.00 గంటలకు ఆయన ప్రాజెక్ట్ సైట్‌కు చేరుకుంటారు. అనంతరం పోలవరం ప్రాజెక్ట్‌ను పరిశీలించి.. ప్రాజెక్ట్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు - మిగతా3లో



# రాష్ట్రవ్యాప్తంగా ఇఫ్తార్ విందు

- 27 న విజయవాడలో రాష్ట్ర స్థాయి ప్రభుత్వ ఇఫ్తార్
- నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఇందుకోసం రూ.1.50 కోట్లు నిధులను విడుదల
- ఇఫ్తార్ ను జిల్లాస్థాయిలో ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రణాళికాబద్ధంగా పకడ్బందీగా నిర్వహించాలని మైనార్టీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి కే. హర్షవర్ధన్ ఉత్తర్వులు జారీ



ప్రజాజ్యోతి అమరావతి

పవిత్ర రంజాన్ మాసంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల స్థాయిలో ఇఫ్తార్ ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.1.50 కోట్లు నిధులను విడుదల చేసింది. ఈ మేరకు మైనారిటీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి కే హర్షవర్ధన్ ఉత్తరులు జారీ చేశారు. ముస్లిం మైనార్టీల కు అత్యంత భక్తిశ్రద్ధలతో కూడిన రంజాన్ మాసంలో సాయంకాలం ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 27వ తేదీన రాష్ట్ర స్థాయి ప్రభుత్వ ఇఫ్తార్ కార్యక్రమాన్ని విజయవాడలో ఎంజీ రోడ్డులో ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించేందుకు నిర్ణయించారు. - మిగతా3లో



## నోట్ల కట్టల ఆరోపణలు నిరాధారం

- జస్టిస్ యశ్వంత్ వర్మ
- తనకు, తన కుటుంబానికి ఆ నగదుతో ఎలాంటి సంబంధం లేదు
- తమపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, అర్థరహితం
- "స్టోర్ రూంలో నేను కానీ, నా కుటుంబ సభ్యులు కానీ ఎలాంటి నగదు ఉంచలేదు
- మాకు చెందిన నగదు దొరికిందన్న ఆరోపణల్లో వాస్తవం లేదు"

## ఇండియా గేట్, రాష్ట్రపతి భవన్..
# అంతటా అంధకారం..



ఈ ఏడాది 19వ ఎర్త్ అవర్ ప్రపంచ జల దినోత్సవంతో పాటు జరిగింది.

ఎర్త్ అవర్ సందర్భంగా రాత్రి 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు చారిత్రక ప్రాంతాల్లో విద్యుత్ ఉపకరణాలను ఆపివేయడం ద్వారా ఢిల్లీలో దాదాపు 269 మెగావాట్ల విద్యుత్తును ఆదా చేశారు

## త్వరలో వైద్య శాఖలో
# పోస్టుల భర్తీ

ప్రభుత్వంలోని అన్ని శాఖలు అప్పుల్లో కురుకుపోయి ఉన్నాయి
గతంలో ఇక్కడ పని చేసిన మంత్రి చాలా బిజీ బిజీగా పనులు చేశారు
రానున్న ఆర్థిక సంవత్సరంలో పిడుగురాళ్ల మెడికల్ కాలేజ్ పూర్తి చేస్తామని హామీ



ప్రజాజ్యోతి పల్నాడు

వైద్యశాఖలో త్వరలో సిబ్బంది కొరతను నియామకాల ద్వారా అధిగమిస్తామని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ తెలిపారు.గత ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం ఆరోగ్యశాఖపై రూ.6500 కోట్లు అప్పులు చేసి తల మీద పెట్టి వెళ్ళిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వ - మిగతా3లో



# వాణిజ్య ఒప్పందాలు వాస్తవం

- భారత్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం
- అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లో వాణిజ్య ఒప్పందాలు చాలా కీలకం
- అయితే ఇందువల్ల ఒనగూరే ప్రయోజనాలను చాలా జాగ్రత్తగా బేరీజు వేసుకోవాలి
- భారత ప్రభుత్వం ప్రస్తుతం మూడు కీలక వాణిజ్య ఒప్పందాలపై సంప్రదింపులు జరుపుతోంది

# 'సుశాంత్ కేసు క్లోజ్.. రియాకు ఇదే నా శాల్యూట్!

**ముంబై:** సుమారు ఐదేళ్ల క్రితం బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్ పుత్ మృతి కేసు పెద్ద సంచలనం. సుశాంత్ ఆత్మహత్య చేసుకోవడానికి గర్ల్ ఫ్రెండ్ రియా చక్రవర్తినే కారణమంటూ పెద్ద దుమారమే చెలరేగింది. 2020, జూన్ 14వ తేదీన సుశాంత్ బాంద్రాలోని తన నివాసంలో విగతజీవిలా పడివున్నాడు. మెడకు ఉరి వేసుకుని ఉన్న సుశాంత్ మరణంపై అనేక అనుమానాలు తలెత్తాయి. దీనిపై దాదాపు ఐదేళ్ల పాటు విచారణ జరిపిన సీబీఐ.. ఎట్టకేలకు తుది రిపోర్ట్ ఇచ్చింది. సుశాంత్ మరణం వెనుక ఎవరి ప్రేరేపితం లేదని స్పష్టం చేసింది. అంటే ఈ కేసులో విచారణ ఎదుర్కొన్న సుశాంత్ గర్ల్‌ఫ్రెండ్ రియాకు భారీ ఊరట లభించినట్లయ్యింది. అయితే దీనిపై రియా లాయర్ సతీష్ మనీషిండే మాట్లాడుతూ..' ఈ కేసులో ప్రతీకోణాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తుది నివేదికను ఇచ్చిన సీబీఐకి కృతజ్ఞతలు. అటు ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియాలో కూడా రియాపై అనేక రకాలైన తప్పుడు కథనాలు వచ్చాయి. అది కోవిడ్ వచ్చిన సమయం కావడంతో ప్రతీ ఒక్కరూ టీవీలు, సోషల్ మీడియాను ఎక్కువ చూశారు. ఈ క్రమంలోనే రియాపై ఎన్నో తప్పుడు వార్తలు చుట్టుముట్టాయి. నిరాధారమైన ఆరోపణలతో ఆమెను, ఆమె కుటుంబాన్ని నానా యాగీ చేశారు. ఈ రకంగా చేయడం వల్ల అమాయకులు చాలా నష్టపోతారు. కానీ చివరకు రియా పాత్ర ఏమీ లేదని క్లియరెన్స్ వచ్చింది. ఇక్కడ రియాకు సెల్యూట్ చేస్తున్నా. ఎన్నో అవమానాలను భరించి ఎటువంటి నోరు విప్పకుండా మౌనం పాటించిన రియాకు, ఆమె కుటుంబానికి సెల్యూట్ చేస్తున్నా' అని రియా లాయర్ సతీష్ మనీషిండే తెలిపారు.



**సీబీఐ రిపోర్ట్‌లో ఏం చెప్పింది..?**

సుశాంత్ మరణానికి సంబంధించి నమోదైన రెండు కేసుల్లో ఎవరి పాత్ర లేదని తెలిపింది. ఈ మేరకు ముంబై కోర్టులో సీబీఐ క్లోజర్ రిపోర్ట్‌ను దాఖలు చేసింది. బాలీవుడ్ నటుడు సుశాంత్ మరణం వెనుకు ఎవరి పాత్ర లేదని, ఎటువంటి కుట్రలు జరగలేదని తెలిపింది. సుశాంత్ మరణంలో నటి రియా, ఆమె కుటుంబ సభ్యుల పాత్ర లేదని పేర్కొంది.

# వాణిజ్య ఒప్పందాలు వాస్తవం

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలపై ఓవైపు చర్చ జరుగుతుండటం, ప్రతీకార వాణిజ్య సుంకాలకు అగ్రరాజ్యం అమెరికా గడువు విధించిన నేపథ్యంలో వాణిజ్య ఒప్పందాలు వాస్తవమని, అయితే భారత్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం అనే విధానాన్ని తాము అనుసరించనున్నామని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లో వాణిజ్య ఒప్పందాలు చాలా కీలకమని, అయితే ఇందువల్ల ఒనగూరే ప్రయోజనాలను చాలా జాగ్రత్తగా బేరీజు వేసుకోవాలని ఒక మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ అన్నారు. ప్రధానంగా సున్నితమైన టెక్నాలజీ విషయంలో ఇలాంటి ఒప్పందాల వల్ల ఇరువైపులా ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. భారత ప్రభుత్వం ప్రస్తుతం మూడు కీలక వాణిజ్య ఒప్పందాలపై సంప్రదింపులు జరుపుతోందని జైశంకర్ తెలిపారు. వీటిలో ఒకటి యూఎస్‌తో జరురుతోందని చెప్పారు. "అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లో వాణిజ్య ఒప్పందాలు కీలకం. ఇప్పుడు వీటి ప్రాధాన్యత కూడా పెరిగింది. దీనిని భారత్ గుర్తించింది. ప్రస్తుతం, మనం మూడు వాణిజ్య ఒప్పందాలపై సంప్రదింపులు జరుపుతున్నాం. ఐరోపా సమాఖ్య, యూకే, అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందంతో చర్చలు జరుపుతున్నాం. న్యూజిలాండ్‌తో కూడా ఈ వారమే చర్చలు ప్రారంభించాం. మరి కొందరితో కూడా చర్చలు జరపనున్నాం" అని జైశంకర్ తెలిపారు. భారతదేశం "ఇండియా ఫస్ట్" విధానాన్ని అనుసరించనుందని జైశంకర్ భరోసా ఇచ్చారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ఇండియా ఫస్ట్ పాలసీని అనుసరించనున్నట్టు చెప్పారు. గతంలో ఎక్కువగా ఆసియా దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ)లు చేసుకునే వాళ్లమని, వాణిజ్యం పోటాపోటీగా ఉండేదని అన్నారు. అమెరికా ఫస్ట్ పాలసీలో భాగంగా డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రతీకార సుంకాలకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. భారత్‌తో మంచి సంబంధాలే ఉన్నాయని, అయితే భారత్ అధిక సుంకాలు విధిస్తోందని, ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు తప్పవని హెచ్చరించారు.



# ఇండియా గేట్, రాష్ట్రపతి భవన్.. అంతటా అంధకారం..

**న్యూఢిల్లీ:** దేశంలోని అన్ని చారిత్రక ప్రదేశాలకు ఉన్నట్టుండి ఒక్కసారిగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడాన్ని ఎప్పుడైనా చూశారా?. రాత్రివేళ ఎప్పుడూ కాంతులీనే ఈ ప్రాంతాల్లో అంధకారం అలముకుంటే ఎలా ఉంటుంది? ఇటువంటి దృశ్యం శనివారం కనిపించింది. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా ఎర్త్ అవర్ సెలబ్రేషన్ 2025 కింద ఈ విధంగా చారిత్రక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. శనివారం సాయంత్రం ఇండియా గేట్, ఎర్రకోట, రాష్ట్రపతి భవన్, విక్టోరియా మెమోరియల్, ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినల్.. ఇలా దేశవ్యాప్తంగా ఉన్న పలు చారిత్రక ప్రదేశాలలో లైట్లు ఆపివేశారు. ఈ ఏడాది 19వ ఎర్త్ అవర్ ప్రపంచ జల దినోత్సవంతో పాటు జరిగింది. ఈ సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంగీతకారుడు, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా హోప్ అండ్ హార్మోనీ రాయబారి శంతను మొయిత్రా తన సంగీత ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఎర్త్ అవర్ సందర్భంగా రాత్రి 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు చారిత్రక ప్రాంతాల్లో విద్యుత్ ఉపకరణాలను ఆపివేయడం ద్వారా ఢిల్లీలో దాదాపు 269 మెగావాట్ల విద్యుత్తును ఆదా చేశారు. ఎర్త్ అవర్ అనేది విద్యుత్తును ఆదా చేసే ప్రచార కార్యక్రమం. ప్రజలు తమ దైనందిన జీవితంలో చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ప్రపంచంపై పడే భారాన్ని తగ్గించవచ్చని ఎర్త్‌డే చెబుతుంది. నీటిని ఆదా చేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడం ద్వారా భూమిని కాపాడవచ్చని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. ఈ ప్రచారానికి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయి. గత సంవత్సరం ఢిల్లీలో జరిగిన ఎర్త్ అవర్ సందర్భంగా 206 మెగావాట్ల విద్యుత్ ఆదా అయిందని పలు నివేదికలు చెబుతున్నాయి.



# పార్లమెంటులో అరకు కాఫీ స్టాల్స్..

న్యూఢిల్లీ: అరకు కాఫీకి విస్తృత ప్రచారం కల్పించేందుకు లోక్ సభ స్పీకర్ అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో సోమవారం నుంచి అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు కానున్నాయి. సభాపతి ఆదేశంతో రెండు స్టాల్స్ ఏర్పాటు చేసుకోవాలని లోకసభ భవనాల డైరెక్టర్ కుల్ మోహన్ సింగ్ అరోరా ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో సంగం 1, 2 కోర్ట్ యార్డ్ వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు లోకసభ సచివాలయం అనుమతి ఇచ్చింది. సోమవారం నుంచి ఈనెల 28 వరకు స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం కల్పించింది. ఈ క్రమంలో పార్లమెంటు ప్రాంగణంలో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు కోసం గిరిజన కోఆపారేటివ్ సొసైటీ అధికారులు ఢిల్లీ చేరుకున్నారు. అలాగే రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం సాయంత్రం ఢిల్లీ చేరుకోనున్నారు.

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ..

కాగా పార్లమెంట్ భవన్‌లో సోమవారం అరకు కాఫీ స్టాల్ ప్రారంభమవుతుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శనివారం ఆమె ఫోన్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం కోసం తాను ఢిల్లీ వెళ్తున్నట్టు చెప్పారు. అరకు కాఫీకి ఈ స్థాయిలో గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో కొత్తగా 139 అంగన్‌వాడీల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.20.80 కోట్లు మంజూరు చేసిందన్నారు. పీఎం జన్‌మన్ కింద జిల్లాకు 11 కేంద్రాలు మంజూరయ్యాయని వెల్లడించారు. వాటికి సంబంధించి 11 పోస్టులతో పాటు ఖాళీగా ఉన్న మరో 53 పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్టు చెప్పారు. కొండ శిఖర గ్రామాలకు రహదారులు నిర్మిస్తున్నామన్నారు. డోలీలు మోతలు తప్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా గిరి బజార్ ద్వారా గిరిజనులకు నిత్యావసర సరుకులు అందిస్తున్నామన్నారు. కంటైనర్ ఆసుపత్రిని కూడా ప్రారంభించామని చెప్పారు.

## ఆయన శారీరకంగా అలసిపోయారు
## మానసిక స్థిమితం కోల్పాయారు



**సమస్తిపూర్:** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై జన్ సురాజ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నితీష్ శారీరకంగా అలసిపోయారని, మానసిక పరిస్థితి సరిగా లేదని, దీంతో ఆయన పాలన విషయంలో రాజీపడుతున్నారని ఆరోపించారు. సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారంనాడిక్కడ మీడియాతో ప్రశాంత్ కిషోరో మాట్లాడుతూ...' 'నితీష్ కుమార్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన మిత్రపక్షం నేత సుశీల్ కుమార్ మోదీ తొలిసారి మాట్లాడారు. ఆ తర్వాత పలువురు బీహార్ మంత్రులు కూడా వ్యాఖ్యానించారు. గత జనవరి వరకూ నేను ఎలాంటి కామెంట్లు చేయలేదు. కానీ బీపీఎస్‌సీ నిరసనల తర్వాత నితీష్ కుమార్ మానసిక స్థితి క్షీణించిందని తెలిసింది. ఆ కారణంగానే రాష్ట్రంలో ఏమి జరుగుతోందో కూడా తెలియని పరిస్థితిలో ఆయన ఉన్నారు. ఆయన శారీరకంగా అలసిపోయారు. మానసికంగా ఫిట్‌నెస్‌తో లేరు. ఇందుకు సాక్ష్యం కావాలంటే ఆయన కౌన్సిల్‌లో మంత్రుల పేర్లు అడిగి చూడండి. ముఖ్యమంత్రి పదవికి నితీష్ కుమార్ రాజీనామా చేయడం మంచిది" అని సూచించారు. ఇందులో బీజేపీకి కూడా సమాన బాధ్యత ఉందని, నితీష్ కుమార్ మానసిక స్థితి కోల్పోయిన విషయం ప్రధానికి కానీ, హోం మంత్రికి కానీ తెలిసినట్టు లేదని అన్నారు.

**తేజస్విదీ అదే మాట..**

కాగా, నితీష్ మానసిక, శారీరక దారుఢ్యాన్ని కోల్పోయారని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఇటీవల కాలంలో పలుమార్లు విమర్శలు గుప్పించారు. నితీష్ రాజీనామాకు డిమాండ్ చేశారు. ఒక కార్యక్రమంలో జాతీయ గీతం ఆలపిస్తుండగా నితీష్ మాట్లాడుతున్న వీడియోను గత గురువారంనాడు ఆయన షేర్ చేశారు. యువకులు, విద్యార్థులు, మహిళలు, వయోవృద్ధులను ప్రతిరోజూ అవమానించే ముఖ్యమంత్రి కనీసం జాతీయ గీతాన్నైనా అమానించకుండా ఉంటే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

## జాతరలో అపశ్రుతి..
## కుప్పకూలిన 120 అడుగుల రథం



**బెంగళూరు:** కర్ణాటకలోని బెంగళూరు శివార్లలో ఊరేగింపు సందర్భంగా 120 అడుగుల రథం కూలిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అనేకల్‌లోని హుస్కూర్‌లో శనివారం మద్దురమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా వంద అడుగులకుపైగా ఎత్తైన రెండు రథాలను ఆలయ నిర్వాహకులు సిద్ధం చేశారు. కాగా, ఊరేగింపు సందర్భంగా రెండు రథాలను తాళ్ల సహాయంతో భక్తులు లాగారు. అయితే ఈదురు గాలుల వల్ల120 అడుగుల ఎత్తైన రథం అదుపుతప్పి ఒక పక్కకు కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి చెందగా.. పలువులు గాయపడ్డారు. వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మృతి చెందిన వ్యక్తిని తమిళనాడులోని హొసూర్‌కు చెందిన లోహిత్‌గా పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఏడాది కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. ఇదే ఉత్సవంలో రథం కూలిపోవడంతో.. పార్క్ చేసిన అనేక వాహనాలు దెబ్బతిన్నాయి, అయితే, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

## నోట్ల కట్టల ఆరోపణలు నిరాధారం



**న్యూఢిల్లీ:** అగ్నిప్రమాదం సందర్భంగా తన ఇంట్లో నోట్ల కట్టలు దొరికాయన్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ వివరణ ఇచ్చారు. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయకు ఆయన సుదీర్ఘ లేఖ రాశారు. తనకు, తన కుటుంబానికి ఆ నగదుతో ఎలాంటి సంబంధం లేదని, తమపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, అర్థరహితమని తెలిపారు. "స్టోర్ రూంలో నేను కానీ, నా కుటుంబ సభ్యులు కానీ ఎలాంటి నగదు ఉంచలేదు. మాకు చెందిన నగదు దొరికిందన్న ఆరోపణల్లో వాస్తవం లేదు" అని యశ్వంత్ వర్మ తెలిపారు. కాలిన నోట్ల కట్టలు కనిపించాయంటూ చెబుతున్న విజువల్స్ తనపై బురదజల్లి, తన ప్రతిష్టను భంగపరచేందుకు జరిగిన కుట్రగా కనిపిస్తోందన్నారు. వీడియోలోని కంటెంట్ చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని అన్నారు. ప్రమాద స్థలిలో కనిపించినట్టు చెబుతున్న కాలిన నోట్ల కట్టలను తాను ఎప్పుడూ చుడలేదని అన్నారు. తన ఆర్థిక లావాదేవీలన్నీ బ్యాంకులు, యూపీఏ అప్లికేషన్లు, కార్డుల ద్వారానే జరిగాయన్నారు. కాలిన నోట్లుగా చెబుతున్న కరెన్సీని తాము ఎప్పుడూ చూడనే లేదని జస్టిస్ వర్మ వివరణ ఇచ్చారు. అగ్నిప్రమాదం జరిగిందని చెబుతున్న స్టోర్‌రూమ్‌లో పాడైపోయిన ఫర్నిచర్లు, బాటిల్లు, వాడిన కార్పెట్లు వంటివి మాత్రమే ఉంచేవాళ్లమని, మెయిన్ రెసిడెన్స్‌కు ఎలాంటి అనుసంధానం లేదని, కచ్చితంగా అది తన ఇంట్లో రూమ్ కాదని ఆయన తెలిపారు. మంటలను ఆర్పే సమయంలో తన కుటుంబ సభ్యులు, సిబ్బందిని భద్రతా కారణాలతో దూరంగా ఉండమని చెప్పారని, మంటలు చల్చార్చిన తర్వాత కూడా తమ సిబ్బంది, కుటుంబ సభ్యులకు అక్కడ ఎలాంటి కరెన్సీ కనిపించలేదని వర్మ తెలిపారు. స్టాఫ్ కార్వర్ట్స్ సమీపంలో కానీ, ఔట్ హౌస్ సమీపంలో కానీ బహిరంగంగా నగదు నిల్వ చేయాలనే ఆలోచన నమ్మశక్యం కాదని అన్నారు. కాలిన కరెన్సీ బస్తాలను తమకు చూపించడం కానీ, ఇవ్వడం కానీ జరగలేదన్నారు. కరెన్సీకి సంబంధించిన ఆధారాలు కూడా లేవన్నారు. ఒక న్యాయమూర్తి జీవితంలో వ్యక్తిత్వం, ప్రతిష్ట చాలా ముఖ్యమని, తన ప్రతిష్టకు భంగం కలిగించేలా ఆరోపణలు ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంపై విచారణ జరిపాలని సీజేఐ సంజీవ్ ఖన్నా నిర్ణయించారు. ఇందుకోసం మూడు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులతో త్రిసభ్య సంఘాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కేసుల విచారణ పరంగా జస్టిస్ యశ్వంత్ వర్మకు ఎలాంటి బాధ్యతలు అప్పగించవద్దని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సీజేఐ ఆదేశించారు.

# పెద్దిరెడ్డికి వరుస కష్టాలు




**తిరుపతి :** మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజకీయ పునాదులు కదులుతున్నాయి. ముసలికి నీళ్లలో బలం ఉన్నట్టు.. పుంగనూరు అడ్డాగా దశాబ్దాలుగా పెద్దిరెడ్డిదే పెత్తనం కొనసాగింది. మైనింగ్ నుంచి లిక్కర్ వరకు.. ఆయనదే హవా. ఆయన చెప్పిందే శాసనం. కను సైగలతో పుంగనూరు నియోజకవర్గాన్ని, ఉమ్మడి చిత్తూరు జిల్లాను ఏలారు పెద్దిరెడ్డి. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం పతనం కావడంతో.. పెద్దిరెడ్డి పాపాల పుట్ట పగులుతోంది. వరుస కేసులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రెడ్ బుక్ పేర్లను బయటకు తీస్తుండటంతో.. పెద్దిరెడ్డితో పాటు ఇన్నాళ్లూ ఆయన అడుగులకు మడుగులు ఒత్తిన కొందరు ఖాకీల కూసాలు సైతం కదులుతున్నాయి. తాజాగా జరిగిన ఓ మర్డర్.. చిత్తూరు పోలీస్ డిపార్ట్‌మెంట్‌నే షేక్ చేసింది. ఇన్నాళ్లూ పొలిటికల్ పెద్దలకు ఊడిగం చేసిన పోలీసుల స్థానాలు మారాయి. పనిలో పనిగా.. చిత్తూరు జిల్లా యంత్రాంగం మొత్తాన్ని ప్రక్షాళన చేస్తోంది పోలీస్ శాఖ.ఒకరు, ఇద్దరూ కాదు. ఏకంగా చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఏకంగా 264 మంది పోలీసులను రాత్రికి రాత్రే బదిలీ చేసింది ప్రభుత్వం. కౌన్సిలింగ్ గట్రా లేకుండా.. ఒక్క ఆర్డర్‌తో అందరినీ ఆర్డర్ లో పెట్టింది. జిల్లాలోని ప్రతీ పీఎస్‌లోనూ ట్రాన్స్‌ఫర్స్ జరిగాయి. పుంగనూరు పోలీస్ స్టేషన్ లో ఏకంగా 20 మందిపై వేటు పడింది. పుంగనూరు నియోజకవర్గం వ్యాప్తంగా 60 మంది ఖాకీలు బదిలీ అయ్యారు. తీవ్ర ఆరోపణలు ఉండి, పెద్దిరెడ్డి మనుషులుగా ముద్ర ఉన్న సిబ్బందిని సుదూర ప్రాంతాలకు పంపించారు. కొందరిని కుప్పం, రాళ్ల బూదుగూరుల ఖూలకు బదిలీ చేశారు. చిత్తూరు మహిళా స్టేషన్లో పని చేస్తున్న వారికి, రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్న పలువురికి.. పుంగనూరులో పోస్టింగ్ ఇచ్చారు.ఇంతటి సంచలన నిర్ణయానికి కారణం ఇటీవల చిత్తూరులో జరిగిన టీడీపీ కార్యకర్త రామకృష్ణ దారుణ హత్య. ఈ మర్డర్ ను ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. ఇంకా వెయిట్ అండ్ సీ విధానం సరికాదని.. బదిలీ కొరడా ఝులిపించింది. ఏకకాలంలో.. ఏకంగా 264 మంది పోలీసులను బదిలీ చేయడం మాత్రం మామూలు విషయం కానే కాదు. శాంతిభద్రతల మేటర్ లో సర్కారు ఎంత సీరియస్ గా ఉందో చెప్పకనే చెప్పింది.చిత్తూరు జిల్లాలో పోలీసుల పని తీరుపై ప్రభుత్వం కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉంది. శాంతిభద్రతల విషయంలో పోలీసులు చాలా నిర్లక్ష్యంగా ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ నేతలపై దాడులు జరుగుతున్నా పోలీసులు పట్టనట్టు ఉంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందుకే.. ఈ సంచలన నిర్ణయం అంటున్నారు. కానిస్టేబుల్ లతో పాటు సీఐ, ఎస్సై స్థాయి అధికారులు కూడా ఈ లిస్ట్ లో ఉన్నారు.గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో పని చేసిన నర్సింహులు అనే ఎస్సై తీరు తీవ్ర వివాదాస్పదమైంది. ఆనాటి పెద్దల అండ చూసుకుని రెచ్చిపోయాడని అంటారు. ఓ ఎన్నారైని అక్రమ అరెస్ట్ చేసి.. అతను విదేశాలకు వెళ్లకుండా అడ్డుకున్నాడని.. అతని నుంచి 3 లక్షలు బలవంతంగా వసూల్ చేశారనే ఆరోపణ ఉంది. ఓ భార్యాభర్తల గొడవలో జోక్యం చేసుకుని.. ఆ భార్యతో పుస్తెలతాడు అమ్మించి మరీ డబ్బులు లాగేసుకున్నాడని అంటారు. ప్రభుత్వం మారాక ఆ అరాచక ఎస్సై నర్సింహులుపై సస్పెన్షన్ వేటు పడింది. లేటెస్ట్ గా.. 264 మంది పోలీసుల బదిలీలతో.. పుంగనూరుతో పాటు చిత్తూరు జిల్లా వ్యాప్తంగా లా అండ్ ఆర్డర్ ను ఆర్డర్ లో పెట్టే పని ప్రారంభించింది. ఈ బదిలీల వేటుతో పరోక్షంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెత్తనానికి చెక్ పెట్టినట్టేనని అంటున్నారు. రెడ్ బుక్ ఎఫెక్ట్ ఎట్టా ఉంటాదో ఇప్పటికైనా పెద్దిరెడ్డికి తెలిసొచ్చుంటుందిగా? పోలీసులు సరే.. మరి నెక్ట్స్ టార్గెట్ పెద్దాయనేనా?

# 'లావు శ్రీకృష్ణదేవరాయలు.. నా కాల్ డేటాను తీశారు'



**పల్నాడు జిల్లా:** తనపై ఏసీబీకి ఫిర్యాదు చేసిన వారిని తాను ఎప్పుడూ చూడలేదని.. కూటమి నేతల డైరెక్షన్‌లోనే తనపై ఏసీబీ కేసు నమోదు చేసిందని మాజీ మంత్రి విడదల రజిని అన్నారు. ఆదివారం ఆమె చిలకలూరిపేటలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదేశాలతోనే ఏసీబీ కేసు పెట్టారని మండిపడ్డారు. "నన్ను, నా కుటుంబాన్ని ఎంపీ కృష్ణదేవరాయులు ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నా కాల్ డేటాను తీశారు. ఆయన ఒత్తిడితోనే కాల్‌డేటా తీసినట్లు పోలీసులు ఒప్పుకున్నారు. ఫిర్యాదు చేసిన వారితో నాకెలాంటి సంబంధం లేదు" అని విడదల రజిని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ అరాచకాలు తారాస్థాయికి చేరాయి. నాపై ఏసీబీ అక్రమంగా కేసు నమోదు చేసింది. కూటమి నేతల బెదిరింపులకు నేను భయపడను. ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చాను. రెడ్ బుక్ పాలనలో నన్ను టార్గెట్ చేశారు. అక్రమ కేసులు పెడుతున్నారు. అదిగో రజిని.. ఇదిగో రజిని అంటూ ఆవు కథలు చెబుతున్నారు. ఏసీబీ కేసులో ఫిర్యాదుదారులను ఇంతవరకూ నేను కలవ లేదు. రెడ్ బుక్ పాలనకు పరాకాష్టే ఈ ఏసీబీ కేసు" అని రజిని మండిపడ్డారు. "ఏసీబీ కేసులో ఫిర్యాదుదారుడు టీడీపీ వ్యక్తి. మార్కెట్ ఏజెన్సీని పెట్టి నాపై కేసులను పెట్టిస్తున్నారు. ఈ కథకు మొత్తం డైరెక్టర్ ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు. అక్రమంగా వ్యాపారం చేసుకోవడానికి ఫిర్యాదు దారులకు సహకరిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. నేనంటే ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు ఎక్కువ కోపమే. 2020లో గురజాల డీఎస్పీ, సీఐలకు లంచం ఇచ్చి నాతో పాటు నా కుటుంబ సభ్యుల కాల్ డేటాను తీయించారు. బీసీ మహిళ, ఎమ్మెల్యే అయిన నా కాల్ డేటాను తీయించారు. నా వ్యక్తి గత జీవితంలో ఎందుకు రావాలనుకున్నారో తెలియదు. మీ ఇంటిలో ఉన్న ఆడపిల్లల కాల్ డేటా తీస్తే ఎలా ఉంటుందో ఆలోచించండి. అంతటి నీచుడు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు" అని విడదల రజిని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ ఎంపీని ప్రశ్నించారు. అప్పుడే ఆయన మనసులో శ్రీకృష్ణదేవరాయలు నమ్మకాన్ని కోల్పోయారు. అప్పటి నుండి ఎంపీ నాపై కక్ష పెంచుకున్నాడు. పది నెలల నుండి ఒకే ఫిర్యాదును పదేపదే అందరికి ఇప్పించారు. ప్రస్తుతం విజిలెన్స్ ఎస్పీగా ఉన్న శ్రావణ్ టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు కొడుకు. ఆ ఎస్పీ ఇచ్చే విజిలెన్స్ నివేదిక ఏవిధంగా ఉంటుందో ఆలోచించండి. ఆయన ఇచ్చిన రిపోర్ట్ తెలుగుదేశం రిపోర్ట్. అవినీతి ఘనాపాటి ప్రత్తిపాటి... నా మీద, జర్మనీలో ఉండే నా మరిది మీద అక్రమ కేసులు పెట్టించారు. నా మామ కారుపై దాడి చేయించారు. ఎవరూ ఎటువంటి వారో అందరికి తెలుసు. నా కళ్లలో భయం చూద్దామనుకుంటున్నారు. ఇటువంటి వాళ్లను చూస్తే నాకు భయమనిపించదు" అని విడదల రజిని చెప్పారు. లావు రత్తయ్య అంటే నాకు గౌరవం. శ్రీకృష్ణదేవరాయలు వైజాగ్‌లో చెరువు భూములను కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పోసానిని రాష్ట్రమంతా తిప్పి ఇబ్బందిపెట్టారు. వడ్లమూడి యూనివర్సిటీ నుంచి చిలకలూరిపేట ఎంత దూరమో? చిలకలూరిపేట నుంచి వడ్లమూడి యూనివర్సిటీ అంతే దూరం. శ్రీకృష్ణదేవరాయలు ఇది గుర్తుపెట్టుకోవాలి" అని విడదల రజిని హెచ్చరించారు.

# విశాఖ స్టేడియంపై పొలిటికల్ గేమ్



విశాఖపట్టణం : విశాఖ క్రికెట్ స్టేడియం పేరు మార్పుపై వైఎస్సార్‌సీపీ నేతలు నానా రచ్చ చేస్తున్నారు. అటు, టీడీపీ సైతం స్ట్రాంగ్ కౌంటర్ ఇస్తుండటంతో రచ్చ రంజుగా మారింది.విశాఖ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంపై ఏపీలో పొలిటికల్ గేమ్ నడుస్తోంది. స్టేడియంకు వైఎస్సార్ పేరు తీసేయడమే లేటెస్ట్ వివాదానికి కారణం. మా నాయకుడి పేరు తొలగిస్తారంటూ వైసీపీ నేతలు తప్పుబడుతున్నారు. మేటర్ విశాఖ స్టేడియం గురించి కాబట్టి మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ రెడ్డి ఈ గొడవను లీడ్ చేస్తున్నారు. మీడియా ముందు గొంతు చించుకోవడంతో పాటు.. పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్యక్ష ఆందోళనలకు రెడీ అవుతున్నారు.విశాఖ స్టేడియంకు వైఎస్సార్ పేరు తీసిపడేయడంపై సోషల్ మీడియాలో ఇరు వర్గాలు బౌన్సర్లు, సిక్సర్లతో పొలిటికల్ గేమ్ ఆడుతున్నారు. పేరు మార్చితే.. ఆ నొప్పి ఎలా ఉంటుందో ఇప్పుడు తెలిసొస్తుందా అంటూ వైసీపీని కవ్విస్తున్నారు టీడీపీ, జనసేన వారియర్స్. గతంలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో ఎన్టీఆర్ పేరు తీసేసి.. వైఎస్సార్ అని పెట్టడాన్ని గుర్తు చేసి కామెంట్లతో కుమ్మేస్తున్నారు.1986లో హెల్త్ యూనివర్సిటీని స్థాపించిందే అప్పటి సీఎం నందమూరి తారకరామారావు. అందుకే, ఆయన పేరు మీద ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ అని పెట్టడంలో లాజిక్ ఉంది. అలాంటి ఎన్టీఆర్ పేరును తీసేసి.. గత సీఎం జగన్ తన తండ్రి పేరుతో వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీగా పేరు మార్చిన మేటర్ ను ఇప్పుడు మళ్లీ తెరమీదకు తెస్తున్నారు. ఆనాడు ఆయన చేసింది తప్పు కానప్పుడు.. ఇప్పుడు విశాఖ క్రికెట్ స్టేడియంకు వైఎస్సార్ పేరు తీసేయండం కూడా తప్పు కాదని వాదిస్తున్నారు. వైజాగ్ స్టేడియం వైఎస్సార్ ఏమైనా కట్టించాడా? ఆయన పేరు ఎందుకు పెట్టారంటూ గట్టి ఫైటే నడుస్తోంది సోషల్ మీడియాలో. అది ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కు సంబంధించిన స్టేడియం కాబట్టి ఐఅం పేరు మీదుగా ఉండటమే కరెక్ట్ అంటూ వైసీపీకి స్ట్రాంగ్ కౌంటర్లు పడుతున్నాయి.పేరులో ఏముందిలే అని పంతానికి పోకుండా.. పవర్ లేనప్పుడు సైలెంట్‌గా పడుండాలి కానీ.. కాదూ కూడదు.. వైఎస్సార్ పేరు తీయొద్దు.. రోడ్ల మీదకు వస్తాం.. రచ్చ చేస్తాం.. అంటే కుదరదు. ఇక్కడుంది కూటమి ప్రభుత్వం. తాట తీస్తారు జాగ్రత్త.. అంటూ తెలుగు తమ్ముళు ,, జన సైనికులు జగన్ అభిమానులను ఓ ఆటాడుకుంటున్నారు. దమ్ముంటే విశాఖ స్టేడియంకు రండి.. అసలైన ఆడుదాం ఆంధ్రా అంటే ఏంటో చూపిస్తాం అంటూ సవాళ్లు విసురుతున్నారు.

## పోలవరానికి సీఎం చంద్రబాబు

-మొదటిపేజీ తరువాయి

సమీక్ష నిర్వహించనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3.00 గంటలకు ఆయన పోలవరం ప్రాజెక్ట్ సైటును సందర్శించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 3.15 గంటకు విజయవాడకు సీఎం చంద్రబాబు తిరుగు ప్రయాణం కానున్నారు. ఇక అదే రోజు.. అంటే గురువారం సాయంత్రం ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ముస్లిం సోదరులకు ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఇవ్వనుంది. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. ఆ తర్వాత ఉండవల్లిలోని తన నివాసానికి సీఎం చంద్రబాబు చేరుకోనున్నారు. కూటమి ప్రభుత్వం కోలువు తిరిన తర్వాత.. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులోభాగంగా ఇప్పటికే రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం కేంద్రం సైతం ఇతోధికంగా సాయం అందిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్ పురోగతిపై జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించనున్నారు. ఇక 2014-19 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వం సైతం ప్రతి సోమవారం పోలవరం ప్రాజెక్ట్ పనులను సమీక్ష నిర్వహించేది. దీంతో సోమవారాన్ని పోలవారంగా నాటి ప్రభుత్వం పరిగణించేది. ఇక గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం ఎంత వరకు వచ్చిందంటే.. చెప్పే నాథుడే లేకుండా పోయారు. ఆ ప్రభుత్వ హయాంలో పని చేసిన ఇద్దరు జలవనరుల శాఖ మంత్రులు అనిల్ కుమార్ యాదవ్, అంబటి రాంబాబులు మాటలకే పరిమితమైన సంగతి అందరికి తెలిసిందే. 2024 మే, జూన్ మాసంలో జరిగిన ఎన్నికల్లో కూటమికి రాష్ట్ర ఓటరు పట్టం కట్టాడు. దీంతో చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. ఆ క్రమంలో రాజధాని అమరావతి, పోలవరంప్రాజెక్ట్ పనుల వేగం పుంజుకున్నాయి.

## త్వరలో వైద్య శాఖలో పోస్టుల భర్తీ

-మొదటిపేజీ తరువాయి

ఆర్థిక పరిస్థితి బాగా లేదని ఆయన పెదవి విరిచారు. ఆదివారం పల్నాడు జిల్లాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పి.సత్యకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వంలోని అన్ని శాఖలు అప్పుల్లో కురుకుపోయి ఉన్నాయని చెప్పారు.
గతంలో ఇక్కడ పని చేసిన మంత్రి చాలా బిజీ బిజీగా పనులు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ.195 కోట్లు ఇస్తే..గత ప్రభుత్వం రూ.197 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందని..అంటే వారు ఖర్చు పెట్టింది రూ.2కోట్లు మాత్రమేనని ఆయన వ్యంగ్యంగా అన్నారు.
రానున్న ఆర్థిక సంవత్సరంలో పిడుగురాళ్ల మెడికల్ కాలేజ్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నాణ్యమైన వైద్యం కోసం 175 నియోజకవర్గల్లో 100 పడకల ఆసుపత్రులు నిర్మిస్తామన్నారు. గత ప్రభుత్వం %చీ=+ూ% నిధులను సైతం దుర్వినియోగం చేసిందని చెప్పారు. క్యాన్సర్ బాధితుల కోసం మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రములో లేని విధంగా క్యాన్సర్ బాధితులకు వైద్యం అందిస్తున్నామని మంత్రి వై. సత్యకుమార్ తెలిపారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఇఫ్తార్ విందు

-మొదటిపేజీ తరువాయి



రాష్ట్రంలోని ఆయా జిల్లాల కలెక్టర్లు రానున్న 4, 5 రోజులలో జిల్లా స్థాయి ఇఫ్తార్ కార్యక్రమాన్ని వారికి అనువైన రోజున నిర్వహిస్తారు. ఇఫ్తార్ ను జిల్లాస్థాయిలో ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రణాళికాబద్ధంగా పకడ్బందీగా నిర్వహించాలని మైనార్టీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి కే. హర్షవర్ధన్ ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ ఎంజీ రోడ్డు ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్లోసెంటర్ లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేయబోయే రాష్ట్రస్థాయి ఇఫ్తార్ కార్యక్రమానికి రూ. 75 లక్షలు మొత్తాన్ని ప్రభుత్వం కేటాయించింది. ప్రభుత్వం విడుదల చేసిన మొత్తంలో మిగతా రూ. 75 లక్షలు మొత్తాన్ని జిల్లాల వారీగా కేటాయించి ఆయా జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో జిల్లాస్థాయిలో ఇఫ్తార్ కార్యక్రమాన్ని నిర్వహించేందు కు కార్యాచరణ రూపొందించా రు. జిల్లాలలో ముస్లిం మైనారి టీల జనాభా ప్రాతిపదికన ఇఫ్తార్ కోసం నిధుల కేటాయింపు జరిగింది. శ్రీకాకుళంకు రూ. 1.50 లక్షలు, విజయనగరం కు రూ. 1.50 లక్షలు, మన్యం కు రూ. 1 లక్ష, అల్లూరి సీతారామరాజు జిల్లాకు రూ. 1 లక్ష, విశాఖపట్నంకు రూ.3 లక్షలు, అనకాపల్లి కి రూ.2 లక్షలు, కాకినాడకు రూ.3 లక్షలు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమకు రూ.3 లక్షలు, తూర్పుగోదావరి కి రూ.3 లక్షలు, పశ్చిమగోదావరి కి రూ.3 లక్షలు, ఏలూరుకురూ.3 లక్షలు, కృష్ణా కు రూ.3 లక్షలు, గుంటూరుకు రూ.4 లక్షలు, బాపట్ల కు రూ.3 లక్షలు, పల్నాడుకు రూ.3 లక్షలు, ప్రకాశం రూ.3 లక్షలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుకు రూ.5లక్షలు, కర్నూల్ కు రూ.4 లక్షలు, నంద్యాల కు రూ.5 లక్షలు, అనంతపురంకు రూ.3. 50 లక్షలు, శ్రీ సత్య సాయిజిల్లాకు రూ.3 లక్షలు, వైఎస్ఆర్ కడపకురూ.3.50 లక్షలు, అన్నమయ్య జిల్లాకు రూ.4లక్షలు, చిత్తూరు కు రూ.3 లక్షలు, శ్రీ బాలాజీ జిల్లా కు రూ.3 లక్షలు ప్రకారం జిల్లా స్థాయి ఇఫ్తార్ నిర్వహణకు నిధులు కేటాయిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లకు నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం అప్పజెప్పింది.

## స్వాతంత్ర్య సమర వీరులకు సీఎం చంద్రబాబు నివాళి

**అమరావతి:** భారతజాతికి స్వేచ్ఛా జీవితాన్ని ప్రసాదించడానికి 23 ఏళ్ల వయసులోనే వీరోచిత పోరాటలు చేసి.. యువ హృదయాలపై చెరగని ముద్ర వేసిన స్వాతంత్ర్య సమర వీరులు భగత్ సింగ్ రాజ్ గురు సుఖ్ దేవ్ లు ఉరికంబం ఎక్కి ప్రాణత్యాగం చేసిన షహీద్ దివాస్ సందర్భంగా ఆ అమరవీరుల చరిత్రను మననం చేసుకుంటూ వారి సంస్మృతికి నివాళులర్పిద్దామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.
భగత్ సింగ్ సుఖ్ దేవ్, రాజ్ గురు. వాళ్ల పేర్లు వింటే చాలు ప్రతి భారతీయుడి గుండె గర్వంతో నిండిపోతుంది. ఈ ముగ్గురూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా భరతమాత కోసం పోరాడిన మహావీరులు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలనే ఆర్పించారు. అలాంటి త్యాగమూర్తులను ఈ రోజు మన దేశం స్మరించుకుంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. స్వేచ్ఛ, న్యాయం కోసం వారు నిర్భయంగా చేసిన కృషి మనందరికీ స్ఫూర్తి అని ఆయన అన్నారు. ఆ అమరవీరుల చరిత్రను మననం చేసుకుంటూ వారికి ప్రధాని మోదీ ఘనంగా నివాళులర్పించారు. భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు.. ఈ ముగ్గురూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా భరతమాత కోసం పోరాడిన మహావీరులు. వీరి పేర్లు వింటేనే భారతీయుల రక్తం దేశభక్తితో ఉప్పొంగిపోతుంది. అలాంటి దేశభక్తులను ఉరి తీసిన రోజు నేడే. 23 మార్చి, 1931న అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం వారిని ఉరితీసింది. 17, డిసెంబర్ 1928న బ్రిటన్ అధికారి శాండర్స్‌ను హత్య చేయడం, పార్లమెంట్‌లో బాంబులు వేయడం వంటి కారణాలను చూపి ముగ్గురినీ ఉరితీశారు. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏటా ఆ రోజును అమరవీరుల దినోత్సవం (షహీద్ దివస్)గా జరుపుకుంటారు. ారతదేశ స్వాతంత్ర్య పోరాటం కేవలం రాజకీయ పోరాటంతోనే కాదు లక్షలాది మంది విప్లవకారుల ప్రాణ త్యాగాలతోనూ ముడిపడి ఉంది. ఎంతో మంది వీరులు నిస్సంకోచంగా, తృణప్రాయంగా భరతమాత కోసం ప్రాణాలను అర్పించారు. అలాగే భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు సైతం దేశ స్వేచ్ఛ కోసం సంతోషంగా ప్రాణాలను త్యాగం చేశారు. వారి ప్రాణ త్యాగాలతో స్వాతంత్ర పోరాటం మరింతగా విజృంభించింది. వారిని ఉరితీశారని తెలుసుకున్న ప్రతి భారతీయుడూ కథం తొక్కాడు. లక్షలు, కోట్లుగా రోడ్లపైకి వచ్చి ఆందోళకు దిగారు. ఎట్టకేలకు బ్రిటీష్ సామ్రాజ్య మెడలు వంచి దేశానికి విముక్తి కల్పించారు. భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల బలిదానం దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య పోరాటాన్ని మరింత తీవ్రతరం చేసింది. భారత్ విముక్తికి బాటలు వేసింది. దీంతో ప్రతి ఏడాది మార్చి 23న అమరవీరుల దినోత్సవం జరుపుకుంటారు. ఈ రోజున వారి త్యాగాలను స్మరించుకుంటారు.

# సంపాదకీయం

## భారత్ భవిష్యత్తుపై రెండు దృక్కోణాలు

తమిళనాడు పాలక పార్టీ నాయకులు, బీజేపీ రాజకీయవేత్తల మధ్య మాటల యుద్ధాన్ని రెండు భాషల (తమిళం, హిందీ) మధ్య పోరాటంగా పత్రికలలో చిత్రిస్తున్నారు. ఈ వర్ణన సరైనదే కానీ, సంపూర్ణమైనది కాదు. విశదంగా చూస్తే అధికార భాషా చర్చ రెండు భిన్న భారత్ భావనలకు ప్రాతినిధ్యం వహిస్తోంది: మొదటి భావన రాజకీయాలలోను, సంస్కృతిలోను వైవిధ్యం, వ్యత్యాసాన్ని స్వాగతించేది కాగా రెండో భావన అవ్యక్త ఆదర్శం 'ప్రమాణీకరణ, సజాతీయత, కేంద్రీకరణ'. తమిళనాడులో హిందీ పట్ల వ్యతిరేకతకు దశాబ్దాల చరిత్ర ఉన్నది. 1937లో మద్రాస్ ప్రెసిడెన్సీలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దశల వారీగానే అయినప్పటికీ పాఠశాలల్లో హిందీ బోధనను తప్పనిసరి చేసింది. ఇందుకు కారకుడు అయిన నాటి మద్రాస్ ప్రధానమంత్రి (ముఖ్యమంత్రికి అప్పటి వాడుక అది) సి.రాజగోపాలాచారి ఆ తరువాత హిందీకి వ్యతిరేకమయ్యారు. 1950వ ఆరంభం నాటికే ఆయన, ఇప్పటి తమిళ రాజకీయవేత్తలవలే, మాతృభాషకు అదనంగా ద్వితీయ భాషనేదైనా బోధించవలసివస్తే అది ఇంగ్లీషే అవ్వాలి కాని, హిందీ కాకూడదని వాదించారు. 1965లో ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి హిందీని దేశవ్యాప్తంగా అధికార భాషగా అమలుపరిచేందుకు ప్రయత్నించారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య ప్రభుత్వ వ్యవహారాలన్నీ ఆంగ్లంలో కాకుండా హిందీలో జరగాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మద్రాసు రాష్ట్రంలో నిరసనలు వెల్లువెత్తాయి. ఆనాడు ఆ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న డీఎంకే హిందీ వ్యతిరేక ఆందోళనను తనకు అనుకూలంగా ఉపయోగించుకుని రాజకీయ లబ్ధి పొందింది. తమిళుల మనోభావాలను గాయపరిచిన హిందీ ఉత్తర్వును శాస్త్రి ఉపసంహరించుకున్నప్పటికీ కాంగ్రెస్ ప్రతిష్ఠకు తీరని విఘాతమేర్పడింది. తమిళనాట దశాబ్దాలుగా ప్రాబల్య పార్టీగా ఉన్న కాంగ్రెస్ 1967లో అధికారాన్ని కోల్పోయింది. తదాది తమిళనాడులో ఏదో ఒక ద్రావిడ పార్టీ మాత్రమే అధికారంలో ఉంటూ వస్తోంది. ఈ చరిత్ర అంతా ఎమ్‌కె స్టాలిన్, ఆయన సలహాదారులకు బాగా తెలుసు. హిందీ పట్ల తీవ్ర వ్యతిరేకత 1960ల్లో ఒక ఆధిపత్య రాజకీయ పార్టీని అధికారం నుంచి కూల్చి వేసినట్టుగానే ఇప్పుడు కూడా ఆ వ్యతిరేకత వర్తమాన ఆధిపత్య పార్టీని దూరంగా ఉంచుతుందనేది వారి సునిశ్చిత విశ్వాసం. తమిళనాడులో రాజకీయంగా విస్తరించి అధికార జయ పతాక నెగురవేసేందుకు బీజేపీ శతవిధాల ప్రయత్నిస్తోంది. నరేంద్ర మోదీ విశేష ప్రచారం కల్పించిన 'కాశీ%-%తమిళ్ సంగమం' కార్యక్రమం, కొత్త పార్లమెంటు భవనంలో 'సెంగోల్' ప్రతిష్ఠాపన, ఒక మాజీ ఐపీఎస్ అధికారిని తమిళనాడులో హిందూత్వ ఉద్ధారకుడుగా నిలబెట్టేందుకు బీజేపీ అగ్రనాయకత్వం వినియోగిస్తున్న శక్తియుక్తులను పరిశీలిస్తే తమిళనాట అధికారాన్ని కైవసం చేసుకునేందుకు బీజేపీ ఎంతగా ఆరాటపడుతుందో అర్థమవుతుంది. హిందీ విధింపుపై తమిళనాడు వ్యతిరేకతకు రాజకీయ, సాంస్కృతిక ప్రాతిపదికలు ఉన్నాయి. అయినప్పటికీ మౌలిక రాజ్యాంగ స్ఫూర్తికి అది పూర్తిగా అనుకూలంగా ఉన్నది. 1976 వరకు విద్య రాష్ట్ర జాబితాలోని అంశంగా ఉండేది. అత్యవసర పరిస్థితి కాలంలో దానిని ఉమ్మడి జాబితాలో చేర్చారు. నిరంకుశపాలనలో ఏకపక్షంగా జరిగిన మార్పు అది. ఆ రాజ్యాంగ సవరణ ఆధారంగానే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తాను నిర్దేశించిన విద్యా విధానాన్ని అనుసరించి తీరాలని తమిళనాడును ఒత్తిడి చేస్తోంది. లేనిపక్షంలో నిధులను ఉపసంహరించుకుంటామని బెదిరిస్తోంది. తమిళనాడు వైఖరిని వ్యతిరేకిస్తున్నవారు వివిధ కమిషన్లు సిఫారసు చేసిన త్రిభాషా సూత్రాన్ని ప్రస్తావిస్తున్నారు. పాఠశాల బాలలు మాతృభాష, ఇంగ్లీష్‌తో పాటు మూడో భాషనూ నేర్చుకోవాలని ఆ సూత్రం ప్రతిపాదించింది. అయితే హిందీ రాష్ట్రాలలో మూడో భాషగా సంస్కృతాన్ని మాత్రమే బోధించడం జరుగుతోంది. యూపీ, బిహార్‌ల్లో ప్రభుత్వ పాఠశాలల్లో తమిళం లేదా కన్నడం లేదా బెంగాలీ లేదా మలయాళ భాషను ఎన్నడూ మూడో భాషగా బోధించిన దాఖలాలు లేవు. కనీసం మరాఠీ లేదా గుజరాతీని సైతం బోధించలేదు. ఈ త్రిభాషా సూత్రాన్ని తమిళనాడు అమలుపరచలేదు. ఉత్తరాది రాష్ట్రాలలో అది ఆచరణలో ఎలా పరిణమించిందన్నది తమిళనాడు అభ్యంతరాలను ధ్రువపరిచింది. జాతీయ సమైక్యతను పెంపొందించడానికి బదులుగా ప్రభుత్వ ప్రాయోజిత హిందీ విస్తరణ వాదానికి త్రిభాషా సూత్రం ఒక అనుద్దేశపూర్వక సాధనమయింది. సరిగ్గా ఈ కారణంగానే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కూడా త్రిభాషాసూత్రాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ విషయమై ప్రధానమంత్రి మౌనంగా ఉన్నప్పటికీ హోం మంత్రి మాత్రం విభిన్న రాష్ట్రాల మధ్య కమ్యూనికేషన్ మాధ్యమంగా హిందీ మాత్రమే ఉండాలని ఉంటుందని పదే పదే ఉద్ఘాటిస్తూ వస్తున్నారు. ఆంగ్లంలో మాట్లాడే భారతీయుల పట్ల తన అయిష్టతను సైతం ఆయన పదే పదే వ్యక్తం చేస్తూనే ఉన్నారు. 1965 నుంచి 2014 దాకా అర్ధ శతాబ్దం పాటు హిందీయేతర రాష్ట్రాలలో హిందీని ప్రోత్సహించేందుకు కేంద్రం శ్రద్ధగా ప్రయత్నించలేదు. అయినప్పటికీ హిందీ దేశ వ్యాప్తంగా వ్యాపించింది. అంతర్ రాష్ట్ర వలసలు, మరీ ముఖ్యంగా సినిమాలు, టీవీ మాధ్యమం ద్వారా ఆ భాషా వ్యాప్తి జరిగింది. బాంబే హిందీ సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఉపయోగించే హిందీ మృదువైన, వ్యవహారిక హిందుస్థానీయే గానీ ఆకాశవాణి, ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలలో ఉపయోగించే సౌలభ్యమూ, సౌందర్యమూ కొరవడిన, మితిమీరిన స్థాయిలో సంస్కృతీకరణ అయిన హిందీ కాదు. మోహన్ భగవత్ ఇటీవల కేరళలో ఒక సమావేశంలో మాట్లాడుతూ హిందువులు ఆంగ్ల భాషను త్యజించాలని కోరారు. ఒకప్పుడు లోహియా వలే ఇప్పుడు ఆరెస్సెస్ అధినేత కడా ఇంగ్లీష్‌ను ఆంగ్ల మానస పుత్రులైన భారతీయుల భాషగా పరిగణిస్తున్నారు. వలసపాలన భావ దాస్యంలో ఉన్నవారు ఆ భాషను ఔదలదాలుస్తున్నారనేది వారి ఆరోపణ. ఇంగ్లీష్ త్వరలోనే భారత్ నుంచి బహిష్కృతమవుతుందని లోహియా భావించారు. ఆయన ఆశించినట్టు జరగ లేదు. ముఖ్యంగా 1990ల నుంచి ఇంగ్లీష్ శీఘ్రగతిన వ్యాప్తి చెందింది. ప్రభుత్వ ప్రాపకం ద్వారా కాకుండా ఇతరేతర రీతుల్లో అది వ్యాప్తి చెందింది. సాఫ్ట్‌వేర్ బూమ్ ఇందుకొక ప్రధాన కారణం. మన ఇంజినీరింగ్ కళాశాలలు అన్నీ ఇంగ్లీష్‌లోనే బోధించడం వల్లే అది సంభవించింది. సామాజిక చలనశీలతకు మార్గంగా, వృత్తిపరమైన పురోగతికి సోపానంగా, విశాల ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు ఒక ప్రధాన గవాక్షంగా ఆంగ్ల భాష గుర్తింపు, ప్రాధాన్యాన్ని పొందింది. ఆధునిక వృత్తులలోకి ప్రవేశించేందుకు దళితులు ఆంగ్ల భాషను నేర్చుకుని తీరాలని ప్రముఖ మేధావి చంద్రభాన్ ప్రసాద్ చాలా సంవత్సరాలుగా వాదిస్తున్నారు. ఆంగ్ల భాషలో ప్రావీణ్యాలు లేక పోవడం వల్లే ఆధునిక వృత్తులలో దళితుల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని ఆయన విశ్వసిస్తున్నారు. 'ఇంగ్లీష్ సివంగి పాలు వంటిది, ఆ పాలను తాగిన వారే గర్జించగలరన్న' అంబేడ్కర్ మాటలను తన వాదనకు మద్దతుగా ఆయన తరచు ఉటంకిస్తుంటారు. మాతృభాషా అభిమానంతో కన్నడ సాహిత్యలోక దిగ్గజాలు పాఠశాలల్లో ఆంగ్ల భాషను బోధించ వద్దని విజ్ఞప్తి చేసినప్పుడు దళిత మేధావులు గర్జిస్తూ ఇలా ప్రతిస్పందించారు: తొలుత మీరు మాకు సంస్కృతాన్ని నిరాకరించారు. ఇప్పుడు ఇంగ్లీష్‌నూ అదే విధంగా నిరాకరిస్తున్నారు. మీ అగ్రకుల ప్రాముఖ్యాన్ని, నిలబెట్టుకునేందుకే మీరు ఇలా చేస్తున్నారు. నరేంద్ర మోదీ అధికారానికి రావడానికి ముందు కాలంలో హిందీ, ఇంగ్లీష్ రెండూ దేశవ్యాప్తంగా విశేష ప్రాచుర్యం పొందాయి. వ్యాకరణ సమ్మతంగా రాయలేక పోయినప్పటికీ, స్ఫుటంగా మాట్లాడలేకపోయినప్పటికీ ఇప్పుడు చాలా మంది భారతీయులు ఆ రెండిటిలో ఏదో ఒక భాషను గానీ లేదా రెండిటినీ గానీ అర్థం చేసుకోగలుగుతారు. హిందీయేతరులు హిందీని, భారతీయులు ఇంగ్లీష్‌ను ఇలా ఆదరంగా స్వీకరించడమనేది స్వచ్ఛందంగా, స్వతస్సిద్ధంగా జరిగిందని చెప్పి తీరాలి. ఇది దేశ ప్రజలపై రాజకీయంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా ఆరోగ్యకరమైన ప్రభావాన్ని చూపింది. విషాదేమేమిటంటే ఈప్రక్రియ మరింత ప్రగతిశీలంగా ముందుకు సాగకుండా సంఘ్ పరివార్ రాజ్యాధికారాన్ని ఉపయోగించి ఆంగ్లాన్ని అణచివేసి హిందీని సర్వత్రా ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తోంది. హిందువులు మాత్రమే ఈ దేశ సహజ పౌరులు అన్న వారి సంకుచిత విశ్వాసం వల్లే ఇలా వ్యవహరించడం జరుగుతోంది. భాషా రంగంలో జాతీయ సమైక్యతకు హిందీ ఉపయోగపడుతుందని వారు విశ్వసిస్తున్నారు. హిందువులే ఈ దేశ నిజమైన పౌరులు అని చెప్పుతూ భారతీయ ముస్లింలను తులనాడుతూ అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం చేస్తున్న ప్రయత్నాలను ఇదే కాలమ్‌లో గతంలో పలుమార్లు వివరించాను. అయితే నేను తమిళనాడులో ఓటు వేయడం లేదు. కుటుంబ పాలన విషయంలో కాంగ్రెస్‌కు తీసిపోని డీఎంకే పట్ల నాకు అభిమానమూ లేదు, నేను ఆ పార్టీ పక్షపాతినీ కాను. అధికార భాషపై ఘర్షణ రెండు పాలక పార్టీల మధ్య కాదు, అది మన దేశం గురించిన రెండు దృక్కోణాల మధ్య ఘర్షణ.

# కొంటే... కొరివి దయ్యమే!



"భారత్ ఒక సరికొత్త ప్రపంచానికి అలవాటు పడాల్సిన అవసరం ఉంది" ట్రంప్‌ను ఉద్దేశించి విదేశీ వ్యవహా రాల మాజీ కార్యదర్శి ఒకరు అన్న మాట. ఈ కొత్త ప్రపంచం కేవలం ఒప్పందాలు, వ్యాపారాలకు మాత్రమే పరిమితమనీబీ మిత్రులు, శత్రువులు ఎవరూ ఉండరనీ కూడా ఆయన అన్నారు. ఒక దౌత్యవేత్త ఈ అంచనాకు వచ్చారంటే కచ్చితంగా అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ అనూహ్యమైన వ్యక్తిత్వమే కారణమై ఉంటుంది. తేలిగ్గా చెప్పాలంటే... ఈ రోజుల్లో పరిస్థితి నాటకీయంగా మారిపోయింది. కొత్త సంవత్సరంలో యూఎస్‌ఏ తన లావా దేవీలను వేగంగా మొదలు పెట్టేసింది. ఈ ఏకపక్ష ధోరణితో అమెరికా మిత్రులు, శత్రువులు కూడా తమని తాము కాపాడు కునేందుకు దాక్కుండిపోతున్నారు. లేదంటే వ్యక్తిగతంగా ట్రంప్ ముందు ప్రత్యక్షమై ఆయన శీతకన్ను పడకుండా ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ రెండింటి వల్ల కూడా ఏదో అర్థవంతమైన పని జరుగుతుందని ఎవరూ ఆశించడం లేదు. ఇవన్నీ ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే... ట్రంప్ ఇప్పుడు అమెరికన్ కంపెనీ 'లాక్‌హీడ్ మార్టిన్ ' తయారు చేసిన ఎఫ్-35 యుద్ధ విమానాలు కొనమని భారత్‌కు చెబుతున్నారు. భారత్‌తో ఉన్న సుమారు 3,500 కోట్ల డాలర్ల వాణిజ్య లోటును భర్తీ చేసుకునేందుకు అన్నమాట. అయితే ఏ అంత ర్జాతీయ ఒప్పందం, వ్యాపారమైనా కేవలం అమ్ముతామంటే సరిపోదు. కొంటున్నామని అవతలి వారు చెప్పాలి. భారత్‌దృష్టి కోణం నుంచి చూస్తే %-% అమెరికా అమ్ముతానూ అంది, మరి కొనదలుచుకుంటే ఆ ఎఫ్%-%35 యుద్ధ విమానాలు ఎలాంటివో పరిశీలించాలి కదా?

### తడిసి మోపెడు ఖర్చు

రవాణా, గాల్లోంచి సామగ్రి పడవేసే 'డగ్లస్ డీసీ%-%3 డకోటా', 'ఫెయిర్ ఛైల్డ్ ప్యాకెట్ సీ119 జీ' మినహా మరే ఇతర అమెరికా విమానాన్నీ భారతీయ వైమానిక దళం ఇంతవరకు వాడలేదు. 1947 నుంచి చూసినా అమెరికా యుద్ధ విమానం మన వద్ద ఎప్పుడూ లేదు. కాబట్టి అకస్మాత్తుగా ఎఫ్-35లను కొనుగోలు చేయడం అంటే, అది కూడా ట్రంప్ మాటపై ఆధారపడి అంటే... కొంచెం అనుమానంగా చూడాల్సిన వ్యవహారమే! అమెరికా, భారత్‌ల మధ్య సంబంధాలు, చరిత్ర లను పరిగణనలోకి తీసుకుంటే ఇలా చూడటం మరీ ముఖ్య మవుతుంది. ఒక విషయమైతే స్పష్టం. భారత్ వంటి అతిపెద్ద దేశంలో వైమానిక దళం ఒక్క రోజులో సిద్ధం కాదు. వైమానిక దళాన్ని నిర్మించడం అంత తేలికైన వ్యవహారమూ కాదు. భారీ పెట్టు బడులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, రిస్క్ తీసుకో గలిగిన తెగువ, సుశిక్షితులైన సిబ్బంది అవసరం. 'జేన్ ్స ఆల్ ద వరల్డ్స్ ఎయిర్ క్రాఫ్ట్' మ్యాగజైన్‌ప్రకారం... ఎఫ్-35 యుద్ధ విమానాలకు (ఐదో తరం, బహుళార్థక, స్టెల్త్ రకం) ఆర్డర్ పెట్టిన తరువాత మొదటి విమానం అందేందుకు 15 ఏళ్లు పడుతుంది! ఇంకో విషయం - భారత్ ఏ రోజు కూడా లాక్ హీడ్ తయారు చేసే యుద్ధ విమానపు కొనుగోలుదారుగా కానీ, అమెరికా పారిశ్రామిక భాగస్వామిగా కానీ లేదు. నిజానికి ఎఫ్-35 యుద్ధ విమానాలు హైటెక్ పాశ్చాత్య దేశాల కోసం, అమెరికా రక్షణకు, సెక్యూరిటీ భాగస్వాములైన ఇతర దేశాల కోసం ఉద్దేశించినవి. 1996లో ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, గ్రీస్, ఇజ్రాయెల్, సింగపూర్, స్పెయిన్ , స్వీడన్ లకు ఈ కార్యక్రమం గురించి వివరించారు. ఎఫ్-35లు ఖరీదైనవని అప్పుడే అర్థమైపోయింది (ట్రంప్ సుంకాల తీరుతో తాజాగా నాటో దేశాలు కూడా వీటి కొనుగోలు గురించి పునరాలోచనలో పడ్డాయి). ముందుగా యూకేతో కలిసి పనిచేయాలని, పది శాతం ఖర్చులు ఆ దేశం భరించాలని యూఎస్‌తో ఒప్పందం జరిగింది. ఇటలీ, నెదర్లాండ్స్ చెరి ఐదు శాతం ఖర్చులు భరించేలా ఒప్పందాలు కుదిరాయి. మూడో దశలో డెన్మార్క్, నార్వే... 1%-%2 శాతం ఖర్చులు భరించేలా భాగస్వాములైనాయి. అనంతరం, ఆస్ట్రేలియా, కెనడా, టర్కీ తమ ఖర్చు తామే భరించేలా చేరాయి. 2012-13 నాటి 'జేన్ ్స ఆల్ ద వరల్డ్స్ ఎయిర్‌క్రాఫ్ట్' పత్రికను చూస్తే ఒక్కో ఎఫ్-35ఎ యుద్ధ విమానం ఖరీదు సుమారు 3.73 కోట్ల డాలర్లు. 2017 నాటికి ఇది 9.43 కోట్ల డాలర్లకు చేరుకుంది. ఇప్పుడు సుమారు పది కోట్ల డాలర్ల పైమాటే (రూ.860 కోట్లు). మారకం విలువలు, రూపాయి బలహీనపడటం వంటివి కూడా పరిగణనలోకి తీసుకుంటే ఎఫ్-35ల కొనుగోలు భారత్ ఖజానాకు భారీగా కన్నమేసేదే! ఇంత భారీ ఖర్చు కచ్చితంగా రాజకీయంగానూ సంచలనంసృష్టిస్తుంది. దీంతోపాటే ఎఫ్-35 యుద్ధ విమానాలకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞాన సంబంధిత సమస్యలు చాలానే ఉన్నాయి. అమెరికాలోనూ దీని గురించి వివాదాలు ఉన్నాయి. సమస్యలు ఒకవైపు, ఎప్పటికప్పుడు పెరిగిపోయే ఖర్చులు ఇంకోవైపు ఈ యుద్ధ విమానపు కొనుగోలుపై సందేహాలు లేవనెత్తుతున్నాయి. ఆర్థికాంశాలు, సాంకేతిక పరిజ్ఞాన అంశాలూ కాసేపు పక్కన పెడదాం. యుద్ధ విమానం భద్రత కూడా ఇక్కడ ప్రశ్నా ర్థకమే. 2010 అక్టోబరులో ఇలాంటి ఒక సమస్యను గుర్తించారు. విమానం ఎగురుతూండగానే ఎలాంటి ఆదేశాలూ లేకుండానే ఇంజిన్ ఆఫ్ అయ్యేందుకు వీలు కల్పించే ఓ సాఫ్ట్ వేర్ సమస్య తలెత్తింది. అప్పట్లో ఎడ్వర్డ్స్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో ఈ విమానాలను కొంత సమయం పాటు నిలిపివేశారు కూడా! పదిహేనేళ్లు దాటిపోతున్నా ఇప్పటికీ ఈ యుద్ధ విమానం ప్రయాణిస్తూండగా సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. 2014 జూన్ , జూలైల్లో ఎగ్లిన్ ఎయిర్‌ఫోర్స్ స్థావరం వద్ద కొన్నింటిలో ఇంజిన్ వైఫల్యం చోటు చేసుకుంది. ఈ ఘటన తరువాత వాటి వాడకాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. కనుక అలాంటి విమానాలను కొని, కొరివితో తలగోక్కునే పరిస్థితిని భారత్ తెచ్చు కోదనే ఆశిద్దాం!

# సుంకాలపై సమష్టి పోరాటం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ షేక్ స్పియర్‌ను చదివారో లేదో గాని ఆ మహాకవి మాటలలోని సత్యాన్ని బాగానే గ్రహించారు: 'స్నేహంలో చిత్తశుద్ధిలేని ముఖస్తుతి ఉన్నది'. అమెరికాకు రెండోసారి అధ్యక్షుడు అయిన తన స్నేహితుడు డోనాల్డ్ ట్రంప్‌ను పొగడ్తలతో ముంచెత్తిన మోదీ వలసలు, వీసాలు, వాణిజ్య సమతుల్యత, సుంకాలు, అణు ఇంధనం, దక్షిణ చైనా సముద్రం, బ్రిక్స్, క్వాడ్, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం మొదలైన అంశాలపై స్వదేశానికి అనుకూలంగా ట్రంప్‌తో సంప్రతింపులు జరపగలననే ఆశాభావంతో ఉన్నారు. అధ్యక్షుడు ట్రంప్ నాలుగు సంవత్సరాలు అధికారంలో ఉంటారు. అంతకు మించి ఉండరు. ప్రధానమంత్రి నరేంద్రీ మోదీ మూడో పదవీ కాలం ఇంకా నాలుగు సంవత్సరాలు ఉన్నది. మరోసారి కూడా ప్రధానమంత్రి కావాలని ఆయన ఆశిస్తున్నారని చెప్పవచ్చు. అయితే నాలుగు సంవత్సరాల ఉమ్మడి వ్యవధిలో సమస్యలు అన్నిటినీ పరిష్కరించడం సాధ్యం కాదన్నది స్పష్టం. రాబోయే అమెరికా ప్రభుత్వం రిపబ్లికన్ పార్టీది అయినా, డెమొక్రాటిక్ పార్టీది అయినా ట్రంప్ విధానాలను కొనసాగించక పోవచ్చు. ఈ సంభావ్య పరిణామమే భారత్‌కు మొదటి పాఠం కావాలి. ప్రభుత్వాధినేతల మధ్య వ్యక్తిగత స్నేహ సంబంధాలకు అతీతంగా పరిస్థితులను సమగ్రంగా చూడాలి. ట్రంప్ గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది? ఆయనకు ఒక స్నేహితుడు ఎప్పుడు శత్రువు అవుతాడో, ఒక శత్రువు ఎప్పుడు మిత్రుడు అవుతాడో ఎవరూ చెప్పలేరు. పాడ్‌కాస్టర్ లెక్స్ ఫ్రిడ్‌మాన్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అధ్యక్షుడు ట్రంప్‌ను ప్రధాని మోదీ ఘనంగా ప్రశంసించారు. ఆయన వినమ్రతను, కష్టాల నుంచి బయటపడగల శక్తిని బాగా మెచ్చుకున్నారు. ద్వితీయ పర్యాయం అధ్యక్ష పదవీ కాలంలో సాధించాల్సిన లక్ష్యాల విషయమై ట్రంప్ మొదటిసారి కంటే బాగా సన్నద్ధమయ్యారని మోదీ అన్నారు. ఆయనకొక మార్గదర్శక ప్రణాళిక ఉన్నదని, వేసే ప్రతి అడుగు లక్ష్య పరిపూర్తికి తోడ్పడేదిగా ఉంటుందని మోదీ అన్నారు. మోదీ ఇంకా ఇలా అన్నారు: 'తాను నిర్దేశించిన లక్ష్యాలను సాధించగల శక్తిమంతమైన పాలనాదక్షుల బృందానికి బాధ్యతలు అప్పగించారు. సమర్థులైన ఆ అధికారులు అధ్యక్షుడు ట్రంప్ దార్శనికతను అమలుపరచగలరని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను'. అమెరికా ప్రజలు అందరూ ఈ ప్రశంసతో ఏకీభవించకపోవచ్చు. సెనేటర్లు, ప్రతినిధుల సభ సభ్యులు అందరూ ఆయా ప్రభుత్వ విభాగాలకు ట్రంప్ ఎంపిక చేసుకున్న అధికారులు అందరూ శక్తి మంతులని, పాలనా దక్షులని భావించడం లేదు. ట్రంప్ దార్శనికత అమెరికాకు గానీ, ప్రపంచానికిగానీ శ్రేయస్సును సమకూర్చేదని అమెరికా ప్రజలు అందరూ భావించడం లేదు. డోనాల్డ్ ట్రంప్ తన దార్శనికతను అమలుపరచడమనేది భారత్‌కు శుభవార్త



కాబోదు. తన లక్ష్యాల పరిపూర్తిలో ట్రంప్ సఫలమయితే దాని పర్యవసానాలు భారత్‌కు ఎలా ఉంటాయో చూద్దాం: సరైన పత్రాలు లేకుండా అమెరికాకు వలస వెళ్లిన భారతీయులు (దాదాపు 7 లక్షల మంది అని అంచనా) దాదాపుగా అందరినీ తిరిగి భారత్‌కు పంపించి వేస్తారుబీ అమెరికాలో గ్రీన్‌కార్డ్ ఉన్న భారతీయులకు అమెరికా శాశ్వత పౌరసత్వాన్ని నిరాకరించే అవకాశమున్నదిబీ విద్యార్థులు, వృత్తి నిపుణులకు జారీ చేసే హెచ్ 1బి వీసాల జారీని గణనీయంగా తగ్గించివేస్తారుబీ హార్లే డేవిడ్‌సన్ బైక్‌లు, భౌర్బన్ విస్కీ, జీన్స్, ఇతర అమెరికన్ సరుకులపై దిగుమతి సుంకాలను తగ్గించడం భారత్‌కు అనివార్యమవుతుందిబీ భారత్ నుంచి అల్యూమినియం, ఉక్కు ఎగుమతులు, బహుశా ఇంకా ఇతర భారతీయ సరుకులపై అమెరికా భారీ స్థాయిలో సుంకాలు విధించే అవకాశమున్నదిబీ భారత్‌లో ఉద్యోగాలను సృష్టించే పరిశ్రమలను నెలకొల్పకుండా అమెరికన్ ప్రైవేట్ పెట్టుబడులను నిరుత్సాహపరుస్తారు. అంతర్జాతీయ సంబంధాలలో ట్రంప్ పోకడల విషయాన్ని చూద్దాం. పనామా కాలువను అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటే నరేంద్ర మోదీ ఏ విధంగా ప్రతిస్పందిస్తారు? ఆ సముద్ర మార్గంలో భారత్, ఇతర దేశాల ఓడల రాకపోకలకు అనుమతించినంతవరకు ఎవరూ నిరసన తెలుపకపోవచ్చు. అయితే పనామా కాలువను అమెరికా తన నియంత్రణలోకి తీసుకోవడమనేది నిస్సందేహంగా ఒక దురాక్రమణే. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ఉల్లంఘించడమే. గ్రీన్‌ల్యాండ్‌ను ఏదో ఒక విధంగా అమెరికా స్వాయత్తం చేసుకుంటే మోదీ ఏ విధంగా ప్రతిస్పందిస్తారు? గ్రీన్‌ల్యాండ్ మనకు సుదూరంలో ఉన్న దీవి కనుక, అమెరికా చర్యకు మనం ఆందోళనపడవలసిన అవసరం లేదని భారత్ భావిస్తుందా? కొన్ని 'దురాక్రమణలను' క్షమించవచ్చుగానీ రష్యా మరిన్ని ఉక్రెయిన్ ప్రాంతాలను, తైవాన్‌ను చైనా స్వాధీనం చేసుకుంటే భారత్ ఏ విధంగా ప్రతిస్పందిస్తుంది? ఆక్సాయిచిన్, అరుణాచల్‌ప్రదేశ్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు చైనా ప్రయత్నిస్తేనో?! భారత్, చైనాల మధ్య యుద్ధం తప్పక సంభవిస్తుంది. ఆ యుద్ధంలో మనకు మద్దతుగా ఏ దేశం నిలబడుతుంది? ఆధునిక దౌత్యం వ్యక్తిగత స్నేహాలను మించిన వ్యవహారం. డెమొక్రాటిక్ పార్టీతో నెలకొల్పుకున్న స్నేహ సంబంధాలను వదులుకుని ట్రంప్ పార్టీకి మోదీ మళ్లీ ప్రాధాన్యమిస్తారా? ఏది ఏమైనా జనవరి 20, 2029 తరువాత ట్రంప్ అధికారంలో ఉండరు. తదుపరి అధ్యక్షుడు డెమొక్రాటిక్ పార్టీకి చెందిన నాయకుడు కావచ్చు.

గత పది సంవత్సరాలుగా దేశీయ పరిశ్రమల సంరక్షణ విధానానికి నరేంద్ర మోదీ ఎనలేని ప్రాధాన్యమిస్తున్నారు. ఆయన దాన్ని ఘనంగా ఆత్మనిర్భరత అని చాటుతున్నారు. తన స్నేహితుడు డాక్టర్ అర్విండ్ పనాగరియాతో సహా పలువురు ఆర్థికవేత్తల విజ్ఞతాపూర్వక సలహాలు, సూచనలను పెడచెవిని పెట్టి మోదీ ప్రభుత్వం 500కు పైగా సరుకుల దిగుమతులపై సుంకాలు, సుంకాలేతర చర్యలు చేపట్టింది. భారతీయ సరుకులపై అమెరికా వసూలు చేస్తున్న అధిక సుంకాలపై మోదీ నిరసన తెలిపినప్పుడు ఆయన ఆక్షేపణలను ట్రంప్ మహాశయుడు పూర్తిగా కొట్టివేశాడు. ఏప్రిల్ 2, 2025 నుంచి పూర్తి స్థాయిలో సుంకాల సమరాన్ని ప్రారంభించేందుకు ట్రంప్ ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ట్రంప్‌తో మోదీ దోస్తీ, ముఖ ప్రీతి మాటలు బాగానే ఉన్నాయి గానీ, ట్రంప్ సుంకాల సమరం నుంచి ఇండియాను మినహాయించడానికి అవి తోడ్పడుతాయా? ట్రంప్ విధించే ప్రతీకార సుంకాలను భారత్ ప్రతిఘటిస్తుందా? సూత్రబద్ధ చర్చలు, సంప్రదింపులే దౌత్యానికి హృదయం వంటివి. ముఖస్తుతి మాటలు ఎంతమాత్రం దౌత్య వ్యవహారం కాబోవు. ఆచరణాత్మక వైఖరి నిండుగా ఉన్న ఫ్రిడ్రిచ్ మెర్జ్ (కాబోయే జర్మన్ ఛాన్సలర్), ట్రంప్ విసురుతున్న సవాళ్లకు దీటుగా ప్రతిస్పందిస్తున్న కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ, 27 యూరోపియన్ యూనియన్ దేశాలను సంఘటితం చేసిన యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ తెయెన్‌లు అంతర్జాతీయ చట్టాలు, ఒడంబడికలను విచక్షణారహితంగా ఉల్లంఘించకుండా ట్రంప్‌ను అడ్డుకోవడంలో విజయం సాధించే అవకాశమున్నది. న్యాయ నియమాల ప్రాతిపదికన పోరాడేవారి పక్షాన భారత్ నిలబడి తీరాలి.

# భగత్ సింగ్ కు నివాళులర్పించిన సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు

**గుంతకల్లు మార్చ్ 23 (ప్రజా జ్యోతి):** భగత్ సింగ్ 94వ వర్ధంతి ని పురస్కరించుకొని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న కామ్రేడ్ భగత్ సింగ్ విగ్రహానికి సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి సురేష్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ సామ్రాజ్యవాదం నశించాలి, ఇంక్విలాబ్ జిందాబాద్, భారత స్వాతంత్ర ఉద్యమం లో మరణించిన అసంఖ్య వీరులకు జోహార్లు, నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి, నినాదాలు చేసిన తర్వాత బి. సురేష్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుండి దేశానికి విముక్తి కలిగించడా నికి చిన్న వయసులోనే వివిధ పుస్తకాలను అధ్యయనం చేసి తాను నమ్మిన ఆశయాల కోసం నిబద్ధతతో ఆచరించ డం జరిగినది. 1917లో రష్యా సోషలిస్టు విప్లవం విజయవం తం కావడంతో దాని ద్వారా స్ఫూర్తి పొందిన కామ్రేడ్ భగత్ సింగ్ భారత దేశంలో సాయుధ ఉద్యమం ద్వారా సోషలిస్ట్ విప్లవంను స్థాపించి సమసమాజ స్థాపన జరగాల ని కలలు కనడం జరిగినది. దానికి అనుగుణంగానే 1919 ఏప్రిల్ 13వ తారీఖున అమృత్ సర్ లో ని జలియన్ వాలాబాగ్ లో బ్రిటిష్ పోలీస్ అధికారి డయ్యర్ జరిపిన పోలీస్ కాల్పుల్లో వందలాది మంది భారతీయ పౌరులు మరణించడం జరిగినది. ఈ సంఘటన భగత్ సింగ్ మనసును తీవ్రంగా కలిసి వేసినది. ఢిల్లీలో ఫిరోజ్ షా కోటలో అజాద్ చంద్రశేఖర్, భగత్ సింగ్ ఇంకా దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన విప్లవకారులతో కలిసి హిందుస్థాన్ రిపబ్లిక్ ఆన్ ఆర్మీని స్థాపించడం జరిగినది. 1928 లో సైమన్ కమిషన్ ఇండియాకు వచ్చినప్పుడు దేశవ్యాప్తంగా సైమన్ గో బ్యాక్ ని నిరసన కార్యక్రమాలను నిర్వహించ డం జరిగినది. దానిలో లాలా లజపతి రాయ్ పాల్గొన్న నిరసన కార్యక్రమం మీద పోలీసులు లాటి చార్జ్ జరగడంతో తలకు గాయమై ఆయన మరణించడం జరిగినది. దీనికి ప్రతి కారంగా బ్రిటిష్ పోలీస్ అధికారి సాండర్ ను భగత్ సింగ్ హత్య చేయడం జరిగినది. బ్రిటిష్ ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకురావాలని ప్రయత్నిస్తే వాటిని వ్యతిరేకి స్తూ 1929 లో పార్లమెంటులో




కామ్రేడ్ భగత్ సింగ్ సుఖదేవ్, రాజ్ గురు పొగ బాంబులను వేసి తమ నిరసనను తెలుపుతూ నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బ్రిటిష్ ప్రభుత్వానికి బందీలు కావడం జరిగినది. మీరు జైలలో ఉండంగానే రాజకీయ ఖైదీల కోసం జైల్లో అనేక పోరాటాలు బ్రిటిష్ ప్రభుత్వం ద్వారా అనేక సంస్కరణలు తీసుకురావడం జరిగినది. బ్రిటిష్ ప్రభుత్వం వీరి మీద అనేక కుట్ర కేసులను మోపి అక్రమంగా 1931 మార్చి 23 వ తారీఖున ముగ్గురిని ఉరి తీయడం జరిగినది. నేడు పాలకవర్గ ప్రభుత్వాలు భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిస్తామని తెలుపుతూ నే ప్రాపంచికరణ, సామ్రాజ్య వాదుల విధానాలను అమలుపరుస్తూ భగత్ సింగ్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారు. ఆర్ఎస్ఎస్, బిజెపి హిందుత్వ ఫాసిస్ట్ విధానాలను అమలు పరుస్తూ దేశంలో మత ఘర్షణ లను సృష్టిస్తూ విభజించు పాలించు సూత్రాన్ని అమలు పరచడం జరుగుతున్నది. దీనివలన దేశం పూర్తి వెనుకబడి తీవ్ర ఆర్థిక సంక్షోభంలోని పోతున్నది. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులు ఉపసంహరించుకుంటూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100% ఆహ్వానించడం జరుగుతున్నది దీని ఫలితంగా ఉద్యోగస్తులు కార్మికులు ఉపాధి కూలిపోయి రోడ్డు పాలు అవుతున్నారు. రైతులకు పంటల గిట్టుబాటు ధర లేక చేసిన అప్పులు తీర్చలేక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నిర్వీరం చేసి కార్పెట్ కార్పొరేట్ కంపెనీలకు బహుళ జాతి కంపెనీలకు పెట్టుబడిదారు వర్గాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకుని రావడం జరిగినది. మోడీ ప్రభుత్వం దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినది. కార్పొరేట్ కంపెనీల కనసన్న ల్లో మోడీ పరిపాలన కొనసాగించుచున్నది దీనికి వ్యతిరేకంగా కామ్రేడ్ భగత్ సింగ్ చూపిన మార్గంలో విద్యార్థులు యువకులు ప్రయనించినప్పుడే కామ్రేడ్ భగత్ సింగ్ కు నిజమైన నివాళులర్పించే వారం అయితే అని తెలిపినారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గుంతకల్ డివిజన్ కమిటీ సభ్యులు రఘునాథరెడ్డి జిలాన్, సత్తార్, రామాంజనేయులు, ఐఎఫ్టియు నాయకులు నారాయణ షేక్షావలి, భాషా, రామ్ దాస్, గోపి, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడిన ప్రతిఒక్కరికి న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం




**గుంతకల్లు మార్చి 23 (ప్రజా జ్యోతి):** పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. ఆదివారం గుత్తి టిడిపి కార్యాలయం నందు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు ఆయన తనయుడు పామిడి మరియు గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ కూటమి నాయకులు, కార్యకర్తలతో ముఖ్యమైన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9నెలల కాలం లోనే ఇచ్చిన హామీలను నెరవేర్చామని రాబోయే రోజుల్లో కూడా తల్లికి వందనం పథకం అమలుకు ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలో నిర్ణయం తీసుకున్నారని కచ్చితంగా సూపర్ సిక్స్ పథకాలనుకూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. అదేవిదంగా నామినేటెడ్ పదవుల్లో కూడా కష్టపడిన వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుంది అని అన్నారు.

**శభాష్ ఈశ్వర్ :గుమ్మనూరు జయరాం**

గత నెల రోజులనుండి తాను అసెంబ్లీ సమావేశాలలో ఉన్నందున నియోజకవర్గం లో ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన తాను లేని లోటు తన తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ తీర్చాడని తన ధ్రుష్టికి రాని విషయాలని కూడా ఈశ్వర్ స్వయంగా తెలుసుకుని అవసరం అయితే కార్యకర్తల ఇంటికి వెళ్లి మరి పలకరించి అందర్నీ కలుపుకుని వెళ్లాడని గుమ్మనూరు ఈశ్వర్ ని శభాష్ ఈశ్వర్ అని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మెచ్చుకున్నారు. తన తనయుడిని చూసి తనకు ఎంతో గర్వంగా ఉందని గుమ్మనూరు జయరాం తెలిపారు. ఈ కార్యక్రమం లో గుత్తి పట్టణ, మండల కూటమి నేతలు పాల్గొన్నారు.

## దళిత గిరిజన ప్రజా సంఘం భారతీయ భీమ్ సేన కార్యాలయం ఘనంగా ప్రారంభించిన జై భీమ్ రామాంజనేయులు రాకెట్ల చందు నాయక్



**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** భారతీయ భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు పామిడి సాకే ఓబులేసు విలేకరుల సమావేశంలో జై భీమ్ రామాంజనేయులు రాకెట్ల చందు నాయక్ మాట్లాడుతూ... అనంతపురం జిల్లా నందు దళిత గిరిజన ప్రజా సంఘం మరియు భారతీయ భీమ్ సేన సంఘాలు కలిసి కూటమి ఏర్పడి అనంతపురం జిల్లా నందు ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేశారు కార్యాలయ ప్రారంభోత్సవానికి వివిధ ప్రజాసంఘాల నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున సంఖ్యలో హాజరై కార్యాలయం ప్రారంభించడం జరిగినది.. ఈ కార్యక్రమంలో బిబిఎస్ రాష్ట్ర అధ్యక్షులు సాకే ఓబులేష్ .పి హెచ్ పి ఎస్ వ్యవస్థాపకులు మన్నేపాకుల మాధవ. పూసల సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతు. ఎస్సీ ఎస్టీ మెంట్రీ కమిటీ నెంబర్ డాక్టర్ తిరుపాలు. జై భీమ్ రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై నాగరాజు. వెంకటేశ్వర్లు. బహుజన జెఎసి నరేష్. మున్సిపల్ హెల్పర్ అజయ్ బాబు. %దీదీూ% రాయలసీమ ఇంచార్జ్ రవి నారాయణ %దీదీూ% రమేష్ రమంజి తదితరులు పాల్గొన్నారు

# అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలి


**పైడితల్లి అమ్మవారి యాత్రా మహోత్సవాలలో ఎమ్మెల్యే కూన రవికుమార్**

**ఘన స్వాగతం పలికిన ఆలయ కమిటీ సభ్యులు**

**అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే**


**పొందూరు, ప్రజా జ్యోతి న్యూస్:** ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి చల్లని ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ఆమదాలవలస ఎమ్మెల్యే , పియూసి చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. పొందూరు మేజర్ పంచాయతీ అవరణంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న శ్రీ పైడితల్లి అమ్మవారి 40వ యాత్రా మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పైడితల్లి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన రవికుమార్ పైడితల్లి ఆలయ కమిటీ ట్రస్టు బోర్డు చైర్మన్ అనకాపల్లి శివ కుమార్ , ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. వేద మంత్రాల మధ్య అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ పొందూరు పైడితల్లి అమ్మవారంటే ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు దైవమని, గ్రామంలో ఏ శుభకార్యం చేయాలన్నా అమ్మవారికి పసుపు, కుంకుమతో మొక్కు చెల్లించి కార్యక్రమాలు ప్రారంభిస్తారని అన్నారు.. అమ్మవారి ఆశీసులు రాష్ట్ర ప్రజానీకానికి ఎల్లవేళలా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో సుభక్షంగా ఉండాలని ఆకాంక్షించారు..





ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ , జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు, ఉపాధ్యాయులు మొగదాల రమణ రావు , కోరుకొండ విజయకుమార్ , కోరుకొండ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద భరితంగా మారిన రోడ్డు అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి



**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, మార్చి 23, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండల పరిధిలో ఉన్న పలుచోట్ల ఆర్ అండ్ బి రోడ్ల పై ఇసుక చేరడం వలన ద్విచక్ర వాహరదారులు రోడ్డు ఎక్కాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఏటి గట్లపై వెళుతున్న ఇసుక లారీల నుండి కిందికి జారిపోయిన ఇసుక రోడ్ల నడి మధ్యలో ఉండడం వలన వాహనదారులు ప్రాణం అరి చేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తుంది. వేగంగా వెళ్లే వాహనాలు అదుపు తప్పి ప్రమాద భారిన పడే పరిస్థితి నెలకొంది. అధికారుల ఆదేశాల ప్రకారం ఇసుక సప్లై చేసే లారీల పైన టార్పాలిన్ కప్పాలి. కానీ అధికారుల మాట పెడ చెవున పెట్టి ఏ విధమైన టార్పాలిన్ లేకుండా ఇసుక రవాణా వాహనాలు వెళ్లడమే ఇందుకు ప్రధాన కారణమని వాహనదారులు వాపోతున్నారు. కుమార దేవం, బల్లిపాడు, తాళ్లపూడి, ప్రక్కిలంక ఇసుక రేవుల నుండి వచ్చే లారీల కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మండల కార్యాలయం, పోలీస్ స్టేషన్కు అతి దగ్గరగా గల జంక్షన్ రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఇసుక ఉన్న కానీ అటు ర్యాంపు నిర్వాహకులు గాని ఇటు అధికారులు కానీ చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల వద్ద నుండి విమర్శలు వినిపిస్తున్నాయి

# ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబం





**గుంతకల్లు మార్చి 23 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని ఈద్గా మసీద్ కాంపౌండ్ నందు గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు వారి సోదరులు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా గుంతకల్లు పట్టణం మరియు మండలం లో ఉన్న ముస్లిం మైనారిటీ సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం కి ముఖ్య అతిధులుగా టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ మరియు గుమ్మనూరు జయరాం సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ, ఏపీ మార్క్ ఫెడ్ మెంబెర్ కేసీ హరి హాజరవడం జరిగింది. ఈ సందర్భంగా గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ హిందూ ముస్లిం భాయ్ భాయ్ పవిత్ర రంజాన్ మోసాలు పురస్కరించుకొని ముస్లిం



సోదరులు కఠోర దీక్షతో ఉపవాసాలు చేస్తారు. ఇంత నియమ నిష్టతో దీక్షలు చేస్తున్న నా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషం అని కుల మత ప్రాంతాలకు అతీతంగా అందరు కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షిస్తున్నాను అని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో గుంతకల్లు పట్టణ, మండల ముస్లిం సోదరులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డివైఎఫ్ఐ సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం

ఎక్స్ఛేంజ్ సి.ఐ బి.సీతారామిరెడ్డి



**బద్వేల్ మార్చి 23 (ప్రజా జ్యోతి న్యూస్) :** మార్చి 23వ తేది నాడు విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు,సుక్ దేవ్ 94వ వర్ధంతి ని పురస్కరించుకొని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణమునందు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్టీసీ బద్వేలు డిపో మేనేజర్ ఆర్.చైతన్య నిరంజన్, బద్వేల్ ఎక్స్ఛేంజ్ సి.ఐ బి.సీతారామిరెడ్డి, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా అధ్యక్షులు మాదన విజయ్ కుమార్ గార్లు పాల్గొని బస్టాండు ఇన్ గేటు వద్ద గల భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజవాదుల నుండి మాతృభూమి విముక్తి కోసం ఎందరో వీరులు తమ ప్రాణాలను తృణపాయంగా అర్పించారని,వారిలో అగ్ర గన్యులు కామ్రేడ్ భగత్ సింగ్,రాజుగురు,సుఖదేవ్ లని 1931 మార్చి 23న బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వీరి ముగ్గురిని క్రూరంగా ఉరితీసారన్నారు.బ్రిటిష్ సామ్రాజ్యవాదులు నాడు ప్రవేశపెట్టిన మేఖలా విద్యా విధానమే నేటికీ కొనసాగుతుందన్నారు.పాలక ప్రభుత్వాలు విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీ కలగానే మిగిలిందన్నారు. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, రక్షణ రంగం, విమానయానం, బొగ్గు గనులు వంటి సమస్యలన్నీ ఆదానీ, అంబానీ పోస్కో వంటి కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా కట్టబెడుతున్నారు.మాతృదేశ విముక్తి కోసం అశువులు బాసిన భగత్ సింగ్,రాజ్ గురు సుఖదేవ్ ల త్యాగాల స్ఫూర్తితో విద్యార్థి ,యువతరం దేశంలో రాష్ట్రంలో కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి, నిరుద్యోగ విధానాలకు వ్యతిరేకంగా ఉన్నత విద్య పరిరక్షణ కొరకు యు జి సి ముసాయిదా డ్రాఫ్ట్ సవరణను వ్యతిరేకంగా ట్రంప్ అహంకార పూరిత విధానాలను విద్యార్థులు యువత తిప్పి కొట్టాలని డివైఎఫ్ఐ నాయకత్వం సమాజ సేవలో భాగస్వామ్యం అయ్యి పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని రానున్న కాలంలో ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి.ఎస్. నాయక్, ఆర్టీసీ కంట్రోలర్ యస్.వి. సుబ్బయ్య, ఆర్టీసీ సిబ్బంది ఇరుపోతు శ్రీనివాస వర్మ,బాల చెన్నారెడ్డి, ఎక్స్ఛేంజ్ సిబ్బంది గురయ్య, నారాయణరెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, జిల్లా మహిళా కన్వీనర్ సి.గురుదేవి పట్టణ అధ్యక్ష - కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ ఆదిల్ భాష, రూరల్ అధ్యక్షులు ముడమాల ఓబుల్ రెడ్డి, పట్టణ నాయకులు నాగార్జున, గురయ్య, యువరాజు, ఫయాజ్, నరసింహ, వెంకట్, ఇంద్ర, ప్రసాద్ రెడ్డి,రాజేష్, రామకృష్ణ, నాగేంద్ర, ఐద్వా మహిళా సంఘము నాయకురాలు అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం





**- కూటమి పాలనలో రాష్ట్రం అధోగతి**

**- అవినీతి , దౌర్జన్యాలు తప్ప అభివృద్ధి శూన్యం**

**నియోజకవర్గం సమన్వయ కర్త చింతాడ రవికుమార్**

**ఆమదాలవలస లో వైఎస్సార్సీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం**

**ఆమదాలవలస , ప్రజా జ్యోతి న్యూస్ :** అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి విరుద్ధంగా కూటమి పాలనలో రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయ కర్త చింతాడ రవికుమార్ తెలిపారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం నాడు వైఎస్సార్సీపీ కార్యకర్తలు , నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద సృష్టించి ప్రజలకు పంచుతానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన మాట ఏమైందన్నారు.ఆయన పెంచిన సంపద కేవలం నిత్యావసర వస్తువుల ధరలు , విద్యుత్ చార్జీలు పెంచడంతో పాటు ప్రజలపై పన్నుల భారం మోపడమే అని ఎద్దేవ చేశారు. అతి కొంత సమయంలోనే కూటమి పాలనలో ప్రజల్లో తీవ్రస్థాయిలో అసంతృప్తి నెలకొందని తెలిపారు. మేనిఫెస్టో లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేక కల్లబొల్లి మాటలతో కాలయాపన చేస్తున్నారన్నారు. వైఎస్సార్సీపీ హయంలో ప్రతీ ఒక్క కుటుంబం సంతోషంగా ఉందని , ప్రజల గడప వద్దకే సంక్షేమాన్ని అందించిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. కానీ కూటమి పాలనలో ప్రజలకు ఏ ఒక్క పథకం అందడం లేదని ,అధికారం చేపట్టిన నాటి నుండి దాడులు , దౌర్జన్యాలు తప్ప చేసిన అభివృద్ధి శూన్యమన్నారు..ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా వైఎస్సార్సీపీ పార్టీ పైన బురద జల్లడం , కార్యకర్తలను వేధించడమే లక్ష్యంగా కూటమి పాలన సాగిస్తోందన్నారు. డిప్యూటీ సీఎం గా భాధ్యతలు చేపట్టిన పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఆయన ప్రజలకు ఇచ్చిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. స్థానిక టిడిపి ఎమ్మెల్యే అన్యాయంగా చిన్న చిన్న ఉద్యోగాల నుండి వైసిపి వారికి చెందిన వారనే నెపంతో తొలగించడం అన్యాయమన్నారు. ఇష్టానుసారంగా ఇసుక త్రవ్వకాలు జరుపుతూ ఆమదాలవలస నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేశారని ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే రానున్నాయన్నారు. ప్రతీ ఒక్క కార్యకర్త ప్రజలతో మమేకం అవ్వాలని ,తెలుగుదేశం నాయకులు అమలు చేస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. వైసిపి పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తల క్షేమాన్ని కోరుకుంటుందని ప్రతీ ఒక్క కార్యకర్తలు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్ , సరుబుజ్జిలి జెడ్పీటీసీ ప్రతినిధి సురవరపు నాగేశ్వర రావు , మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు , సరుబుజ్జిలి మండల అధ్యక్షులు కండాపు గోవింద రావు ,గురుగుబెల్లి శ్రీనివాస రావు , బి అజంత కుమారి, వైఎస్సార్సీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ యాక్ట్ అమలు చేయాలి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీర శేఖర్**



**బద్వేల్ మార్చి 23 (ప్రజా జ్యోతి న్యూస్) :** బద్వేల్ పట్టణంలోని భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన సిపిఐ ఏఐవైఎఫ్ నాయకులు. స్వాతంత్ర సమరయోధులు, విప్లవ యువకిశోరులు భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్ ల భగత్ సింగ్ విగ్రహానికిపూలమాలవేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ మాట్లాడుతూ భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్ ల యొక్క పోరాట స్ఫూర్తితో విద్యార్థి, యువజన సమస్యల పరిష్కారం కొరకు రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామన్నారు, అతి చిన్న వయసులో వారు దేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన రియల్ హీరోలని కొనియాడారు, నాడు స్వేచ్ఛ స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, లౌకికవాద పరిరక్షణ కొరకు అనేకమంది ప్రాణ త్యాగాలు చేసిన వారిలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లని గుర్తు చేసుకున్నారు, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం వారి రాజకీయ స్వలాభం కోసం కులాలకు,మతాలకు మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుతున్నారని అన్నారు, యువత భవిష్యత్ తరాల కోసం నాడు స్వాతంత్రోద్యమంలో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయులు చరిత్ర కలిగిన దేశం మనదని అలాంటిది నేడు మన దేశంలోని ప్రభుత్వ సంస్థలను సైతం ప్రైవేట్ పరం చేస్తూ యువత యొక్క శ్రమను కార్పొరేట్ రంగాలకు ఊడిగం చేసేటువంటి కుట్రను బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం పన్నుతోందని అన్నారు, దేశానికి వెన్నెముక లాంటి రైతులను సైతం ఆందోళన బాట పట్టే విధంగా చేసిన ఘన చరిత్ర బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు, బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్ యొక్క పోరాట స్ఫూర్తితో విద్యార్థులను, యువకులను చైతన్య పరిచి నిరంకుశ వైఖరితో నడుస్తున్న బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ జయంతి వర్ధంతిలను అధికారికంగా జరపాలని అదేవిధంగా భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ యాక్ట్ అమలు చేయాలని వారన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పి బాలు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు పి. ప్రభాకర్ .ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి నవీన్. జిల్లా సమితి సభ్యులు పడిగ వెంకటరమణ. పొంగూరు.నాగరాజ్. డిహెచ్ పి ఎస్ పట్టణ కార్యదర్శి మునిరత్నం.తదితరుల పాల్గొన్నారు.

# పైడి తల్లి అమ్మవారిని దర్శించుకున్న మక్కా సాయిబాబు నాయుడు



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** పొందూరు మండల కేంద్రంలో వెలసియున్న శ్రీ పైడితల్లి అమ్మవారి 40 వ యాత్రా మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పొందూరు యంగ్ స్టార్ యూత్ క్లబ్ ఆహ్వానం మేరకు తూర్పు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మక్కా సాయిబాబు నాయుడు యాత్రా మహోత్సవాలలో పాల్గొన్నారు. ఈయనకు ఆలయ కమిటీ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.అనంతరం అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఏపీ టిడిపి బిసి ఫెడరేషన్ నాయకులు, మాజీ ఎస్పీ దూదేకుల షేక్షావలి ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్



**గుంతకల్లు మార్చి 23 (ప్రజాజ్యోతి) :** అనంతపురము నగరంలోని లలితకళా పరిషద్ నందు మైనారిటీ రాష్ట్ర నాయకులు దూదేకుల షేక్షావలి పేద ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా రంజాన్ తోఫా పంపిణి చేయు కార్యక్రమం లో ముఖ్య అతిథిగా టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అనంతపుర ము నగరం మత సామ్రాస్యా నికి ప్రతీకగా ఉంది, ఇలాంటి పండుగ మాసంలో పేద ముస్లిం లను రంజాన్ తోఫా షేక్షావలి ఇవ్వడం ఆయనను అభినందిస్తున్నానని, భవిషత్తులో ఇలాగే వారు సేవా కార్యక్రమాలు చేయాలని కోరుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో ముస్లిం సోదరులకు ఇచ్చిన పథకాలన్నీ అమలు త్వరలో చేస్తారని వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అనంతపురం పట్టణ తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు మరియు ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దళిత గిరిజన ప్రజా సంఘం భారతీయ భీమ్ సేన కార్యాలయం ఘనంగా ప్రారంభించిన జై భీమ్ రామాంజనేయులు రాకెట్ల చందు నాయక్



**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** భారతీయ భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు పామిడి సాకే ఓబులేసు విలేకరుల సమావేశంలో జై భీమ్ రామాంజనేయులు రాకెట్ల చందు నాయక్ మాట్లాడు అనంతపురం జిల్లా నందు దళిత గిరిజన ప్రజా సంఘం మరియు భారతీయ భీమ్ సేన సంఘాలు కలిసి కూటమి ఏర్పడి అనంతపురం జిల్లా నందు ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేశారు కార్యాలయ ప్రారంభోత్సవానికి వివిధ ప్రజాసంఘాల నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున సంఖ్యలో హాజరై కార్యాలయం ప్రారంభించడం జరిగినది.. ఈ కార్యక్రమంలో బిబిఎస్ రాష్ట్ర అధ్యక్షులు సాకే ఓబులేష్ .పి హెచ్ పి ఎస్ వ్యవస్థాపకులు మన్నేపాకుల మాధవ. పూసల సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతు. ఎస్సీ ఎస్టీ మెంట్రీ కమిటీ నెంబర్ డాక్టర్ తిరుపాలు. జై భీమ్ రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై నాగరాజు. వెంకటేశ్వర్లు. బహుజన జెఎసి నరేష్. మున్సిపల్ హెల్పర్ అజయ్ బాబు.%దీదీ% రాయలసీమ ఇంచార్జ్ రవి నారాయణ %దీదీ% రమేష్ రమంజి తదితరులు పాల్గొన్నారు

# సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం కీలక బాధ్యతలు..!!




**అమరావతి, (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఏపీ ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్- 2047 అమలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో గ్రామ వార్డు సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది.జగన్ హయాంలో ఏర్పాటైన వార్డు, గ్రామ సచివా లయాల బాధ్యతల ఖరారు విషయంలో ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. వాలంటీర్ల సేవలు ప్రస్తుతానికి అందుబాటులో లేవు. భవిష్యత్ లో అవకాశం ఇస్తారా లేదా అనేది ఇంకా స్పష్టత లేదు. ఇదే సమయంలో వార్డు - గ్రామ సచివాలయాల ఉద్యోగులతోనే పెన్షన్లు పంపిణీ చేయిస్తున్న ప్రభుత్వం, తాజాగా మరో కీలక బాధ్యతలను అప్పగించింది.ఏపీ ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ -2047 అమలు ప్రతిష్మాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే దీనికి సంబంధించి కసరత్తు కొనసాగుతోంది. అందులో భాగంగా విజన్ అమలు కోసం ప్రభుత్వం తాజాగా జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందులో సచివాయాల కార్యదర్శుల కు బాధ్యతలు కేటాయించింది. జిల్లా స్థాయిలో అమలు బాధ్యతలను జిల్లా ఇంఛార్జ్ మంత్రి పర్యవే క్షిస్తారు. జిల్లా కమిటీలో సభ్యులుగా లోక్‌సభ, రాజ్యసభ ఎంపిలు, ఎమ్మెల్యే, ఎంపిలు, జెడ్పీ చైర్మన్, మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు ఉంటారు. నియోజకవర్గాల యూనిట్‌కు స్థానిక ఎమ్మెల్యే చైర్మన్‌గా, నియోజకవర్గ ప్రధాన కేంద్రంలోని ఎంపిడివో కన్వీనర్‌గా ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్‌పర్సన్, ఆర్డీవో, ఇతర మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ప్రభుత్వం పేర్కొంది.ఇదే సమయంలో సచివాలయాల కమిటీల్లో సర్పంచులు,కార్పొరేటర్, వార్డు కౌన్సిలర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ప్రభుత్వం ఈ విజన్ -2047 అమలు బాధ్యతలను గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న వారిలో కొంత మందిని ఈ విధానం అమలుకోసం ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి ఐదుగురు చొప్పున 875 మందిని ఎంపిక చేయనున్నారు. స్టాటాస్టిక్స్, గణాంక, ఎకనామిక్స్, కామర్స్, కంప్యూటర్ సైన్స్, ఎంబిఏ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రాజకీయ శాస్త్రం, వ్యవసాయం, ఇంజనీరింగ్ అంశాల్లో డిగ్రీ అర్హత కలిగిన వారు నియోజకవర్గాల్లో పనిచేసేందుకు అర్హులుగా నిర్ణయించారు. అలాగే జిల్లాకు ఐదుగురు చొప్పున 130 మందిని జిల్లా స్థాయి విజన్ అమలుకు వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో శాఖకు ఇద్దరు చొప్పున 70 మందిని, ప్రణాళిక శాఖల్లో మరో 25 మంది కార్యదర్శులను ఎంపిక చేసి వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధుల కోసం ఎంపిక చేసిన కార్యదర్శులు ఆన్ డ్యూటీ కింద తమకు అప్పగించిన ప్రాంతాల్లో, శాఖల్లో పనిచేయాల్సి ఉంటుంది. ముందుగా ఏడాదిపాటు వారిని ఓడి విధానంలో కొనసాగిస్తారు. అలాగే నాలుగు విభాగాల్లో పనిచేస్తున్న కార్యదర్శులనే విజన్‌కు వినియోగించుకోనున్నారు. మహిళ పోలీస్, సర్వే అసిస్టెంట్, రెవెన్యూ కార్యదర్శి, ప్లానింగ్ రెగ్యులేషన్ కార్యదర్శులను విజన్‌కు వినియోగించనున్నారు. ఈ సిబ్బంది ఎంపిక బాధ్యత కలెక్టర్ కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# నేడు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం..

**సమావేశం ఏలూరు ఇజ్రాయిల్ పేట కమ్యూనిటీ హాల్లో..**

**ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి రాష్ట్ర నాయకులు విస్సంపల్లి సిద్ధూ మాదిగ విజ్ఞప్తి..**

**జంగారెడ్డిగూడెం, మార్చి 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమీక్ష సమావేశం ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఏలూరులోని ఇజ్రాయిల్ పేట కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసినట్లు ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి రాష్ట్ర నాయకులు మరియు పోలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ విస్సంపల్లి సిద్దు మాదిగ తెలిపారు. ఈ ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశానికి ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు సురేష్ మాదిగ, ఎం ఎస్ పి జాతీయ నాయకులు ముమ్మిడివరపు సుబ్బారావు మాదిగ,తూర్పు కోస్తా జిల్లాల ఇంచార్జ్ పేరెల్లి ఎలిసా మాదిగ ముఖ్య అతిథులుగా హాజరు అవుతారని సిద్దు మాదిగ తెలిపారు. కాబట్టి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న ఎమ్మార్పీఎస్,ఎంఎస్పి అనుబంధ సంఘాల మండల, జిల్లా, రాష్ట్ర ,జాతీయ స్థాయి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సమీక్ష సమావేశాన్ని జయప్రదం చేయాలని సిద్దు మాదిగ విజ్ఞప్తి చేశారు.



# జిల్లా పోలీసులకు ఉగాది పురస్కారాలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం..

**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్..**

**7గురు పోలీసు అధికారులకు సేవా పతకాలు..**

**పోలీసు సేవా పతకాలు పొందిన అధికారులు, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్..**



**విజయనగరం, మార్చి 23 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** విజయనగరం జిల్లా పోలీసుశాఖలో వివిధ హెరీదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది అందిస్తున్న సేవలకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఉగాది సందర్భంగా పోలీసు మెడల్స్ ను ప్రకటించినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ జిల్లా పోలీసుశాఖలో వివిధ హెరీదాల్లో పని చేస్తూ, ఉత్తమ సేవలు అందిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి ఉగాది పండగ సందర్భంగా పోలీసు సేవా మెడల్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వంకుప్రతిపాదనలు పంపామన్నారు. పోలీసుశాఖ పంపిన ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం జిల్లాపోలీసుశాఖలో పని చేస్తున్న విజయనగరం ఎస్బీలో ఎస్ఐగా పని చేస్తున్న వై.సత్యన్నారాయణకు ఉత్తమ సేవా పతకం,విజయనగరం ఎస్సీ మరియు ఎస్టీ సెల్లో పని చేస్తున్న ఎఎస్ఐ ఎం.ప్రసాదరావుకు సేవా పతకం,గుర్ల పోలీసు స్టేషనులో హెచ్సిగా పని చేస్తున్న పి.రమణ కానిస్టేబులు కే.గోపాలరావులకు సేవా పతకాలు,ఆర్మ్డ రిజర్వులో ఎఆర్ఎస్ఐగా పని చేస్తున్న కే.అప్పలరాజు ఎఆర్ హెడ్ కానిస్టేబులు ఎం.గోవిందం ఎఆర్ కానిస్టేబులు బి.శ్రీనివాసరావులకు సేవా పతకాలకు ఎంపికైనట్లుగా, రాష్ట్ర హెరీంశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.జిల్లా పోలీసుశాఖ ప్రతిష్టను రాష్ట్ర స్థాయిలో నిలిపి, ప్రతిష్టాత్మకమైన ఉత్తమ సేవ, సేవా పతకాలు పొందినపోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో పని చేసి, జిల్లా పోలీసుశాఖ ప్రతిష్టను ఇనుమటింప జేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆకాంక్షించారు.

# అగ్ని వీర్ ఆర్మీ లో యువతకు ఉద్యోగ అవకాశాలు..

**జిల్లా కలెక్టర్ వెంకట మురళి..**

**బాపట్ల, మార్చి 23 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** అగ్ని వీర్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ ద్వారా నిరుద్యోగ యువత ఉద్యోగాలు పొందాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.భారత రక్షణ శాఖ వివిధ దళాల రిక్రూట్మెంట్లో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుడుతూ, నూతనంగా ప్రవేశపెట్టిన అగ్ని పథకంలో భాగంగా ఆర్మీ లోఉద్యోగాల ప్రకటన జారీ అయినదని జిల్లా కలెక్టర్ తెలిపారు.అగ్ని జనరల్ డ్యూటీ, అగ్ని వీర్ టెక్నికల్, అగ్ని వీర్ ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ కీపర్ టెక్నికల్ అగ్ని విర్ ట్రేడేస్మేన్ విభాగాలలో ఉద్యోగ నియామకాలు జరుగుతాయని ఆయన అన్నారు. అర్హులైన యువత నుండి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తుందని ఆయన తెలిపారు.ఈ ఉద్యోగ నియామకానికి




రాత పరీక్షను ఆన్లైన్ ద్వారా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ వ్రాత పరీక్ష మొదటిసారిగా తెలుగులో కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఎన్. సి. సి లో ఏ.బి.సి సర్టిఫికెట్ లు ఉన్నవారు మరియు క్రీడాకారులకు ప్రత్యేక బోనస్ మార్కులు ఉంటాయని అని తెలిపారు. ఐటిఐ డిప్లమా చేసిన వారు అగ్ని టెక్నికల్ విభాగానికి అర్హులు అని ఆయన అన్నారు.

జిల్లాలోని ఆసక్తిగల యువకులు ఏప్రిల్ 10 2025వ తేదీ లోపు%షిషి.యశీఅఅఅఅనఖుఖుతీఎఎ.అఅఎ.అఅ% వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ తెలిపారు.నియామక వివరాలను పై వెబ్సైట్ లో తెలుసుకోవచ్చునని, ఈ అవకాశాన్ని సద్వినియోగ చేసుకుని యువత తమ భవితకు మార్గం సులభం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

# ఉద్యమ సూర్యుడు జేబీ శ్రీధర్ అస్తమయం..

**బాపట్ల, మార్చి 23 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** ?ఉద్యమ సూర్యుడు కామ్రెడ్ జేబీ శ్రీధర్ అస్తమించారు. విధ్యార్థి స్థాయి నుంచి ఉద్యమాల బాట పట్టిన జెల్ది భాగ్యశ్రీధర్ ఆదివారం తెల్లవారు జామున తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. సీపీఐ సానుభూతిపరుల్కైన తల్లిదండ్రులు ఆనందరావు మార్తమ్మల పోరాట ఉద్యమ లక్షణాలను పునికిపుచ్చుకుని విధ్యార్థి దశ నుంచి ఉద్యమకారుడిగా ప్రజా సమస్యలపై పోరాటం చేయటం ప్రారంభించారు. సుమారు ఐదు దశాబ్ధాల పాటు కమ్యూనిస్టు పార్టీ సిద్దాంతాల వ్యాప్తికి ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలో అలుపెరగని పోరాటం చేసి బడుగు బలహీన వర్గాలు పేద ప్రజల సమస్యల కోసం అనునిత్యం పోరాటం సాగించారు. పేదలు, కార్మికులు, ఉద్యోగ, బ్యాంకింగ్, ముఠా కార్మికులు, హమాలీలు, రిక్షా, ఆటో రంగం, పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జేబీ శ్రీధర్ ముందుండి పోరాటం చేసేవారు. బాపట్లలో జరిగిన వామపక్ష ఉద్యమాల్లో శ్రీధర్ కీలక పాత్ర పోషించారు. హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి తుది శ్వాస వరకు ఉద్యమమే ఉపిరిగా ప్రజా సమస్యల పరిష్కారమే ద్యాసగా జేబీ శ్రీధర్ జీవితం గడిపాడు. జేబీ శ్రీధర్ అకస్మిక మృతిపై సీపీఐ రాష్ట్ర కార్యవర్గం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జంగాల అజయ్కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్జీ, జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తదితరులు శ్రీధర్ భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జేబీ శ్రీధర్ 1956 ఆగష్టు 12వ తేదీన వినుకొండంలో జన్మించారు. వారి తల్లిదండ్రులు ఉద్యోగరీత్యా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి వెళ్లటంలో అక్కడే బాల్యం విదాభ్యాసం కొనసాగించారు. కామ్రేడ్ శ్రీధర్ విధ్యార్థి నుంచే ఉద్యమ ప్రస్థానం ప్రారంభించారు. ఉద్యమ నేతగా కొనసాగుతూ సుమారు 12 ఏళ్ల పాటు విశాలాంధ్ర విలేకరిగా గుంటూరులో పనిచేశారు. అనంతరం కొనేళ్లపాటు ప్రకాశం జిల్లా ఒంగోలులో విశాలాంధ్ర బుక్ హౌస్ నడిపారు. ఈ నేపధ్యంలో 2002లో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని బాపట్ల నియోజకవర్గ సీపీఐ కార్యదర్శిగా ఉమ్మడి గుంటూరు అంధ్రప్రదేశ్ వ్యసాయ కార్మిక సంఘం అధ్యక్షునిగా బాపట్ల జిల్లా సీపీఐ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. బాపట్ల పట్టణంలోని శారదాపూరి కాలనీ పలు ప్రాంతాల్లో గూడు లేని పేదల గూడు కల్పన కోసం పోరాటాలు చేసి గుడిసెలు వెయించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ బాపట్ల నుంచి గుంటూరు వరకు




పాదయాత్ర చేశారు. బాపట్ల మాజీ ఎమ్మెల్యేలు కోన రఘుపతి, చీరాల గోవర్ధనరెడ్డి, గాదె వెంకటరెడ్డి శ్రీధర్ మృతిపై దిగ్భాంతి వ్యక్తం చేశారు. శ్రీధర్ భౌతికాయానికి పలువురు నివాళు లర్పించారు.

## మృతి చెందిన సిపిఐ నాయకుడు కుటుంబానికి ఆర్థిక సాయం...

**అందజేసిన మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి...**

**బాపట్ల జిల్లా మార్చి 23 ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** సిపిఐ బాపట్ల సీనియర్ నాయకుడు జేబి శ్రీధర్ మృతి చెందడంతో బాపట్ల మాజీ శాసనసభ్యులు కోన రఘుపతి ఆదేశాలతో ఆయన మృతదేహాన్నికి వైసీపీ నాయకులు నివాళులు అర్పించారు అనంతరం కోన రఘుపతి పంపించిన ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబానికి అందజేశారు అందజేసిన వారిలో కాగిత సుధీర్ బాబు ఎంపీపీ చిన్న పోతుల హరి సిహెచ్ చెంచయ్య జోగి రాజా గౌని కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు



## జిల్లా లో క్షయ వ్యాధి తగ్గు ముఖం పడుతోంది...

### డాక్టర్ ఎన్ .వసుంధర



**రాజమహేంద్రవరం, మార్చి 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** తూర్పుగోదావరి జిల్లా లో క్షయ వ్యాధి లక్ష్యాలు ను ఆదిగమించడం తో పాటు వ్యాధి గ్రస్తులను ముందగా గుర్తుంచి త్వరితగతిని చికిత్స అందించడం వల్ల క్షయ వ్యాధి క్రమేపి తగ్గ ముఖం పడుతోందని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ మరియు క్షయ నియంత్రణ అధికారిణి డాక్టర్ ఎన్. వసుంధర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా లో ప్రస్తుతం 2864 మంది సాధారణ క్షయ వ్యాధి గ్రస్తులు, 47 మంది మొండి క్షయ వ్యాధి గ్రస్తులు ఉన్నారన్నారు. జిల్లా లో గత మూడేళ్ళ గణాంకాలు పరిశీలిస్తే ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రుల ల్లో నమోదు అయిన క్షయ వ్యాధి గ్రస్తుల వివరాలు 2022 లో 3098 టీబీ కేసులు, 2023 లో 2905 టీబీ కేసులు, 2024 లో 2817 కేసు నమోదు అయ్యాయని తెలిపారు. అదేవిధంగా ఈ మూడేళ్ళ లో మరణాల సంఖ్య కూడా మూడు శాతం నుండి 1.5 శాతానికి తగ్గిందన్నారు.ప్రతి గ్రామా పంచాయతీలు లో ఉన్న హెల్త్ వెల్నెస్ సెంటర్ ల్లో టీబీ అనుమానితులు ఉన్న ప్రాంతాలు అంటే మురికి వాడలు, ఇటుక బట్టీలు, కుటీర పరిశ్రమలు , వృద్ధ ఆశ్రమాలు, గురుకుల పాఠశాలలు తదితర ప్రాంతాలను గుర్తించి అక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ కోసం జిల్లా లో ఒక సిబిఎన్ఏఏటి యంత్రం , 25 ట్రూనాట్ యంత్రాలు , 28 మైక్రోస్కోపీ యంత్రాలు ఉన్నాయనీ, ఎనిమిది టీబీ యూనిట్ ల్లో 35 మంది సిబ్బంది పనిచేస్తున్నట్లు తెలిపారు.జిల్లా లో 2023 సంవత్సరం లో 109 గ్రామపంచాయతీ లు రజత మెడల్ కు ఎంపిక అయ్యాయి అని వాటి లో 2025 సంవత్సరానికి 77 సిల్వర్ మెడల్ కు ఎంపిక అయ్యాయని చెప్పారు. వరసగా మూడో సంవత్సరం కూడా 77 పంచాయతీలు నామినేషన్ కి వెలితే గోల్డ్ మెడల్ సాధించిన పంచాయతీ లు గా నిలుస్తాయి అని ఆశ భావం వ్యక్తం చేసారు.క్షయ వ్యాధి పై సమాజం లో ఉన్న సోషల్ స్టిగ్మా పై కళాశాల విద్యార్థుల చే అవగాహనా సదస్సులు ర్యాలీలు , వ్యచరచన పోటీలు ముగ్గుల పోటీలు పోస్టర్ ప్రదర్శనలు నిర్వహించా మన్నారు.

మార్చి 24 సోమవారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల లో ఏర్పాటు చేసిన ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా క్షయ రహిత గ్రామా పంచాయతీలకు, వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు, టీబీ నివారణ కోసం పాటుపడిన సేవకులు కు కలెక్టర్ చేతుల మీదగా బహుమతి ప్రదానం జరుగుతుంది అని డాక్టర్ వసుంధర పేర్కొన్నారు

## రుషికొండ బీచ్‌కు ‘బ్లూఫ్లాగ్’పునరుద్ధరణ..

**మంత్రి కందుల దుర్గేష్..**

**రుషికొండ బీచ్ కు పూర్వ వైభవం..**

**బ్లూఫ్లాగ్ పునరుద్ధరణపై మాట ఇచ్చి మంత్రి దుర్గేష్..**

**రాష్ట్రంలో మరికొన్ని బీచ్ లకు బ్లూఫ్లాగ్ గుర్తింపు కోసం ప్రతిపాదనలు.**



**రాజమహేంద్రవరం, మార్చి 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** విశాఖలోని రుషికొండ బీచ్ కు బ్లూఫ్లాగ్ పునరుద్ధరణపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రుషికొండ బీచ్ కు బ్లూఫ్లాగ్ గుర్తింపు పునరుద్ధరణపై అసెంబ్లీలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని ప్రకటనలో పేర్కొన్నారు. బ్లూఫ్లాగ్ పునరుద్ధరణ కోసం పర్యాటక శాఖ అధికారుల కృషిని, విశాఖ కలెక్టర్ హరేంద్రీ ప్రసాద్ చొరవను, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, పోలీస్, అటవీ శాఖల అధికారులను మంత్రి దుర్గేష్ అభినందించారు. బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ పునరుద్ధరణకు ప్రోత్సహించిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.భారతదేశంలో బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన మొదటి ఎనిమిది బీచ్‌లలో రుషికొండ ఒకటని తెలిపిన మంత్రి దుర్గేష్ నిరంతరం రుషికొండ బీచ్ లో భద్రతా ప్రణాళిక, పర్యావరణం, ట్రాఫిక్, నీటిశుద్ధి, వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసామన్నారు. రాష్ట్రంలో మరిన్ని బీచ్ లకు బ్లూఫ్లాగ్ సర్టిఫికేట్ కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. మరి కొన్ని బీచ్ లకు బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ వస్తే ఆయా బీచ్ లకు ప్రత్యేక నిధులు వచ్చి మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు.ఇప్పటికే రుషికొండ బీచ్ పై విధించిన తాత్కాలిక ఉపసంహరణ ఆదేశాలు ఎత్తివేస్తున్నట్లు బ్లూఫాగ్ ఇండియా అధికారులు ప్రకటించి విశాఖపట్నం కలెక్టర్ కు సబంధిత ధ్రువీకరణ పత్రం అందజేశారు. మళ్లీ రుషికొండ బీచ్ కు బ్లూఫాగ్ హెూదాను డెన్మార్కు కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రకటించింది. బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ పొందిన రుషికొండ బీచ్ లో మళ్లీ నీలి రంగు జెండా రెపరెపలాడనుంది.

## ఏలూరు జిల్లా లో 8 హైవే మొబైల్స్‌కు జిపిఆర్ఎస్ అమరిక..




**ఏలూరు, మార్చి 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు కీలక చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ నేతృత్వంలో ఏలూరు జిల్లా ప్రాంతంలోని 8 హైవే మొబైల్స్ కు జిపిఆర్ఎస్ (జి పిఎస్ ) ట్రాకింగ్ సిస్టమ్ అమర్చారు. దీంతో హైవే మొబైల్ వాహనాల భద్రతా పర్యవేక్షణ మరింత మెరుగుపడి, ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లో సమయానుకూలంగా స్పందించే అవకాశం లభిస్తుంది.హైవే మొబైల్ సిబ్బందికి రేడియం జాకెట్లు, బేటన్స్ అందజేసిన నేపథ్యంలో సిబ్బంది మరింత సౌకర్యంగా విధులు నిర్వర్తించగలుగుతారు.హైవే లలో ప్రమాదాల నివారణకు కోసం సమర్థవంతంగా నివారించేందుకు, నేషనల్ హైవే లు మరియు స్టేట్ హైవేల్లో పోలీస్ పర్యవేక్షణను బలోపేతం చేయడం లక్ష్యంగాఈచర్యలు తీసుకున్నట్లుగా ఏలూరు డి.ఎస్.పి శ్రావణ్ కుమార్ తెలిపారు. హైవే లపై మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక వేగం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వంటి ప్రమాదకర చర్యలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు మరియు పెట్రోలింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా ప్రజలంతా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి, హైవేలలో రోడ్డు భద్రతను పాటిస్తూ ప్రయాణం చేయాలని డిఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఏవైనా అత్యవసర పరిస్థితులు లేదా హైవే ప్రమాదాల సమాచారం కోసం హైవే మొబైల్ మరియు పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8332959175 కు లేదా డయల్ 112 ను సంప్రదించాలని ప్రజలకు డి.ఎస్.పి శ్రావణ్ కుమార్ సూచించారు.

## నివాసాలు మధ్యలో మద్యం షాపులు

# తీసివేయాలి-రిలే నిరాహారదీక్షలుచేస్తున్న మహిళలు

బ్రాందీ షాపు ఎత్తేవరకు పోరాడతాం

పవన్ కళ్యాణ్ చెప్పిన మాట ఏమైంది

**కోనసీమ జిల్లా రిపోర్టర్ మార్చి 23:** మండపేట సప్తగిరి థియేటర్ ఎదురుగా ఏర్పాటు చేస్తున్న కల్లు గీత కార్మికుల మద్యం షాపు ను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ మహిళలు రిలే దీక్షలకు దిగారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ బడుగు, బలహీన వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో నివాసిస్తున్నారని, తమ ఆడబిడ్డలు ప్రయివేట్ లకు వెళ్ళి 9 గంటల వరకూ ఇంటికి వస్తూ వుంటారని, ఆ ప్రాంతమంతా మధ్యంబాబు లతో నిండి పోతే తమ పిల్లల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తాము ఎంత ఆవేదన వ్యక్తం చేస్తున్నా నిర్వాహకులు మరింత దుర్మార్గంగా తమ ముందే నిర్మాణాలు కొనసాగిస్తున్నారన్నారు. వాళ్ళతో చావో రేవో తేల్చుకుంటామన్నారు. అవసరం అయితే బ్రాందీ షాపు లు కారణంగా ఏ ఒక్క మహిళకు ఇబ్బంది రాకుండా చూస్తానని మాట ఇచ్చిన పవన్ కళ్యాణ్ తోనే తెల్చుకుంటామన్నారు. అధికార కూటమి నేతలు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యపై స్పందించకపోతే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఇప్పటి వరకూ శాంతియుతంగా దీక్షలకు పూనుకున్నామని, అధికారుల్లో స్పందన కనిపించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తాము ఎంత వరకైనా వెళతామని, అక్కడ బ్రాందీ షాపు పెడితే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 27,28,29,30 వార్డుల ప్రజలు రావూరి దుర్గాదేవి, పిల్లి నాగమణి, శీలం గణికమ్మ, కేతా దేవి, పిల్లి పద్మ, మురియద్ బేగం, మామిడి లక్ష్మి, లంకపల్లి కుమారి, మద్దూరి దేవి, గుమ్ములూరు మహాలక్ష్మి, ఈతా మహాలక్ష్మి, సుంకర గౌరీ లక్ష్మి, శీలం నీలవేణి, వనపర్తి శ్రావణి, శీలం ఇంద్రాణి, కడియాల లక్ష్మి, వాసా సుధ, కుడుపూడి నాగమణి తదితరులు పాల్గొన్నారు.




## సూపర్ సిక్స్ పథకాలను

# ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం.





- త్వరలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు .
- అభివృద్ధి చేసాం కాబట్టే పూల వర్షం కురుస్తోంది
- 1 కోటి 50 లక్షల రూపాయలతో పూర్తి చేసిన సిసి రోడ్లు మరియు డ్రైనేజీలను ప్రారంభించిన మంత్రి సవితమ్మ

**పెనుకొండ /సోమందేపల్లి : మార్చి 23:**
గత ప్రభుత్వం అయిదే ళ్లలో చేయని అభివృద్ధి పనులను ఎనిమిది నెలల్లో చేసి చూపించాం. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళుతున్నామని బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖామంత్రి సవితమ్మ అన్నారు. సోమందేపల్లి లో 1కోటి 50 లక్షలతో పూర్తిచేసిన అభివృద్ధి పనులను మంత్రి సవితమ్మ గారు ప్రారంభించారు . స్నేహలత నగర్ నందు 30 లక్షల రూపాయలతో ద్వారకా నగర్ నందు 29 లక్షల రూపాయలతో సప్తగిరి మరియు సాయి నగర్ కాలనీ నందు 40 లక్షల రూపాయలతో అదే విధంగా గీతా నగర్ నందు 20 లక్షల రూపాయలతో నల్గొండరాయునిపల్లి నందు 20 లక్షల రూపాయల నిధులతో పూర్తిచేసిన సిసి రోడ్లు మరియు డ్రైనేజీలను మంత్రి సవితమ్మ ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతు అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని,ఓ వైపు అమరావతి పునః నిర్మాణం చేపడుతునే, మరో వైపు పోలవరం నిర్మాణ పనులు వేగవంతం చేసామని, గత పాలకుల పాలనతో అభివృద్ధి ఆగిన ఆంధ్రప్రదేశ్ లో మళ్ళి అభివృద్ధి జరుగుతోందంటే అది మా నాయకుడు చంద్రబాబు ఘనతే అన్నారు. పని చేసాము కాబట్టే ప్రజలు పూల వర్షంతో స్వాగతం పలికారన్నారు, త్వరలో మరో 50 లక్షలతో మరిన్ని అభిర్వృద్ధి పనులు సోమందేపల్లిలో మొదలు పెడతామన్నారు.సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఇప్పటికే ఉచిత ఇసుకను అమలు చేశామని ,అన్నా క్యాంటీన్ లు ప్రారభించామని తెలిపారు.త్వరలో తల్లికి వందనం తోపాటు అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తామని తెలిపారు..
చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం . ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం,యువగళం పాద యాత్రలో నేతన్నలకు నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం చేనేతలకు 200 యూనిట్లు,పవర్ లూమ్స్ కు 500 యూనిట్లు ఉచిత కరెంటు జీఓ ఇటీవల అసెంబ్లీలో విడుదల చేసిన సందర్భంగా, సోమందేపల్లి మండల కేంద్రంలోని స్నేహలతానగర్ లో మంత్రి సవిత సమక్షంలో,చంద్రబాబు



చిత్ర పటానికి పాలాభిషేకం చేసారు చేనేతలు,మరమగ్గాల యజమానులు,మాస్టర్ వీవర్స్,ఇచ్చిన మాట నేరవేర్చినందుకు సియం చంద్రబాబుకు,మంత్రి లోకేష్ కు,మంత్రి సవితకు చేనేతలు,మరమగ్గాల యజమానులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమందేపల్లి మండలం కేంద్ర%శీ% ఒక క్లస్టర్ కూడా ఏర్పాటు చేస్తామని మంత్రి సవితమ్మ తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## పుట్టపర్తిలో 24న కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ టి ఎస్ చేతన్



**పుట్టపర్తి మార్చి 23 :** శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి పట్టణంలో ఈనెల 24వ తేదీన సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో ఉదయం 9 .30గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అనంతలో 24న కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- : ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- : జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురం, మార్చి 23 :** ఈనెల 24వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆస్ట్రాలజిస్ట్ మామిళ్లపల్లి ఫణికుమార్‌కు జ్యోతిర్ మిత్ర అవార్డు



**విజయవాడ మార్చి 23 :** విజయవాడ రూరల్ మండలం నున్నకు చెందిన ఆస్ట్రాలజిస్ట్, గోల్డ్ మెడల్ విన్నర్ డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్‌కు శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కారం 2025 లభించింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ ఉగాది పురస్కారాలను విజయవాడలోని గోల్డెన్ వేలో ఆదివారం ప్రధానం చేసింది. విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞన సంస్థ చైర్మన్ విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిధులు ఫణికుమార్‌కు జ్యోతిర్ మిత్ర అవార్డును ప్రదానం చేశారు. శ్రీ కంచి కామకోటి సర్వజ్ఞ పీఠ ఆస్థాన సిద్ధాంతి లక్కవఝుల విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి, శతాధిక గ్రంథ సంకలన కర్త ఆదిపూడి శివ సాయిరామ్, జ్యోతిష విశారద గ్రంథ రచయిత పాలపర్తి శ్రీకాంత శర్మ, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ అధ్యాపకులు, బహుగ్రంథ రచయిత పుచ్చా శ్రీనివాసరావు తదితరులు ఫణికుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైదిక జ్యోతిష సమ్మేళనం నిర్వహించారు.

## ఏప్రిల్ 1న పర్చూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటన..

కలెక్టర్ వెంకట మురళి వెల్లడి..

పెన్షన్లు పంపిణీ లో పాల్గొననున్న ముఖ్యమంత్రి..



**బాపట్ల, మార్చి 23 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** ఏప్రిల్ 1న పర్చూరు నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. పర్చూరు నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంకు “ పేదల సేవలో” అనే నామకరణం జరిగినట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. ఈ కార్యక్రమం సంబంధించి జిల్లా ఇన్చార్జి మంత్రి, జిల్లా మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులతో చర్చించినట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ ఒకటో తారీఖున ఈ కార్యక్రమం సుమారు నాలుగు గంటల పాటు జరుగుతుందని అన్నారు. మొదటగా లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ, ప్రజా వేదిక కార్యక్రమం, పొలిటికల్ మీటింగ్ చివరిగా అధికారులతో సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొంటారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అధికారులకు విధుల కేటాయింపులో జిల్లా రెవెన్యూ అధికారికి ఆయన సూచనలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాలకు ఎటువంటి ఆటంకం లేకుండా జయప్రదం చేయాలని అధికారులకు అయన దిశా నిర్దేశం చేశారు.
కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, సిపిఓ శ్రీనివాసరావు, డిపిఓ ప్రభాకర్, డ్వామా పిడి విజయలక్ష్మి, డి ఆర్ డి ఎ పి డి పద్మ, బాపట్ల డిఎల్డివో విజయలక్ష్మి, బాపట్ల, చీరాల,రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

## రైతుల పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి..




**బాపట్ల, మార్చి 23 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను కల్పించడంలో ప్రభుత్వ విఫలమైందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పి రాంబాబు విమర్శించారు. రైతులకు కనీస మద్దతు ధరలు అమలు పరచే యంత్రాంగం లేదు, చట్టబద్ధతలేదు. ఇటువంటి పరిస్థితులలో పొగాకు ధరలు గత రెండు మూడు సంవత్సరాలుగా ఆశాజనకంగా, లాభసాటిగా ఉండడంతో రైతులు పొగాకు వైపు మళ్ళడంతో పొగాకు సాగు గణనీయంగా పెరిగిందని అయితే గత సంవత్సరం క్వింటాలు పదివేల రూపాయలకు అమ్ముడు పోయిన అడుగు ఆకు ఈ సంవత్సరంనాలుగైదు వేల రూపాయలకు మించక పోవడంతో రైతులు అయోమయంలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పొగాకు రైతులకు న్యాయమైన,లాభదాయకమైన ధరలు లభించేలా చూడటం, ఎగుమతులను ప్రోత్సహించటం చేయాలని అన్నారు. పొగాకును గుంటూరు, శ్రీకాకుళం, నెల్లూరు, కర్నూలు, ఏ ప్రాంతంలో ఏరకమైన పొగాకు, ఎంత మొత్తంలో సాగు చేశారనేది ప్రభుత్వం దగ్గర గాని, పొగాకు బోర్డు దగ్గర గాని అంచనాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. ఏది ఏమైనా రాష్ట్రంలో అన్ని పంటలు పండుతున్నాయని అయితే అవి పండిస్తున్న రైతులకు సరైన గిట్టుబాటు ధర లభించడం లేదని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి ఎంపీపీ చెరువుపోతుల హరి జోగి రాజా చల్లారామయ్య

## అంబేద్కర్ విగ్రహం పై దాడి అమానుషం : న్యాయవాది బత్తుల రవికుమార్



**అన్నవరం ప్రజా జ్యోతి రిపోర్టర్ బి ఎస్ వి ప్రసాద్** తూర్పుగోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, దూబచర్ల గాంధీ కాలనీలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యొక్క విగ్రహాన్ని కి చెప్పుల దండలు వేయడం అమానుషం ఎవరైతే ఈ దాడికి పాల్పడ్డారో వారిని తక్షణం అరెస్ట్ చేయాలని ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ కమిటీ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది బత్తుల రవికుమార్ కోరి ఉన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ అన్ని వర్గాలకు చెందినటువంటి వ్యక్తి అని ఇటువంటి దాడులు భవిష్యత్తులో జరగకుండా ప్రభుత్వాలు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని ఒక ప్రకటనలో రవికుమార్ తెలియజేశారు

## సిపిఐ జిబి శ్రీధర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే



**బాపట్ల జిల్లా మార్చి 23 ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్** సిపిఐ బాపట్ల సీనియర్ నాయకుడు జేబి శ్రీధర్ మృతి చెందడంతో బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆదేశాల మేరకు కావూరి శ్రీనివాసరెడ్డి ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు అనంతరం నరేంద్ర వర్మ ఇచ్చిన 50,000 రూపాయిల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు

# జాతీయస్థాయిలో రామగిరి ఖిలాకు కీర్తి





**ప్రతిపాదిత రోప్‌వే జాబితాలో చోటు**

**మాస్టర్ ప్లాన్‌లో రూ.5 కోట్లు కేటాయింపు**

**కాళేశ్వరం నుంచి మంథని ఆలయాల అభివృద్ధికి నిధులు**

**ఇకో పార్కుగా ఎల్‌మడుగు**

అభివృద్ధికి అవకాశం ఉన్న పర్యాటక ప్రాంతాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా.. తెలంగాణలో తొలిసారిగా రోప్‌వే పర్యాటకానికి అవకాశం కల్పించింది. భువనగిరి జిల్లా యాదగిరి గుట్టపై 2 కిలోమీటర్ల రోప్‌వేను తొలిసారిగా ఏర్పాటు చేస్తుండగా.. రాష్ట్రంలో మరో నాలుగు ప్రతిపాదిత రోప్‌వేలలో పెద్దపల్లి జిల్లా రామగిరి కోటకు చోటు కల్పించారు.

**ప్రాచీన శిల్పకళా సంపదకు చిరునామా.. రామగిరి ఖిలా**

జిల్లాలోని రామగిరి ఖిలాను జాతీయస్థాయిలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మాస్టర్‌ప్లాన్‌తో ముందుకు సాగుతున్నారు. ఇక్కడి ప్రాచీన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.5 కోట్లు కేటాయించింది. రామగిరి ఖిలా (%=ఖుఖ్రుస్త్రఅతీఆ టశీతీ%) క్రీస్తు శకం ఒకటో శతాబ్దంలో రామగిరి కోటగా రూ పుదిద్దుకుంది. ఈ కోట శత్రుదుర్భేద్యమైన రక్షణ స్థావరంగా వందల ఏళ్లపాటు వివిధ వంశాల రాజులకు ఆశ్రయమిచ్చింది. ఎంతో ఎత్తున్న దుర్గం, అనేక రాతి కట్టడాలు, బురుజులు, ఫీనాలతో విరాజిల్లుతోంది. దుర్గం అంతర్భాగంలో సాలుకోట, సింహాల కోట, జంగేకోట, ప్రతాపరుద్రుల కోట, అశ్వాల, కొలువుశాల, మొఘల్‌శాల, చెరసాల, గజశాల, భజనశాల, సభాస్థలితో పాటు రహస్య స్థలాలు, రహస్య మార్గాలు, సొరంగాలు, తీపులు, ఫిరంగి గుండ్లు ఇక్కడ దర్శనమిస్తాయి. తెలంగాణలోని దుర్గాల్లో ఈ దుర్గం పటిష్టంగా ఉండి.. వజ్రకూటంగా ప్రసిద్ధి చెందింది. సీతమ్మ కొలను గుంటపై పసుపు, ఎరుపు రంగు నీరు దర్శనమివ్వడం విశేషం. పిల్లల ఫిరంగి నుంచి దూరితే సంతానప్రాప్తి లభిస్తుందని పర్యాటకుల విశ్వాసం. రామగిరి ఖిలాపై సుందర దృశ్యాలు, ప్రాకారాలు.. సందర్శకులను ఆకర్షిస్తాయి. శ్రీరాముని మూల విగ్రహాలున్న స్థలంలో కొండ చరియకింద వెయ్యిమంది తలదాచుకోవచ్చు. రామగిరి కోటలో ఇరువైపులా 9 ఫిరంగులు, 40 తోపులు ఉన్నాయి. శ్రీరాముడు వనవాసకాలంలో రామగిరికోటపై తపస్సు చేసి గుహలో శివలింగాన్ని ప్రతిష్టించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడి కొండపై నుంచి వచ్చే నీటిధార.. బిలం నుంచి లోయలోకి ప్రవహిస్తోంది. ఈ ద్వా రం వద్ద సీతాదేవి స్నానమాచరించినట్లు భక్తుల నమ్మకం. కొండపై సీతారాముల విగ్రహాలతో పాటు నంది విగ్ర హం ఉంది. నీటిధార నేరుగా శివలింగం, నంది విగ్రహాలపై పడటం విశేషం. రామగిరి కొండ పైనుంచి వర్షాకాలం జలపాతాలు కనువిందు చేస్తాయి. రోప్‌వే ద్వారా పర్యాటకుల్ని గుట్టపైకి తీసుకొచ్చేలా ప్రతిపాదనలు చేశారు. కేంద్రం నుంచి అనుమతి రాగానే.. రామగిరి ఖిలాకు పర్యాటకుల సందడి పెరగనుంది.



**లోయలాంటి సరస్సు ఎల్‌మడుగు**

గోదావరి నది మధ్య సహజసిద్ధంగా ఏర్పడిన అతి పెద్ద లోయలాంటి సరస్సే ఎల్‌మడుగు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల మధ్య మంథని మండలం ఖాన్‌సాయిపేట %-% శివ్వారం అటవీ ప్రాంతంలోని ఎల్‌మడుగు రెండు గుట్టల నడుమ ప్రవహిస్తోంది. ఈ సరస్సు చుట్టూ ఆనుకున్న దట్టమైన అటవీ ప్రాంతం, ఎత్తయిన కొండలు, గుట్టలు.. రెండు కొండల మధ్యనుంచి ప్రవహించే గోదావరి నది.. ఆ సరస్సులో సందడి చేసే పక్షుల కిలకిలారావాలు, నీటిలో ఎగిరే చేపల విన్యాసాలు కనువిందు చేస్తాయి. చిన్న చిన్న చేపపిల్లలు గుంపుగా కదులుతున్న దృశ్యం.. కళ్లెదుటే ఆక్వేరియం ఉన్నట్టు అనిపిస్తుంది. సుమారు రెండు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉండే ఈ సరస్సులో.. ఈ సుందర దృశ్యాలను కచ్చితంగా చూడాల్సిందే అనడం అతిశయోక్తి లేదు. ప్రకృతి అందాలతో కనువిందు చేసే ఎల్‌మడుగును ఇకో పార్కుగా అభివృద్ధి చేసేందుకు రూ.2 కోట్లు కేటాయించారు. ఇప్పటికే మంథని మండలం ఖానాపూర్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గోదావరి వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కాళేశ్వరంలో పర్యాటక అభివృద్ధికి రూ.115 కోట్లు, మంథనిలోని గోదావరి నది తీరంలో గౌతమేశ్వర ఘాట్ అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ ఇటీవల మంథనిలో పర్యటించగా, పర్యాటక శాఖ కమిషనర్ న్యాలకొండ ప్రకాశ్‌రెడ్డి సైతం రామగిరిని సందర్శించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్.. మంత్రి శ్రీధర్‌బాబు సతీమణి కాగా, పర్యాటక శాఖ కమిషనర్ ఈ ప్రాంతానికి సంబంధించిన ఐపీఎస్ అధికారి కావడం.. మంథనికి కలిసివస్తుందన్న ఆశాభావం సర్వత్రా వ్యక్తమవుతోంది.

# చదువు పూర్తవకముందే ఉద్యోగావకాశాలు!

**నాలుగున్నర దశాబ్దాల్లో వెయ్యి మందికి పైగా చదువు**

**దేశ, విదేశాల్లో ఉద్యోగాలు**

**సొంతంగా డెయిరీ పరిశ్రమల ఏర్పాటు**

**కామారెడ్డి:** తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక డెయిరీ కళాశాల కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉంది. నాలుగున్నర దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నతోద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ చదువు పూర్తవకముందే ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో అనేక ఉద్యోగావకాశాలు దక్కుతాయి. రాష్ట్రంలో ప్రముఖ డెయిరీ సంస్థ అయిన జెర్సీ డెయిరీ డైరెక్టర్లంతా ఈ కళాశాల విద్యార్థులు కావడం విశేషం. రాష్ట్రంలోని వివిధ డెయిరీ సంస్థల్లో కీలక స్థానాల్లో పనిచేస్తున్న వారంతా ఇక్కడ చదువుకున్నవారే. కామారెడ్డి పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో 1978లో బీఎస్సీ డెయిరీ కోర్సును ప్రారంభించారు. ఇంటర్ చదివిన వారికి.. నేరుగా సాధారణ డిగ్రీ కోర్సుల్లా డెయిరీ కోర్సులో ప్రవేశం కల్పించేవారు. తరువాతి కాలంలో బీటెక్ డెయిరీ కోర్సుగా మార్పుచెంది.. ఎంసెట్ ద్వారా సీట్ల కేటాయింపు మొదలైంది. డెయిరీ కోర్సు ఎంచుకున్న వారికి.. ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయించేవారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో కొనసాగిన డెయిరీ కోర్సును 2007 సెప్టెంబర్ 1న శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోకి మార్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వ విద్యాలయం పరిధిలోకి తీసుకువచ్చారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో.. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలకు సంబంధించిన 60 ఎకరాల భూమిని డెయిరీ కళాశాలకు కేటాయించారు. కాలేజీ భవనం, హాస్టళ్ల నిర్మాణాలకు రూ.11 కోట్లు మంజూరు చేసిన అప్పటి సీఎం వైఎస్సార్.. భవనాల నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. కాలేజీ భవనంతో పాటు బాలికలు, బాలుర హాస్టళ్లు, ఆడిటోరియం, ల్యాబ్‌లకు భవనాలు నిర్మించారు. పీజీ కోర్సులకు అవసరమైన మేర సౌకర్యాలు కూడా ఉన్నాయి. అప్పటి నుంచి అదే భవనంలో కళాశాల కొనసాగుతోంది. ప్రాక్టికల్స్‌లో భాగంగా విద్యార్థులు పాల పదార్థాలు తయారు చేసి.. డెయిరీ పార్లర్‌ను కూడా నిర్వహిస్తున్నారు. విద్యార్థులు కోవా, దూద్‌పేడా, రసగుల్లా, గులాబ్‌జామ్ వంటివి తయారు చేసి విక్రయిస్తారు.






...లు తయారు చేస్తున్న విద్యార్థులు



**వెయ్యి మందికి పైగా చదువు..**

కళాశాల స్థాపించినప్పటి నుంచి.. ఇప్పటి వరకు 900 పైచిలుకు డెయిరీ కోర్సులు చదివారు. వారిలో చాలామంది దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోనూ డెయిరీ రంగంలో ఉన్నతోద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ చదివిన వారిలో కొందరు విద్యార్థులు సొంతంగా డెయిరీ ఉత్పత్తుల సంస్థలను స్థాపించారు కూడా. మరెందరో వివిధ డెయిరీ సంస్థల్లో పనిచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లోనూ చాలామంది ఉద్యోగాలు చేస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా విజయ డెయిరీ, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, సూపర్‌వైజర్లు వంటి ఉద్యోగ అవకాశాలు కూడా పొందే వీలుంది. రాష్ట్ర స్థాయిలో ఉపకార వేతనాలు, జాతీయ స్థాయిలో మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తారు.

**పీజీ కోర్సులు వస్తే మరింత ప్రయోజనం**

కళాశాలలో పీజీ కోర్సులు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు మేలు జరుగుతుంది. రాష్ట్రంలో ఎక్కడా డెయిరీ కళాశాలలు లేవు. ఏకైక కామారెడ్డి కళాశాలలో పీజీ కోర్సులు లేకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు వెళ్లి పీజీ కోర్సులు చదవాల్సి వస్తోంది. ఇతర రాష్ట్రాల్లో ఉన్నత విద్యనభ్యసించాలంటే ఖర్చుతో కూడుకున్నది కావడంతో.. చాలా మంది బీటెక్‌తోనే చదువును ఆపేస్తున్నారు. ఇక్కడే పీజీ కోర్సులు ప్రారంభిస్తే ఎంతో ప్రయోజనం కలుగుతుందని విద్యార్థులు అంటున్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**మంచి భవిష్యత్తు ఉన్న కోర్సు**

బీటెక్ డెయిరీ కోర్సు చదివిన వారెవరూ ఖాళీగా ఉండే పరిస్థితి లేదు. అందరికీ అనేక అవకాశాలు దొరుకుతు న్నాయి. మా కళాశాలలో చదివినవారు ప్రపంచవ్యాప్తంగా డెయిరీ సంస్థల్లో ఉన్నతోద్యోగాలు చేస్తున్నారు. మన రాష్ట్రంలోని అన్ని డెయిరీల్లోనూ మనవారే కీలక పాత్ర పోషిస్తున్నారు. కొందరు సొంతంగా డెయిరీ సంస్థలు నెలకొల్పారు. ఏటా 40 మందికి ప్రవేశం పొందడానికి అవకాశం ఉంది. ఎంపీసీ చదివిన విద్యార్థులకు ఎంసెట్ ద్వారా డెయిరీ కోర్సులో 35 మందికి సీట్లు దక్కుతాయి. ఐదు సీట్లను రైతు విభాగాల కోటా ద్వారా భర్తీ చేస్తాం.

## ఐపీఎల్ మ్యాచ్.. బ్లాక్ టికెట్ల దందా.. రంగంలోకి పోలీసులు



**హైదరాబాద్, మార్చి 23 :** ఐపీఎల్ మ్యాచ్ నేపథ్యంలో బ్లాక్ టికెట్స్ దందాపై రాచకొండ కమిషనరేట్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. అయినా ఉప్పల్‌లో భారీగా బ్లాక్ టికెట్స్ దందా నడుస్తోంది. శని, ఆదివారాల్లో 19 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 45 బ్లాక్ టికెట్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ముగ్గురిని, ఆదివారం 16 మందిని అరెస్ట్ చేసినట్లు రాచకొండ పోలీసులు వెల్లడించారు. వారిలో నలుగురి నుంచి 15 టికెట్లు స్వాధీనం చేసుకున్నట్లు మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు తెలిపారు. అలాగే దేవేందర్ అగర్వాల్ నుంచి 2, గుగులోతు రాకేష్ నుంచి 4, భానోత్ యాకుబ్ నాయక్ నుంచి 2 టిక్కెట్లను స్వాధీనం చేసుకున్నామని ఎల్బీనగర్ పోలీసులు చెప్పారు. ఇక కార్తీక అనే వ్యక్తి నుంచి 3, అప్పల సురేష్ దాస్ నుంచి 2 టికెట్లు స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజిగిరి పోలీసులు పేర్కొన్నారు. మ్యాచ్ నేపథ్యంలో బ్లాక్ టికెట్ల విక్రయం జరగకుండా రాచకొండ పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. మరోవైపు కాసేపట్లో హైదరాబాద్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో హైదరాబాద్ సన్ రైజర్స్ ఢీ కొట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉప్పల్ స్టేడియం వద్ద అభిమానుల కోలాహలం ప్రారంభమైంది. ఉప్పల్ స్టేడియం పరిసరాలు ఆరెంజ్ రంగు సంతరించుకొంది. ఇక ఐపీఎల్ 18వ సీజన్‌లో ఉప్పల్ స్టేడియంలో మెదట మ్యాచ్ ప్రారంభంకానుంది. సొంత గడ్డపై ఈ సీజన్‌లో తొలి మ్యాచ్‌ను హైదరాబాద్ సన్ రైజర్స్ ఆడుతోన్నారు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై సన్ రైజర్స్‌కు మంచి రికార్డ్ ఉందన్న సంగతి అందరికి తెలిసిందే.

## ఘెర రోడ్డు ప్రమాదం.. నలుగురు దుర్మరణం

సూర్యాపేట జిల్లా: జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చివ్వెంల మండలం బీబీ గూడెం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. ఆర్టీసీ బస్సు, కారు ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రోడ్డు ప్రమాదంలో మరణించి వారిలో ముగ్గురిని గడ్డం రవి, గడ్డం రేణుకు, గడ్డం రీతులుగా గుర్తించారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. కారు నుజ్జు నుజ్జు కావడంతో వీరు స్పాట్ లో మరణించారు. గడ్డం రవి, ఇతర బంధువులు కలిసి మోతె మండలం కోటపహాడ్ లో శుభకార్యానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. బస్సును కారు బలంగా ఢీకొట్టడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

**మరో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చెరువు కట్ట వద్ద మరో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ లారీ ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడక్కడే దుర్మరణం చెందారు. మృతులు సీతం పేటకు చెందిన మహేష్, పవన్ లుగా గుర్తించారు పోలీసులు.

# ఇంటిని న్యాచురల్‌గా కూల్ చేసేయండిలా



ఏసీ, కూలర్ లేదని బాధపడకుండా ఇంట్లో ఈ చిన్నపాటి మార్పులు చేసి కూడా రోజంతా కూల్ గా ఉండొచ్చు. మీ ఇంట్లో సహజంగా ఉండే వస్తువులతోనే ఎండాకాలం హీట్ ని తరిమేయొచ్చు. అందుకోసం మీరు కొంత సమయం కేటాయించగలిగితే ఈ సీజన్ మొత్తం హ్యాపీగా ఎంజాయ్ చేయొచ్చు. మీరు చేసే ఈ చిన్న పనులే మీ ఇంటిని చల్లగా మార్చేస్తుంది. ఎండాకాలంలో ఇంట్లో ఉంటే ఏసీ వదిలి అడుగు బయటపెట్టలేం. ఇప్పుడున్న ఎండల్లో ఈ హీట్ ను బీట్ చేయాలంటే మినిమం ఏసీ లేదంటే కూలర్ ఉండాల్సిందే. కానీ రోజంతా వీటి వాడకం అందరికి కుదరదు. కరెంటు బిల్లు మోతెక్కిపోతుంది. అందుకే ఇంటిని ఇలా సహజంగా కూల్ గా ఉంచుకునే టిప్స్ ట్రై చేయండి. ఇవి ఆర్టిఫిషియల్ చల్లదనం వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ నుంచి మీ ఇంట్లో వారిని రక్షిస్తుంది. రోజంతా ఇంటిని చల్లగా ఉంచుతుంది. డైరెక్ట్ సన్ లైట్ ను ఇంట్లోకి రాకుండా అడ్డుకోవడానికి కర్టెన్స్ ఎంతో ముఖ్యం . అయితే, ఈ కాలంలో లేత రంగులకన్నా కూడా ముదురు రంగు కర్టెన్లు బాగా పనిచేస్తాయి. వీటి స్థానంలో మీరు వెదురు బ్లైండ్లు, ఖస్ కర్టెన్లను కూడా ఉపయోగించవచ్చు. ఒకవేళ మీకు మంచి బాల్కనీ ఏరియా ఉంటే ఇక్కడ ఈ జనపనారతో తయారు చేసే ఖస్ కర్టెన్లను వాడటం వల్ల ఇల్లంతా ఎంతో చల్లగా మారిపోతుంది. వీటి మీద అప్పుడప్పుడూ నీటిని చిలకరిస్తే ఇక ఆ రోజుకు సరిపడా చల్లదనం లభించినట్టే.ఇంట్లో గాలి ఫ్లో బాగుండాలంటే ఎదురెదురుగా ఉన్న తలుపులు, కిటికీలను తెరిచి ఉంచండి. ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్న సమయంలో కాసేపు వీటిని తెరిచి ఉంచడం వల్ల ఇంట్లో వేడి గాలి బయటకు వెళ్లిపోతుంది. ఇంటిని తాజాగా ఉంచడానికి ఇండోర్ కూలింగ్ ప్లాంట్లను ఉపయోగించండి. స్థల పరిమితుల కారణంగా ఫ్లాట్‌లో నివసించే చాలా మందికి పెద్ద పెద్ద మొక్కలు పెంచుకోవడం వీలుపడదు. దీని కోసం, మీరు నిలువు వెర్టికల్ గార్డెన్ ను ప్రయత్నించవచ్చు. అప్పుడు మీకు చిన్న బాల్కనీ స్థలంలో చిన్న కుండీలను నిలువుగా ఏర్పాటు చేసుకుంటే సరిపోతుంది.

మొక్కలు వేడిని గ్రహిస్తాయి, తేమను విడుదల చేస్తాయి. గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయి. కలబంద ఇండోర్ గాలిని చల్లబరుస్తుంది. అరెకా పామ్ గాలిని తాజాగా చల్లగా ఉంచే సహజ హ్యూమిడిఫైయర్. స్నేక్ ప్లాంట్ రాత్రిపూట ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. మీ పడకగదిని చల్లగా చేస్తుంది. పీస్ లిల్లీ అదనపు తేమను గ్రహిస్తుంది. తేమ స్థాయిలను తగ్గిస్తుంది. ఇంట్లోనే ఎయిర్ కూలర్ తయారు చేసుకోవచ్చు. తక్షణ శీతలీకరణ ప్రభావం కోసం ఫ్యాన్ ముందు ఒక గిన్నె ఐస్ ఉంచండి. కాటన్ ఫ్యాబ్రిక్ కు మారండి కాటన్ బెడ్‌షీట్లు తేలికపాటి ఫ్యాబ్రిక్‌ను వాడండి ఎందుకంటే అవి గాలి పీల్చుకునేలా, తేలికైనవిగా ఉంటాయి తేమను దూరం చేయడంలో సహాయపడతాయి, మిమ్మల్ని చల్లగా సౌకర్యవంతంగా ఉంచుతాయి. అవి మెరుగైన గాలి ప్రసరణను కూడా విడుదల చేస్తాయి. వేడి పెరుగుదలను తగ్గిస్తాయి.

## మేకప్ విషయంలో ఈ పొరపాట్లు చేస్తున్నారా?



ఈ రోజుల్లో మేకప్ ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైపోయింది. అయితే చాలా మంది వేగంగా రెడీ కావడం కోసం కొన్ని తప్పులను చేస్తున్నారు. ఇవి చర్మానికి హానికరం కావచ్చు. మేకప్ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా ఉంటుంది.ఈ రోజుల్లో మేకప్ ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగమైపోయింది. అయితే కొంత మంది వేగంగా రెడీ కావడానికి కొన్ని తప్పుడు అలవాట్లు పాటిస్తారు. ఇవి చర్మ ఆరోగ్యానికి హానికరం కావచ్చు. రోజంతా ఆఫీసులో ఉన్నాక ఫంక్షన్‌కి వెళ్లాలంటే ఇంటికి వెళ్లే టైం ఉండకపోవచ్చు. చాలా మంది ఉదయం వేసుకున్న మేకప్ పై మరోసారి టచ్‌అప్ ఇస్తారు. కానీ ఇది తప్పు. చర్మం చక్కగా తేమగా ఉండాలి కానీ అలా మేకప్‌ను మళ్లీ వేసుకుంటే ముఖం పొడిబారిపోతుంది, మృతకణాలు పేరుకుంటాయి. పైగా ఈ విధానం మొటిమలు వచ్చే అవకాశాన్ని పెంచుతుంది. ఇప్పటికే మేకప్ వేసుకున్నా, ఇంక సన్‌స్క్రీన్ అవసరమేంటి..? అనుకునే వారు కూడా ఉంటారు. కానీ ఇది పెద్ద పొరపాటు. మధ్యాహ్న వేళల్లో బయటికి వెళ్లాలంటే సన్‌స్క్రీన్ తప్పనిసరి. మేకప్ వేసుకున్నా, వేసుకోకపోయినా, సన్‌స్క్రీన్ లేకపోతే చర్మం ఎండకు బలవుతుంది. కాబట్టి ముందుగా సన్‌స్క్రీన్ రాసుకుని దాని మీద మేకప్ వేసుకోవడం ఉత్తమం.మేకప్ బ్రష్‌లను వాడిన తర్వాత శుభ్రం చేయకపోతే వాటిలో బ్యాక్టీరియా పెరుగుతుంది. అలా మళ్లీ వాడితే మొటిమలు, అలర్జీలు వచ్చే అవకాశం ఉంటుంది. కనీసం వారంలో ఒకసారి బ్రష్‌లను సున్నితంగా కడిగి శుభ్రపరచాలి.తలస్నానం చేసిన వెంటనే హెయిర్ డ్రయర్, స్ట్రెయిట్నర్, కర్లర్ వాడటం వల్ల జుట్టులో సహజ నూనె ఆవిరైపోతుంది. ఫలితంగా జుట్టు పొడిగా మారి విరిగిపోతుంది. వీటిని తరచూ వాడకూడదు. సహజంగా ఆరనివ్వడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే తడిగా ఉన్న జుట్టును దువ్వడం కూడా మంచిది కాదు. అలసిపోయి రాత్రి అలాగే నిద్రపోవడం చాలా మందికి అలవాటు. కానీ ముఖంపై మేకప్ అలాగే ఉండిపోతే చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. ఫలితంగా చర్మం మృతకణాలతో నిండిపోతుంది. ఇది మొటిమలకు కారణమవుతుంది. అందుకే నిద్రకు ముందు ముఖాన్ని శుభ్రంగా కడగడం తప్పనిసరి. మేకప్ ప్రోడక్ట్‌లను కొన్నాక వాటి గడువు ముగిసినా పట్టించుకోకుండా వాడడం చాలా మంది చేస్తారు. కానీ ఎక్స్‌పైరీ అయిన ఉత్పత్తులను వాడితే చర్మ సమస్యలు రావచ్చు. కనీసం ఏడాదికొకసారి మేకప్ ప్రోడక్ట్‌లను రీచెక్ చేసి అవసరమైనవి మార్చుకోవడం మంచిది. ఈ చిన్న చిట్కాలను పాటిస్తే మీ చర్మం ఆరోగ్యంగా మెరిసిపోతుంది. మేకప్ వేసుకున్నా, వేసుకోకపోయినా, ఆరోగ్యాన్ని రక్షించుకోవడం ముఖ్యం.

## ఏసీతో పాటు సీలింగ్ ఫ్యాన్ వాడొచ్చా?



ఏసీ నడుస్తున్నప్పుడు సీలింగ్ ఫ్యాన్ వాడొచ్చా అనే సందేహం చాలా మందికి ఉంటుంది. కొంతమంది ఇది అవసరం లేదని భావిస్తారు, కానీ నిజానికి ఇది గదిలోని గాలిని సమానంగా చల్లబరచడంలో సహాయపడుతుంది. దీని వల్ల ఏసీ ఎక్కువ పని చేయాల్సిన అవసరం తగ్గి, విద్యుత్ ఖర్చు కూడా తగ్గించుకోవచ్చు. ఏసీ నడుస్తున్నప్పుడు సీలింగ్ ఫ్యాన్ వాడొచ్చా అనే సందేహం చాలా మందికి ఉంటుంది. కొంతమంది ఏసీతో పాటు ఫ్యాన్ ఉపయోగించకూడదని భావిస్తారు. ఎందుకంటే ఫ్యాన్ వేడి చేసిన గాలిని కిందికి తోసి గదిని వేడిగా మారుస్తుందని అనుకుంటారు. కానీ నిజానికి సీలింగ్ ఫ్యాన్ గదిలోని గాలినే చక్కగా ప్రసరింపజేస్తుంది. ఏసీతో పాటు సీలింగ్ ఫ్యాన్ ఉపయోగించడం వల్ల గది సమృద్ధిగా చల్లబడుతుంది.సీలింగ్ ఫ్యాన్ గదిలోని గాలిని సమానంగా చల్లబరుస్తుంది. ఏసీ నుంచి విడుదలయ్యే చల్లని గాలిని గదిలోని అన్ని మూలలకు చక్కగా వ్యాపింపజేస్తుంది. దీని వల్ల గదిలో ఉన్న వారికీ మరింత సౌకర్యంగా అనిపిస్తుంది. గదిలోని గాలిని వేగంగా చల్లబరచడం వల్ల ఏసీ ఎక్కువ పని చేయాల్సిన అవసరం తగ్గుతుంది.ఏసీ ఎక్కువ సమయం నడవకుండా తక్కువ సమయంలోనే గది చల్లబడేలా ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. గదిలోని తలుపులు మూసివేయడం వల్ల చల్లని గాలి బయటకు వెళ్లకుండా ఉంటుంది. దీని వలన గదిలో చల్లదనం ఎక్కువ సమయం కొనసాగుతుంది. ఇది ఏసీ శక్తిని ఆదా చేసేలా సహాయపడుతుంది. ఏసీని ఎక్కువ సమయం నడిపితే విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుంది. అయితే ఏసీతో పాటు సీలింగ్ ఫ్యాన్‌ను తక్కువ వేగంతో నడిపితే విద్యుత్ వినియోగం తగ్గించుకోవచ్చు. ఏసీ ఉష్ణోగ్రతను 24 నుండి 26 డిగ్రీల మధ్య ఉంచి ఫ్యాన్‌ను తక్కువ వేగంతో నడిపితే గది వేగంగా చల్లబడుతుంది.సాధారణంగా ఏసీని 6 గంటల పాటు నడిపితే 12 యూనిట్ల వరకు విద్యుత్ ఖర్చవుతుంది. కానీ ఏసీతో పాటు సీలింగ్ ఫ్యాన్ కూడా వాడితే కేవలం 6 యూనిట్లు మాత్రమే ఖర్చవుతుంది. అంటే విద్యుత్ ఖర్చు తక్కువ అవుతుంది. దీని వలన ఏసీ ఉపయోగం వల్ల వచ్చే ఖర్చును తగ్గించుకోవచ్చు. సమగ్రంగా చూసుకుంటే ఏసీతో పాటు సీలింగ్ ఫ్యాన్ వాడడం వల్ల చల్లదనం సమానంగా వ్యాపించడమే కాకుండా ఏసీ ఎక్కువ పని చేయాల్సిన అవసరాన్ని తగ్గిస్తుంది. దీని వలన విద్యుత్ ఖర్చు కూడా తగ్గిపోతుంది. అందువల్ల ఏసీ నడుస్తున్నప్పుడు సీలింగ్ ఫ్యాన్ వాడొచ్చా అనే సందేహం వద్దు. ఇది కేవలం గదిని చల్లగా ఉంచడమే కాకుండా విద్యుత్ ఖర్చు తగ్గించేందుకు కూడా ఉపయోగపడుతుంది.

## అమ్మాయిల ఆరోగ్యానికి తాటి ముంజలు



తాటి ముంజల గురించి పరిచయం అక్కర్లేదు. ఎందుకంటే ఇవి ప్రతి ఒక్కరికీ సుపరిచితమే. వేసవి వచ్చిందంటే తాటి ముంజల రుచులు చూడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. పోషకాలు పుష్కలంగా ఉండే ముంజలు ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఇవి వేసవి తాపం నుంచి మనల్ని రక్షించడమే కాకుండా అమ్మాయిల ఆరోగ్యానికి ఎన్నో రెట్లు మంచి చేస్తుంది. వేసవిలో మాత్రమే లభించే తాటి ముంజలు ఇష్టపడని వారుండరు. వేసవి వస్తే వీటిని మార్కెట్‌లలో, రోడ్ల పక్కన ఎక్కడపడితే అక్కడ అమ్ముతుంటారు. ఈ తాటి ముంజల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఇవి వేసవి తాపం నుంచి మనల్ని రక్షించడమే కాకుండా శరీరానికి అవసరమైన విటమిన్లను కూడా అందిస్తాయి. ముంజల్లో జింక్, పొటాషియం వంటి ఖనిజాలు అధికంగా ఉంటాయి. అందువల్ల వేసవిలో ముంజల్ని తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ సమస్యను కూడా నివారించవచ్చు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారికి ముంజలు దివ్యౌధంలా పనిచేస్తాయి. రక్తహీనత సమస్యను తగ్గిస్తుంది. వేసవిలో వచ్చే చర్మ వ్యాధులను నివారించడంలో ముంజలు బలేగా ఉపయోగపడతాయి. ఈ పండ్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇది కడుపు సంబంధిత సమస్యలను కూడా నయం చేస్తుంది. మలబద్ధకం, విరేచనాలు వంటి సమస్యలు ఉన్నవారికి చాలా మంచిది. తాటి ముంజలు తినడం వల్ల పేగు పూతల కూడా నయమవుతుంది. నాలుకపై వచ్చే అల్సర్లను తగ్గించే శక్తి వీటికి ఉంటుంది. వేసవిలో అధికంగా వచ్చే మొటిమలను వదిలించుకోవడానికి, ఆరోగ్యకరమైన జుట్టు, చర్మం కోసం వీటిని తినవచ్చు. తాటి ముంజలు చెమట బొబ్బలు, ఎండ వల్ల కలిగే ఇతర చర్మ సమస్యలను తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ముంజల రసాన్ని చర్మానికి పూయడం వల్ల చెమటకాయలు త్వరగా తగ్గుతాయి. ముంజలు పాలిచ్చే తల్లుల ఆరోగ్యానికి చాలా మంచిది. శిశువుకు మంచి పోషకాలు కూడా లభిస్తాయి. వీటిని తినడం వల్ల మహిళల్లో వచ్చే తెల్లబట్ట సమస్య తగ్గుముఖం పడుతుంది.

## నెల రోజుల పాటు టీ తాగడం మానేస్తే...



మన దేశంలో దాదాపు 90 శాతం మందికి ఇష్టమైన వేడి పానీయం టీ. కొంతమందికి ఉదయం నిద్రలేవగానే టీ తాగాలనిపిస్తుంది, మరికొందరు రోజుకు లెక్కలేనన్ని సార్లు టీ తాగుతారు. ఎందుకంటే నికోటిన్ లాంటి మూలకం టీలో ఉంటుంది మరియు పొగాకులో కూడా ఉంటుంది. ప్రజలు దానికి బానిసలవుతారు. టీ కూడా శక్తి మరియు తాజాదనానికి మూలం. దాదాపు ప్రతి ఒక్కరి జీవితంలో టీ ఒక భాగమైంది. చాలా మంది ప్రతిరోజూ ఉదయం మంచం మీద నుండి లేచిన వెంటనే టీ తాగి రోజును మొదలుపెడతారు. అదే సమయంలో, చాలా మంది అల్పాహారం సమయంలో కూడా టీ తాగుతారు. అటువంటి పరిస్థితిలో, చాలా మంది రోజుకు చాలాసార్లు టీ తీసుకుంటారు. చాలా మంది టీకి ఎంతగా బానిసలయ్యారంటే, వారు రోజుకు 3 నుండి 4 సార్లు టీ తాగుతారు. అయితే, టీని అధిక పరిమాణంలో తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. ఒక వ్యక్తి ఒక నెల పాటు టీ తాగడం మానేస్తే ఏం జరుగుతుందో తెలుసుకుందాం.. టీ ప్రియులకు, ఒక నెల పాటు టీ తాగకుండా ఉండటం పెద్ద సవాలుగా ఉంటుంది, కానీ టీ తాగాలనే కోరికను అరికట్టడం వల్ల వారి ఆరోగ్యానికి లెక్కలేనన్ని ప్రయోజనాలు లభిస్తాయి. సాధారణంగా మనం తాగే టీలో చక్కెర ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల కేలరీలు పెరుగుతాయి. ఇది కాకుండా, ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, టీలో అధిక చక్కెర జీర్ణవ్యవస్థకు హాని కలిగిస్తుంది. చక్కర కలిపిన టీ తాగడం మానేస్తే , మీ జీర్ణక్రియ మెరుగుపడుతుంది. దీనివల్ల బరువు కూడా తగ్గుతుంది. ఇది మాత్రమే కాదు, ఇది మీకు అనేక ఆరోగ్య సంబంధిత సమస్యలను కూడా నివారిస్తుంది. మీరు ఒక నెల పాటు చక్కెర టీ తాగకపోతే, మీ రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి, మీరు తక్కువ చక్కెర తినాలని కోరుకుంటారు, మీరు ఉత్సాహంగా ఉంటారు, మీ దంత ఆరోగ్యం మెరుగుపడుతుంది మీ చర్మం స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది, ఎందుకంటే చక్కెర ఎక్కువగా తీసుకోవడం వల్ల మొటిమలు వస్తాయి. అయితే, చక్కెరను పూర్తిగా మానేసిన మొదటి కొన్ని రోజుల్లో మీరు అలసట లక్షణాలను అనుభవించవచ్చు. ఒక నెల పాటు స్వీట్ టీని నివారించడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి . స్వీట్ టీ తాగడం వల్ల చర్మంపై దద్దుర్లు, బొబ్బలు వస్తాయి. కాబట్టి, మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి స్వీట్ టీ తాగకపోవడమే మంచిది. టీ తాగే అలవాటును మానుకోవడం వల్ల గుండెల్లో మంట, తలతిరగడం, హృదయ స్పందన రేటులో హెచ్చుతగ్గులు వంటి సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. మీ చేతులు వణుకుతుంటే టీ తాగడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతుంది. అంతేకాకుండా, మీరు టీ తాగడం మానేస్తే, అధిక రక్తపోటు సాధారణమవుతుంది.

# బిజినెస్

## టాటా కార్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా 'ఛావా' హీరో




**న్యూఢిల్లీ:** బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్లు ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ వెల్లడించింది. తమ ప్యాసింజర్, ఎలక్ట్రిక్ వాహనాల శ్రేణి ప్రచారానికి ఆయన తోడ్పడనున్నట్లు తెలిపింది. ఐపీఎల్ సీజన్ సందర్భంగా కొత్త టాటా కర్వ్ ప్రచార కార్యక్రమంతో ఈ భాగస్వామ్యం ప్రారంభమవుతుందని వివరించింది. ఇందుకోసం 20 సెకన్ల నిడివితో 'టేక్ ది కర్వ్' పేరిట ప్రకటనలు రూపొందించినట్లు సంస్థ పేర్కొంది. ఈ నేపథ్యంలో టాటా మోటర్స్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ఒక రీల్‌ను కూడా పోస్ట్ చేసింది. ఇందులో కౌశల్ కంపెనీ తాజా కారు కర్వ్‌ను ప్రమోట్ చేస్తూ కనిపించాడు. ఈ పోస్ట్ లో "ఉత్తమ కథలు ట్విస్ట్ లతో నిండి ఉంటాయి.. విక్కీ కౌశల్‌తో టాటా మోటార్స్ కొత్త శకానికి స్వాగతం" అంటూ రాసుకొచ్చింది.

## ఆప్షన్ ట్రేడింగ్ అక్కడే కొంప ముంచుతోంది




**ముంబై :** స్టాక్ మార్కెట్లోని ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌పై కొత్త సెబీ చీఫ్ తుహిన్ కాంత పాండే కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ట్రేడర్ల అతి విశ్వాసం, ముఖ్యంగా గడువు ముగిసే కొన్ని నిమిషాల ముందు మార్కెట్లోకి ప్రవేశించడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని అభిప్రాయపడ్డారు. ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ సిగ్మెంట్లో ట్రేడింగ్ చేస్తున్న రిటైల్ ఇన్వెస్టర్ల గురించి ఇప్పటికే అనేక పర్యాయాలు సెబీ మాజీ చీఫ్ మాధబి పూరి బుచ్ కూడా ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. కాగా, ఎఫ్ అండ్ ఓ మదుపర్లపై చాలా కాలంగా ఇవే తరహా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఎఫ్ అండ్ ఓ ట్రేడర్లు భారీ స్థాయిలో నష్టాల పాలు కావడం లెక్కలతో సహా చూపిస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలను పొందొచ్చనే ఆలోచనే ఫ్యూచర్ అండ్ ఆప్షన్ ట్రేడర్ల నష్టాలకు ఒక కారణమని అభిప్రాయపడ్డారు సెబీ కొత్త చీఫ్. బిజినెస్ టుడే మైండ్‌రష్ 2025 ఫోరమ్‌లో పాల్గొన్న పాండే తన అభిప్రాయాల్ని వ్యక్తపరిచారు. ఈ విభాగాల్లో నూటికి 90 శాతం మంది రిటైల్ పెట్టుబడిదారులు డబ్బును కోల్పోతున్నారన్నారు. మిగిలిన పదిశాతం మందీ కూడా బ్రోకరేజ్, ఇతర చార్జీల పోగా వచ్చేవి కంటితుడుపు లాభాలేనన్నారు. ఎఫ్అండ్ఓ ట్రేడింగ్ పై సెబీ ఒక చర్చా పత్రాన్ని విడుదల చేసిందని.. పరిశ్రమ వర్గాల అభిప్రాయం ఆధారంగా వీటి పరిష్కారాలపై పనిచేస్తోందని చెప్పారు. డెరివేటీవ్స్ ట్రేడింగ్‌తో పాటు, ఈక్విటీ పెట్టుబడిదారులకు సంబంధించి సెబీ అమలు చేస్తున్న వివిధ చర్యల గురించి పాండే వివరించారు.

# మళ్లీ 9 వేల లే ఆఫ్స్, ఇక మిగిలేది ఎవరు

ప్రపంచం రోజుకు రోజుకు మారిపోతున్న నేపథ్యంలో ఉద్యోగ విభాగాల్లో కూడా అనేక మార్పులు వస్తున్నాయి. ఈ క్రమంలోనే అనేక కంపెనీలు లే ఆఫ్స్ ప్రకటిస్తున్నాయి. ప్రముఖ అగ్ర సంస్థలు కూడా ఉద్యోగులను తొలగించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రముఖ టెక్ సంస్థ ఐబిఎం కూడా ఈ ఏడాది అమెరికాలో దాదాపు 9,000 ఉద్యోగాలను తగ్గించనున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఇక మిగిలేది ఎవరని పలువురు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

**వీలైనంత ఎక్కువ మందిని**

ది రిజిస్టర్ నివేదిక ప్రకారం, ఈ తొలగింపులు ఐబిఎం క్లౌడ్ క్లాసిక్ యూనిట్ వంటి అనేక విభాగాలను ప్రభావితం చేస్తున్నాయని అంటున్నారు. ఇందులో దాదాపు 50% మంది ఉద్యోగులు ఈ మార్పులకు గురవుతున్నారని భావిస్తున్నారు. అయితే, పశ్చిమ దేశాలలో ఉద్యోగ నష్టాలు పెరుగుతున్నప్పటికీ, ఈ పునర్నిర్మాణం భారతదేశానికి అనుకూలంగా మారవచ్చని నిపుణులు అంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఐబిఎం తన ఉద్యోగులను ఇండియాకు మార్చుతుందని అంటున్నారు. ఈ క్రమంలో వీలైనంత ఎక్కువ మందిని భారతదేశానికి తరలించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

**ఖర్చులు తక్కువగా**

ఐబిఎం ప్రస్తుతం యుఎస్ కంటే భారతదేశంలో ఎక్కువ ఉద్యోగ అవకాశాలను కలిగి ఉందని, ఉద్యోగం కోల్పోయిన ఒక యుఎస్ ఉద్యోగి కూడా పేర్కొన్నాడు. భారతదేశంలో



ప్రతిభ సమృద్ధిగా ఉండటంతో పాటు, నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉండటం వల్ల ఐబిఎం తన శ్రామిక శక్తిని భారతదేశం వైపు తిరిగి కేంద్రీకరించాలనే వ్యూహాన్ని అవలంబిస్తోందన్నారు. ఐబిఎం %జజుూ% అరవింద్ కృష్ణ కూడా ఈ విషయాన్ని గతంలో బహిరంగంగా చర్చించారు.

**అవకాశాలను పెంచే దిశగా**

ఈ క్రమంలో ఊహించిన విధంగా జరిగితే, భారతీయ టెక్ ఉద్యోగులు ముఖ్యంగా క్లౌడ్, మౌలిక సదుపాయాలు, సేల్స్, కన్సల్టింగ్ అనుభవం ఉన్నవారు మరిన్ని ఉద్యోగ అవకాశాలను పొందవచ్చు. ప్రధానంగా పశ్చిమ దేశాలలో తొలగించబడుతున్న వారు భారతదేశంలో అవకాశాలను పొందవచ్చు. ఐబిఎం ఇప్పటికే బెంగళూరు, హైదరాబాద్, పూణే, చెన్నై వంటి నగరాల్లో విస్తరించింది. ఇది భారతదేశంలో ఉద్యోగ అవకాశాలను పెంచే దిశగా కృషి చేస్తోందని నిపుణులు అంటున్నారు.

**భారతదేశంలో ఉద్యోగ అవకాశాలు**

ఈ మార్పులు భారతదేశంలో %ఖు% రంగానికి కొత్త అవకాశాలను తెచ్చే అవకాశం ఉంది. ఐబిఎం వంటి సంస్థలు భారతదేశంలో ఉన్న ప్రతిభను గుర్తించి, నైపుణ్యాలను ఉపయోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో, భారతీయ ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంచుకోవడం, కొత్త సాంకేతికతలను నేర్చుకోవడం ద్వారా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చు. ఈ క్రమంలో క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలలో నైపుణ్యాలు కలిగిన వ్యక్తులకు మంచి అవకాశాలు రానున్నాయి.

# రియల్‌ఎస్టేట్ ఏజెంట్లకు కేంద్రమంత్రి సూచన

భారత రియల్ ఎస్టేట్ రంగ వృద్ధికి వీలుగా.. కార్యకలాపాల్లో విశ్వాసం, పారదర్శకత ఉండేలా చూడాలని ఈ రంగానికి చెందిన ఏజెంట్లకు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ సూచించారు. 2030 నాటికి రియల్ ఎస్టేట్ మార్కెట్ రూ.85 లక్షల కోట్లకు చేరుకోనుందన్న అంచనాను ప్రకటించారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్ ఇండియా (నార్-ఇండియా) వార్షిక సమావేశంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి మాట్లాడారు. అంతర్జాతీయంగా అత్యుత్తమ ప్రమాణాలను, కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలని పరిశ్రమను కోరారు. నార్%-%ఇండియాలో 50వేల మంది ఏజెంట్లు సభ్యులుగా ఉన్నారు. రియల్ ఎస్టేట్ రంగం వృద్ధిలో ఏజెంట్ల పాత్రను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. డెవలపర్లు, వినియోగదారుల మధ్య వీరు కీలక వారధిగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఏజెంట్ల సూచలను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. 2016లో రెరాను తీసుకురావడాన్ని అద్భుత సంస్కరణగా పేర్కొన్నారు. డెవలపర్లు, కొనుగోలుదారుల మధ్య వివాదాల నివారణకు దీన్ని తీసుకొచ్చారు. అలాగే, రియల్ ఎస్టేట్‌లోకి నూరు శాతం




విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడం, వ్యాపార సులభతర నిర్వహణకు తీసుకున్న చర్యలను ప్రస్తావించారు. 2047 నాటికి దేశ జనాభాలో సగం మంది పట్టణాల్లోనే నివసించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇది 35 శాతంగా ఉంది

## చరిత్ర సృష్టించిన సన్‌రైజర్స్..

# ప్రపంచంలోనే తొలి జట్టుగా

ఐపీఎల్-2025ను సన్‌రైజర్స్ హైదరాబాద్ అద్భుతమైన విజయంతో ప్రారంభించింది. ఉప్పల్ వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 44 పరుగుల తేడాతో ఎస్ఆర్‌హెచ్ గెలుపొందింది. 287 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్తాన్ 6 వికెట్లు కోల్పోయి 242 పరుగులు మాత్రమే చేయగల్గింది. ఎస్ఆర్‌హెచ్ బౌలర్లలో సిమర్జీత్ సింగ్, హర్షల్ పటేల్ తలా రెండు వికెట్లు పడగొట్టగా.. షమీ, జంపా చెరో వికెట్ సాధించారు. రాజస్తాన్ బ్యాటర్లలో ధ్రువ్ జురెల్(70) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఆర్‌హెచ్ 6 వికెట్ల నష్టానికి 286 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే రాజస్తాన్ బౌలర్లను సన్‌రైజర్స్ బ్యాటర్లు ఊచకోత కోశారు. క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్ బంతిని స్టాండ్స్‌కు తరలించాడు. ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లలో ఇషాన్ కిషన్ అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. కేవలం 47 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్స్‌లతో 106 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇషాన్‌కు ఇదే తొలి ఐపీఎల్ సెంచరీ కావడం గమనార్హం. కాగా ఐపీఎల్-2025 మెగా వేలంతో కిషన్‌ను రూ.11.25 కోట్లకు ఎస్ఆర్‌హెచ్ కొనుగోలు చేసింది. కిషన్‌తో పాటు ట్రావిస్ హెడ్(67), క్లాసెన్(34), నితీశ్ కుమార్(30) పరుగులతో రాణించారు. రాజస్తాన్ బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే మూడు వికెట్లు పడగొట్టగా.. థీక్షణ రెండు, సందీప్ శర్మ ఒక్క వికెట్ సాధించారు. ఇక ఈ మ్యాచ్‌లో భారీ స్కోర్ చేసిన సన్‌రైజర్స్ ఓ అరుదైన రికార్డును



తమ పేరిట లిఖించుకుంది.

**ఎస్ఆర్‌హెచ్ వరల్డ్ రికార్డు..**

టీ20 క్రికెట్‌లో అత్యధిక సార్లు 250 ప్లస్ స్కోర్లు సాధించిన తొలి జట్టుగా ఎస్ఆర్‌హెచ్ వరల్డ్ రికార్డు సృష్టించింది. సన్‌రైజర్స్ ఇప్పటివరకు 4 సార్లు 250 పైగా పరుగులు చేసింది. ఇంతకుముందు రికార్డు ఇంగ్లండ్ క్రికెట్ క్లబ్ సర్రే పేరిట ఉండేది. సర్రే 3 సార్లు 250 ప్లస్ స్కోర్లు నమోదు చేసింది. తాజా మ్యాచ్‌తో సర్రే ఆల్‌టైమ్ రికార్డును కమ్మిన్స్ సేన బ్రేక్ చేసింది. అదేవిధంగా ఐపీఎల్ చరిత్రలో ఇది రెండో అత్యధిక స్కోర్ కావడం గమనార్హం.

## వారెవ్వా ధోని.. కేవలం 0.12 సెకన్లలోనే!



ఎంఎస్ ధోని.. ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ వికెట్ కీపర్ బ్యాటర్లలో ఒకడిగా పేరు సంపాదించుకున్నాడు. ఈ జార?ండ్ డైనమేట్.. విధ్వంసకర బ్యాటింగ్‌తో పాటు అద్భుతమైన వికెట్ కీపింగ్ స్కిల్స్‌కు పెట్టింది పేరు. తాజాగా ధోని మరోసారి తన కీపింగ్ స్కిల్స్?తో అభిమానులను అలరించాడు. ఐపీఎల్-2025లో చెపాక్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సీఎస్‌కే తరఫున ఆడుతున్న ధోని.. అద్భుతమైన స్టంపింగ్‌తో మెరిశాడు. ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను మెరుపు స్టంప్ ఔట్ చేసి ధోని పెవిలియన్‌కు పంపిచాడు. ఇన్నింగ్స్ 11 ఓవర్ వేసిన లెగ్ స్పిన్నర్ నూర్ అహ్మద్.. మూడో బంతిని సూర్యకు గూగ్లీగా సంధించాడు. ఆ బంతిని సూర్యకుమార్ క్రీజు నంచి బయటకు వచ్చి షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. కానీ బంతి అద్భుతంగా టర్న్ అయ్యి అతడి బ్యాట్‌ను మిస్ అయ్యి వికెట్ల వెనక ఉన్న ధోని చేతికి వెళ్లింది. ఈ క్రమంలో మిస్టర్ కూల్.. తన వింటేజ్ స్టైల్‌లో రెప్పపాటులో బెయిల్స్‌ను పడగొట్టాడు. ఫీల్డ్ అంపైర్ థర్డ్ అంపైర్‌కు రిఫర్ చేసినప్పటికి.. సూర్య మాత్రం కనీసం వెనక్కి తిరగకుండా మైదానం విడిచివెళ్లిపోయాడు. ధోని కేవలం 0.12 సెకండ్ల వ్యవధిలోనే స్టంప్ ఔట్ చేయడం గమనార్హం. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. ముంబై బ్యాటర్లలో తిలక్ వర్మ(31) టాప్ స్కోరర్‌గా నిలవగా.. ఆఖరిలో దీపక్ చాహర్(28) కీలక ఇన్నింగ్స్ ఆడారు.

# స్పోర్ట్స్

## పాక్‌తో నాలుగో టీ20..

## ఫిన్ అలెన్ ఊచకోత.. న్యూజిలాండ్ భారీ స్కోర్



మౌంట్ మాంగనూయ్ వేదికగా పాకిస్తాన్‌తో ఇవాళ (మార్చి 23) జరుగుతున్న నాలుగో టీ20లో న్యూజిలాండ్ భారీ స్కోర్ చేసింది. ఫిన్ అలెన్, టిమ్ సీఫర్ట్, బ్రేస్‌వెల్ మెరుపు ఇన్నింగ్స్‌లతో విరుచుకుపడటంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. టాస్ ఓడి పాక్ ఆహ్వానం మేరకు బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు ఓపెనర్లు టిమ్ సీఫర్ట్, ఫిన్ అలెన్ సుడిగాలి ప్రారంభాన్ని అందించారు. వీరిద్దరి ధాటికి న్యూజిలాండ్ తొలి నాలుగు ఓవర్లలో 54 పరుగులు చేసింది. 22 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 44 పరుగులు చేసిన అనంతరం సీఫర్ట్ హరీస్ రౌఫ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఖుష్దిల్ షా అద్భుతమైన క్యాచ్ పట్టి సీఫర్ట్‌ను పెవిలియన్‌కు పంపాడు. అప్పటివరకు నివురుగప్పిన నిప్పులా ఉండిన అలెన్.. సీఫర్ట్ ఔట్ కాగానే జూలు విదిల్చాడు. హరీస్ రౌఫ్ మినహా ప్రతి పాక్ బౌలర్‌ను ఎడాపెడా వాయించాడు. షాదాబ్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ 10వ ఓవర్‌లో అలెన్ విధ్వంసం తారా స్థాయికి చేరింది. ఈ ఓవర్‌లో అతను వరుసగా 2 ఫోర్లు, 2 సిక్సర్లు బాది మొత్తంగా 23 పరుగులు పిండుకున్నాడు. ఈ క్రమంలో అలెన్ కేవలం 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. న్యూజిలాండ్ తరఫున టీ20ల్లో ఇది ఎనిమిదో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ. అలెన్ (20 బంతుల్లో 50బీ 6 ఫోర్లు, 3 సిక్సర్లు) ఔటయ్యాక న్యూజిలాండ్ స్కోర్ ఒ?క్కసారిగా మందగించింది. 11 నుంచి 16వ ఓవర్ వరకు పాక్ బౌలర్లు అద్భుతంగా బౌల్ చేశారు. 10వ ఓవర్ తర్వాత 134 పరుగులున్న న్యూజిలాండ్ స్కోర్ 16 ఓవర్ల తర్వాత 166 పరుగులుగా మాత్రమే ఉంది. ఈ 6 ఓవర్లలో న్యూజిలాండ్ 3 వికెట్లు కోల్పోయి కేవలం 32 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆఖర్లో కెప్టెన్ బ్రేస్‌వెల్ మూగబోయిన న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌ను మేల్కొలిపాడు. బ్రేస్‌వెల్ వచ్చీ రాగానే పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 17వ ఓవర్‌లో షాహీన్ అఫ్రిది బౌలింగ్‌లో వరుసగా సిక్సర్, బౌండరీ బాదిన బ్రేస్‌వెల్ ఆతర్వాత మరో అఫ్రిది (అబ్బాస్) వేసిన ఓవర్‌లోనూ అదే సీన్‌ను రిపీట్ చేశాడు. ఆ ఓవర్‌లో బ్రేస్‌వెల్‌తో పాటు డారిల్ మిచెల్ కూడా చెలరేగడంతో న్యూజిలాండ్‌కు 23 పరుగులు వచ్చాయి. 19వ ఓవర్‌లో డారిల్ మిచెల్ ఔట్ కావడంతో స్కోర్ మళ్లీ నెమ్మదించింది. ఆ ఓవర్‌లో కేవలం? 5 పరుగులే వచ్చాయి. షాహీన్ అఫ్రిది వేసిన చివరి ఓవర్‌లో బ్రేస్‌వెల్ మరోసారి విరుచుకుపడటంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 220 పరుగుల వద్ద ముగిసింది. 26 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 46 పరుగులు చేసిన బ్రేస్‌వెల్ అజేయంగా నిలిచాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో చాప్‌మన్ 24, డారిల్ మిచెల్ 29, నీషమ్ 3, హే 3 పరుగులు చేసి ఔటయ్యారు. పాక్ బౌలర్లలో హరీస్ రౌఫ్ పొదుపుగా బౌలింగ్ చేయడమే కాకుండా 3 వికెట్లు తీయగా.. అబ్రార్ అహ్మద్ 2, అబ్బాస్ అఫ్రిది ఓ వికెట్ పడగొట్టారు.




# మెరూన్ డ్రెస్సులో మెరిసిపోతున్న జాన్వీ కపూర్

# శివబాలాజీ, మధుమిత క్రేజీ కాంబో..

## గోదారికే సోగ్గాన్నే సాంగ్

టాలీవుడ్‌లో మంచి గుర్తింపు సంపాదించుకున్న సెలబ్రిటీ కపుల్స్‌లో ముందు వరుసలో ఉంటారు శివ బాలాజీ-మధుమిత. ఈ రియల్ లైఫ్ కపుల్ కాంబో క్రేజీ పాటతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. గోదారికే సోగ్గాన్నే అనే జానపద గీతంలో నటించడం విశేషం. సోషల్ మీడియాలోని ఇన్‌ఫ్లూయెన్సర్ టాలెంట్‌ను వెలికితీయాలనే ఉద్దేశంతో ఈ మ్యూజికల్ ఆల్బమ్‌ను మొదలుపెట్టారని చెప్పింది మధుమిత. గోదారి యాసలో సాగే ఈ మ్యూజికల్ ఆల్బమ్ 8 నిమిషాల కంటెంట్‌తో ఉంటుంది. మేమిద్దరం సింగిల్ టేక్‌లో చేశామని శివబాలాజీ అన్నాడు. ఈ ఆల్బమ్‌ను మంచు విష్ణు హెూంబ్యానర్ అవా ఎంటర్‌టైన్‌మెంట్‌పై రూపొందించారు. గోదారికే సోగ్గాన్నే పాటపై మీరూ ఓ లుక్కేయండి.







## నో అప్డేట్స్.. అభిమానులకు నిరాశ తప్పదేమో!

ప్రస్తుతం రామ్ చరణ్, అల్లు అర్జున్ పాన్ ఇండియా హీరోలుగా ఫుల్ క్రేజ్ సంపాదించారు. చరణ్ ప్రస్తుతం ఓ మూవీ చేస్తున్నాడు. మరో మూవీ లైనులో ఉంది. బన్నీ కూడా రెండు సినిమాల కోసం సిద్ధమవుతున్నాడు. సరిగ్గా ఇలాంటి టైంలో ఓ బ్యాడ్ న్యూస్ అభిమానుల మధ్య చర్చకు కారణమవుతోంది. హీరోలన్నాక సినిమాలు చేస్తుంటారు. మంచి రోజులు చూసుకుని అప్డేట్స్ ఇస్తుంటారు. ఇక పుట్టినరోజున గ్లింప్స్, పోస్టర్స్ లాంటివి రిలీజ్ చేస్తుంటారు. త్వరలో చరణ్ (మార్చి 27), బన్నీ (ఏప్రిల్ 8) బర్త్ డేలు రాబోతున్నాయి. దీంతో కొత్త మూవీ అప్డేట్స్ కోసం ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. కానీ ఈసారి అలాంటివేం ఉండవని తెలుస్తోంది. చరణ్-బుచ్చిబాబు సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. కొన్నిరోజుల క్రితం ఈయన గుండెల్లో నొప్పి రావడంతో ఆస్పత్రిలో చేరారు. డిశ్చార్జ్ కూడా అయిపోయి ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే గ్లింప్స్ విజువల్స్ రెడీ అయిపోయినా సరే మ్యూజిక్ బాకీ ఉండటంతో చరణ్ పుట్టినరోజు దీన్ని రిలీజ్ చేయడం కష్టమేనని మాట్లాడుకుంటున్నారు. మరోవైపు అల్లు అర్జున్ కొత్త మూవీస్ కి సంబంధించి పుట్టినరోజున అనౌన్స్ మెంట్స్ ఉండొచ్చని అనుకున్నారు. కానీ బన్నీ నానమ్మ ప్రస్తుతం వెంటిలేటర్ పై ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త సినిమాల ప్రకటన సరికాదని, వాయిదా వేసుకున్నట్లు సమాచారం. ఈ రూమర్స్ బట్టి చూస్తే త్వరలో మంచి రోజు చూసుకుని చరణ్, బన్నీ మూవీస్ అప్డేట్స్ రిలీజ్ చేస్తారనిపిస్తుంది.

## థియేటర్స్‌లో ఈ సినిమాలు అట్టర్ ఫ్లాప్.. ఓటీటీలో మాత్రం రచ్చో రచ్చః

ఈ మధ్య కాలంలో ఎత పెద్ద హిట్ అయిన సినిమా అయిన రిలీజ్ అయిన కొద్ది రోజుల వ్యవధిలోనే థియేటర్స్‌లోకి వచ్చేస్తుంది. సినిమా హిట్ అయితే రెండు నెలల్లో ఓటీటీలో సందడి చేస్తుంది. అదే యావరేజ్ అయితే నెల కాకముందే ఓటీటీలో స్ట్రీమ్ అవుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. అయితే కొన్ని సినిమాలు థియేటర్స్‌లో పెద్దగా హిట్ కాకపోయిన ఓటీటీలో మాత్రం సందడి చేశాయి. థియేటర్లలో బొక్క బోర్లా పడ్డ పడి డిజిటల్ ప్లాట్ ఫామ్స్ లో ఆ రెండు సినిమాలు ట్రెండింగ్ లో దూసుకుపోతున్నాయి. ఈ ఏడాది ఒకే రోజు థియేటర్లలో విడుదలైన సినిమాలు థియేటర్స్‌లో పెద్దగా అలరించలేకపోయాయి. కాని ఓటీటీ ట్రెండింగ్ లో దూసుకుపోతున్నాయి. అవి మరేవో కాదు ఎమర్జెన్సీ.. ఆజాద్. బాలీవుడ్ కాంట్రవర్సీ క్వీన్ కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో వచ్చిన హిస్టారికల్ పొలిటికల్ డ్రామా ఎమర్జెన్సీ చిత్రం ఈ ఏడాది జనవరి 17న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇందులో కంగనా ఇందిరా గాంధీ పాత్రలో కనిపించి అలరించింది. అయితే దాదాపు రూ.60 కోట్ల బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.22 కోట్ల కలెక్షన్స్ మాత్రమే రాబట్టింది. కాకపోతే నెట్‌ఫ్లిక్స్ లో ఓటీటీలో స్ట్రీమ్ అవుతున్న ఈ చిత్రం టాప్ 3 ట్రెండింగ్ ప్లేస్ లో ఉంది. అంతేకాదు ఈ చిత్రానికి ఐఎమ్డీబీ 5.2 రేటింగ్ ఇచ్చింది.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com